RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com

భారత శక్తి®

తెలుగు దినపత్రిక

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 19 సంచిక:135 | హైదరాబాద్, శనివారం, 23 నవంబర్ 2024 | పేజీలు: 12 వెల: 1.00

భారీ ఎన్‌కౌంటర్.. మృతుల్లో అగ్రనేతలు

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. సుక్మా జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఇవాళ(శుక్రవారం) తుపాకుల మోత కలకలం రేపింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది మావోలు మృతిచెందినట్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల్లో కీలక నేతలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిన్టులు మృతిచెందినట్లు పోలీనులు చెబుతున్నారు. సుక్మా జిల్లాలో భద్రతా దళాలు, మావోయిస్టులు మధ్య ఎదురు ఎదురు కాల్పులు జరిగడంతో హై అలర్ట్ ప్రకటించారు.

సుక్మా జిల్లాలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా దళాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో భద్రతా దళాలు, మావోలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఒకరిపై ఒకరు తూటాల వర్షం కురిపించుకుంటూ ఇరువర్గాలు భీకరంగా పోరాడుతున్నాయి.

ఎదురు కాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్ని మృతదేహాలను ఘటనా స్థలంలో గుర్తించినట్లు భద్రతా దళాలు తెలిపాయి. అలాగే మృతుల నుంచి భారీఎత్తున ఆటోమేటెడ్ ఆయుధాలు, ఏకే 47 సహా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు భద్రతా దళాలు తెలిపాయి.

ఛత్తీస్‌గఢ్ అడవులు ఇక తమకు ఎంతమాత్రం సురక్షితం కాదని మావోయిస్టులు భావిస్తున్నారా? ఇరవై ఏళ్లుగా దండకారణ్యం కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మావోయిస్టులు అక్కడే ఉంటే క్యాడర్‌ను మరింతగా నష్టపోతామనే అంచనానికొచ్చేశారా? ప్రస్తుతం వారు తెలంగాణ వైపు చూస్తున్నారా? కొన్నాళ్లుగా దండకారణ్యంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టడం.. పలు విభాగాలకు చెందిన కేంద్ర బలగాలతో విరామం లేకుండా కూంబింగ్ నిర్వహిస్తుండటం.. తరచూ భారీ ఎన్‌కౌంటర్లు జరుగుతుండటం.. పెద్ద ఎత్తున ఉద్యమకారులను కోల్పోతుండటంతో మావోయిస్టులు పునరాలోచనలో పడ్డట్టు సమాచారం.

ఇటీవలే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నక్సలిజంపై కీలక వ్యాఖ్యలు చేశారు. జార?ండ్, బీహార్, తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో మావోయిస్టు తీవ్రవాదం అంతమైందని.. ఛత్తీస్‌గఢ్‌లోని మూడు, నాలుగు జిల్లాల్లో ఈ సమస్య కొనసాగుతోందని అన్నారు. దాన్ని అణచివేసేందుకు కృషి చేస్తామని అమిత్ షా పేర్కొన్నారు.

నక్సలైట్లపై ఉక్కుపాదం..

అప్పటి సీపీఐ (ఎంఎల్) పీపుల్స్‌వార్ నక్సల్స్ గ్రూపు తన ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో దేశంలో బలమైన నక్సల్స్ ఉద్యమాన్ని నడుపుతున్న మరో రెండు విప్లవ సంఘాలైన మావోయిస్టు, కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీ), సీపీఐ (ఎంఎల్) నక్సల్బరీ గ్రూపులతో విలీనమై సెప్టెంబరు 21, 2004లో సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడింది. ఉమ్మడి ఏపీలో బలమైన శక్తిగా ఉన్న పీపుల్స్‌వార్ మావోయిస్టు పార్టీగా మారటంతో అప్పటి వైఎస్ ప్రభుత్వం నక్సలైట్లపై ఉక్కుపాదం మోపింది. ఫలితంగా అప్పట్లోనే మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌కు మకాం మార్చారు. ఈ క్రమంలో సెప్టెంబరు 21వ తేదీ నుంచి అక్టోబరు 30వ తేదీ వరకు 20 ఏళ్ల వార్షికోత్సవాలను మావోయిస్టులు జరుపుకొంటున్న నేపథ్యంలో శుక్రవారం ఆ పార్టీకి అత్యంత భారీ ఎదురుదెబ్బ తగిలింది.

భారీ షాక్..

నారాయణ్‌పూర్- దంతేవాడ అడవుల్లో గతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31 మంది మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఇది మావోయిస్టు పార్టీకి భారీ షాక్‌గా భావిస్తున్నారు. ఇటీవల పలు ఎన్‌కౌంటర్లలో మావోయిస్టు పార్టీ పెద్ద సంఖ్యలో కేడర్‌ను కోల్పోయింది. కారణం.. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చాక ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా నక్సల్స్ ఏరివేతే లక్ష్యంగా పలు ఆపరేషన్లు మొదలు పెట్టారు. వీటిలో ప్రధానంగా ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ కగార్‌లతో కేంద్ర బలగాలు దండకారణ్యంలో మావోయిన్టలపై విరుచుకుపడుతున్నాయి. 2024 జనవరి నుంచి జూలై వరకే పోలీసు దాడుల్లో 171 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఈ 20ఏళ్లలో పోలీసు దాడుల్లో 5,285 మంది మావోయిస్టులు చనిపోయినట్లు అంచనా. మూడున్నరేళ్లలో 475 మందిని కోల్పోయినట్లుగా మావోయిస్టులు పేర్కొంటున్నారు.

అదానీ లంచం వ్యవహారంలో కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన టీపీసీసీ చీఫ్..

హైదరాబాద్: దిగ్గజ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ లంచం వ్యవహారం తెలంగాణ రాజకీయాలను వేడెక్కిస్తోంది. అదానీ అంశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. అలాగే ప్రధాని మోదీపైనా నిప్పులు చెరిగారు. స్కిల్ యూనివర్శిటీకి అదానీ నుంచి

తెలంగాణ సర్కార్ రూ.100 కోట్లు తీసుకోవడం తప్పు కాదా అని కేటీఆర్ ప్రశ్నించడంపై మహేశ్ గౌడ్ స్పందించారు. స్కిల్ యూనివర్సిటీకి కేటీఆర్ విరాళం ఇచ్చినా తీసుకుంటామంటూ ఆయన చురకలు అంటించారు.

అదానీకి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఇంచు భూమీ ఇవ్వలేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తెలిపారు. నేరం రుజువైతే అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటామని ఆయన తేల్చి చెప్పారు. అదానీ అరెస్టయితే ప్రధాని మోదీ రాజీనామా తప్పదని టీపీసీసీ చీఫ్ జోస్యం చెప్పారు. అదానీ ఆర్థిక నేరంలో మోదీకీ భాగస్వామ్యం ఉందంటూ మహేశ్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. అదానీని వెంటనే అరెస్టు చేయాలని, లంచం అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ అరెస్టయితే అనేక అంశాలు బయటకి వస్తాయని చెప్పుకొచ్చారు. మోదీ ప్రభుత్వంలో ఆయన వేల కోట్ల లబ్ధి పొందారని, అదానీ ఆగడాలపై రాహుల్ ఎన్నిసార్లు ప్రశ్నించినా మోదీ కనీసం స్పందించలేదని మహేశ్ గౌడ్ మండిపడ్డారు. అర్హత లేకున్నా అదానీ రుణాలు పొందారని, ఆయన వల్ల ప్రజలపై పెను భారం పడిందని ఆగ్రహించారు. అనేక దేశాలనూ అదానీ మోసం చేశారంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

కెన్యా దేశం మాదిరిగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదానీతో చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. అదానీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ.. ఢిల్లీలో ఒకలా తెలంగాణలో మరోలా మాట్లాడుతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. అదానీ అవినీతిపరుడు అయినప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నీతిపరుడు ఎలా అవుతాడో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్శిటీకి అదానీ నుంచి రేవంత్ రెడ్డి సర్కార్ రూ.100 కోట్లు తీసుకోవడం తప్పు కాదా అంటూ ప్రశ్నించారు. కోహినూరు హోటల్లో మంత్రి పొంగులేటి, అదానీ రహస్య సమావేశం నిజం కాదా అంటూ ధ్వజమెత్తారు. అదానీతో దేశానికి నష్టమైతే తెలంగాణకు నష్టం కాదా అంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే అదానీతో తెలంగాణ సర్కార్ చేసుకున్న ఒప్పందాలు వెంటనే రద్దు చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మహారాష్ట్ర వెళ్లి అదానీని గజదొంగ అని చెప్పిన రేవంత్.. తెలంగాణలో మాత్రం ఆయనకు గజమాల వేశారంటూ ధ్వజమెత్తారు.

చెరువుల రక్షణ కోసం హైడ్రా కీలక నిర్ణయం

హైదరాబాద్: హైడ్రా ఈ ఏడాది జూలైలో ఏర్పడిందని.. అర్బన్ డిజాస్టర్స్, ఎంక్రోచ్‌ల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఇవాళ(శుక్రవారం) బుద్ధ భవన్ హైడ్రా కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు కమిషనర్ రంగనాథ్ కీలక సమావేశం నిర్వహించారు. రిటైర్డ్ ఈఎన్సీలు, ఇరిగేషన్ నీఈలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కనుమరుగైన చెరువులపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను అధికారులు నిర్ణయించారు.

%ఇకపై చెరువులు అన్యాక్రాంతం కాకుండా హైడ్రా చీఫ్ రంగనాథ్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. "ఐఎండీ 1875లో ఏర్పడింది. హైడ్రా జీహెచ్ఎంసీలో భాగం కాదు. ఇది వరకు ఈవీడీఎం పేరుతో జీహెచ్ఎంసీలో భాగంగా ఉండేది.. అప్పుడు ఐఏఎస్‌లు, కమిషనర్లు ఉండేవారు. ఇప్పుడు సెపరేట్ వింగ్‌గా ఏర్పడింది. హైడ్రాకు మొదటి కమిషనర్‌గా ఉండటం సంతోషంగా ఉంది.దేశంలోనే మొదటి సారి హైడ్రా తీసుకొచ్చారు. కేవలం జీహెచ్ఎంసీలో మాత్రమే కాకుండా చుట్టుపక్కల ఉన్న మరో 27 మునిసిపాలిటీల పరిధిలో హైడ్రా పనిచేస్తుంది.. వాటర్ బాడీస్, గవర్నమెంట్ ల్యాండ్స్, పబ్లిక్ అసెట్స్, లేక్స్ ఆక్రమణలకు గురవుతున్నాయి.. వాటికోసం హైడ్రా పనిచేస్తుంది. హైదరాబాద్ అంటేనే గొలుసు కట్టు చెరువులు.. ఒక చెరువుకు మరో చెరువుకు కనెక్టివిటీ ఉండేది..ఇప్పుడు కనెక్టివిటీ లేదు. నాలాలు కూడా సరిగా లేవు. గట్టి వర్షం పడితే ముంపుకు గురవుతాయి..దివి సీమ ఉప్పెన వచ్చినప్పుడు 10వేల మంది చనిపోయారు. పేదరికం వల్ల చాలామంది ముందస్తు సమాచారం లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయారు.

"ఐఎండీ వల్ల ముందే ఊహించగలుగుతున్నారు.. డిజాస్టర్స్‌లో కూడా మార్పులు వస్తున్నాయి..దేశంలో అర్బనైజేషన్ పెరుగుతుంది.తెలంగాణలో అర్బనైజేషన్ పెరుగుతుంది. వెహికిల్ పాపులేషన్ 80 లక్షలుగా ఉంది. సిటీ ట్రాఫిక్ అడిషినల్ సీపీగా కూడా ఉన్నాను. 2, 3 సెంటిమీటర్ల వర్షం పడితే మూడు, నాలుగు గంటలు ట్రాఫిక్ జామ్ అవుతుంది. మెట్రో సిటీలలో వాతావరణ మార్పులు ఎక్కువగా ఉన్నాయి. క్లౌడ్ బరస్ట్స్ కూడా పెరుగుతున్నాయి. నాలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి.. వర్షం పడినప్పుడు వరద నీరు ఇంకడానికి చాలా సమయం పడుతుంది. సాయంత్రం 4, 5 గంటలకు వర్షం పడితే భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.. ఆ నీరు ఇంకడానికి మార్గాలు లేవు.. సిటీలో 150 వాటర్ లాగింగ్స్ ఉన్నాయి. అర్బన్ డిజాస్టర్‌ల మీద ఫోకస్ పెట్టాలి.157 ఏడబ్ల్యూఎస్ స్టేషన్స్ ఉన్నాయి.. ఇంకా కావాలి. ప్రతి 15నిమిషాలకు బెంగుళూరులో ఏడబ్ల్యూఎస్ స్టేషన్‌ల నుంచి డేటా కలెక్ట్ చేస్తారు.. మనం కూడా దీనికి మారాలి. సిటీలో వెదర్ రెడర్స్ కావాలి..జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హిల్ ఏరియాల్లో పెట్టాల్సిన అవసరం ఉంది. వెదర్ అలర్ట్స్ స్పెసిఫిక్‌గా ఉండాలి. ఇక్కడ వర్షం పడుతుందని కాకుండా ఇక్కడ పడదని చెప్పేలా వెదర్ అలర్ట్స్ ఉండాలి. వర్షాలు పడుతున్నపుడు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవడం వల్ల ఎకనామికల్ లాస్ కూడా ఏర్పడుతుంది..హైడ్రా, ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. అర్బన్ డిజాస్టర్స్ కో సంబంధించి ఐఎండీతో కలిసి పనిచేస్తుంది. నేను మెకానికల్ ఇంజనీర్‌ని, అయినా వీటి గురించి తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాను. ప్రజలు వెదర్ అలర్ట్స్‌ని సీరియస్‌గా తీసుకునేలా హైడ్రా పని చేస్తుంది" అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగిన కేటీఆర్..

హైదరాబాద్: పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ఒకలా, గల్లీలో మరోలా మాట్లాడున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అదానీ విషయంలో కాంగ్రెస్ పార్టీ నేతలంతా రెండు నాలుకల ధోరణితో ఉన్నారని కేటీఆర్ మండిపడ్డారు. అదానీతో తెలంగాణ సర్కార్ చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. "అదానీ అవినీతిపరుడైతే సీఎం రేవంత్ రెడ్డి నీతిపరుడు ఎలా అవుతాడో రాహుల్ గాంధీ చెప్పాలి. రాహుల్ గాంధీకి చిత్తశుద్ధి ఉంటే అదానీతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయించాలి. కెన్యా లాంటి చిన్న దేశాలే రద్దు చేసుకున్నప్పుడు రేవంత్ ఎందుకు రద్దు చేసుకోరు?. అదానీతో ఒప్పందాలపై పునరాలోచన చేయాలని ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి సైతం అన్నారు. ఈ అంశంలో షర్మిల సూచనలను ముఖ్యమంత్రి తీసుకోవాలి. మహరాష్ట్ర వెళ్లి అదానీని గజదొంగ అన్న రేవంత్.. తెలంగాణలో మాత్రం గజమాల వేస్తున్నారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలపై తెలంగాణ బీజేపీ వైఖరి ఏంటో చెప్పాలి?. అదానీ వ్యవహారంతో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని మరోసారి రుజువైంది.

అదానీతో దేశానికి నష్టమైతే తెలంగాణకు నష్టం కాదా?. దీనిపై రాహుల్ గాంధీ జవాబు చెప్పాలి. స్కిల్ యూనివర్శిటీకి

రూ.100 కోట్లు తీసుకోవడం తప్పా?.. కాదా?. కోహినూరు హోటల్లో మంత్రి పొంగులేటి, అదానీ రహస్య సమావేశమైన మాట వాస్తవం. ఆయనతో రేవంత్ సర్కార్ రద్దు ఒప్పందాలు చేసుకోవటం లేదు?. అదానీ వేల కోట్ల రూపాయల ఒప్పందాలపై రోజూ విమర్శించే రాహుల్ దీనికి సమాధానం చెప్పాలి. రాహుల్‌కి తెలిసే రేవంత్ రెడ్డి విరాళం తీసుకున్నారా?. జాతీయ పార్టీకి ఢిల్లీలో ఒక నీతి ఉంటే గల్లీలో మరొక నీతి ఉంది. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్ అయితే కాంగ్రెస్ డబుల్ స్టాండర్డ్ పార్టీనా?

కేసీఆర్ హయాంలో ఎంత ప్రయత్నం చేసినా తెలంగాణలో అదానీకి అవకాశం ఇవ్వలేదు. ఆయనతో మేము ఫొటోలు దిగిన మాట వాస్తవం. అంతే మర్యాదగా బయటకు పంపించాం. రేవంత్ మాత్రం అదానీకి ఎర్ర తివాచీ పరచి స్వాగతం పలికారు. అదానీతో చేసుకున్న రూ.12,400 కోట్ల ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలి. బడే బాయ్ మోదీ ఆదేశాలను చోటా బాయ్ రేవంత్ అమలు చేశారు.

మహారాష్ట్ర, జార?ండ్‌కు కాంగ్రెస్ పరిశీలకులు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర జారాండ్ ఎన్నికలు ముగిసి శనివారంనాడు ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నియామకాలు చేపట్టింది. ఎన్నికల అనంతర వ్యూహాలు, పొత్తులను కూడగట్టడంపై ఆ రెండు రాష్ట్రాలకు ఏఐసీసీ పరిశీలకులను నియమించింది.

మహారాష్ట్రలో రాజకీయ పరిస్థితిని పరిశీలించి తగిన చర్యలు తీసుకునే బాధ్యతను సీనియర్ నేతలు అశోక్ గెహ్లోట్, భూపేష్ బఘెల్, డాక్టర్.జి.పరమేశ్వరకు అప్పగించినట్టు ఏఐసీసీ ప్రతినిధి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జారాండ్ పరిశీలకులుగా తారిఖ్ అన్వర్, మల్లు భట్టి విక్రమార్క, కృష్ణ అల్లవరును నియమించారు. పరిశీలకులు అవసరమైన వ్యూహాత్మక మార్గదర్శకాలు చేస్తూ, ప్రభుత్వ ఏర్పాటు, కూటమి వ్యూహాలపై కేంద్ర నాయకత్వానికి నివేదిక ఇస్తారు. మహారాష్ట్ర, జారాండ్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య శనివారం ఉదయం 8 గంటలకు మొదలవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లు లెక్కిస్తారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరుగగా, 65.02 శాతం పోలింగ్ నమోదైంది. బీజేపీ-శివసేన-ఎన్‌సీపీ మహాయుతి కూటమి, కాంగ్రెస్-శివసేన (యూబీటీ), ఎన్‌సీపీ(ఎస్‌పీ) మహా వికాస్ అఘాడి మధ్య ఇక్కడ హోరాహోరీ పోరు జరిగింది. క

పదేళ్లు పోయో... మరో పదేళ్లు ఆగాలా...

విజయవాడ, నవంబర్ 22, (

గత ఎన్నికలలో తాను పోటీచేసిన రెండు స్థానాలలోనూ ఓడిపోయారు పవన్ కళ్యాణ్. పవన్ పని అయిపోయింది. ఇక రాజకీయ అస్త్ర సన్యాసం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని ప్రతిపక్షాలు గేలిచేశాయి. అయినా అవన్నీ పట్టించుకోకుండా పవన్ కళ్యాన్ తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగారు. గత ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం బాగా కనిపించింది. అనూహ్యంగా కూటమి పక్షాలకు అఖండ విజయం అందించారు ప్రజలు. జనసేన కూడా తనకు కేటాయించిన సీట్లను నిలబెట్టుకోవడమే కాకుండా రెండు పార్లమెంట్ సీట్లు కూడా గెలిపించుకుంది. పవన్ ఏ పదవీ ఆశించకుండానే డిప్యూటీ సీఎం వంటి కీలక పదవి లభించింది. ఏపీలో ఇప్పుడు ఎక్కడ చూసినా జనసేన ప్రభంజనమే కనిపిస్తోంది. అయితే జనసేనానిఉ ండుండి ఓ బాంబు పేల్చారు. శాసనసభ సాక్షిగా మరో పదేళ్లు చంద్రబాబే సీఎం అని స్టేట్ మెంట్ ఇచ్చిపారేశారు.అభిమానులకు అదే మింగుడు పడటం లేదు.తమ అభిమాన నాయకుడిని సీఎంగా చూద్దామని పదేళ్లుగా ఎదురుచూస్తున్నారు పవర్ స్టార్ ఫ్యాన్స్ .అనుకోకుండా అనూహ్యంగా జనసేనకు వైసీపీ నుంచి వలసలు మొదలయ్యాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పవన్ కళ్యాణ్ సీఎం అని అందరూ అనుకుంటున్నారు. వయసు రీత్యా చంద్రబాబు కూడా వేరొకరికి అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి. ప్రస్తుతం సీఎం రేసులో ఉన్న లోకేష్ కన్నా పవన్ అన్ని విషయాలలోనూ ముందంజలో ఉన్నారు. ఇక కేంద్రంలో బీజేపీ మద్దతు ఎలాగూ ఉండనే ఉంది. ఇన్ని అనుకూలతలు ఉండగా పవన్ ఎందుకలా మరో పదేళ్లు చంద్రబాబే సీఎం అని ఎందుకన్నారో ఎవరికీ అర్థం కావడం లేదు.జనసేనను స్థాపించిన పదేళ్ల తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు జనసేనాని. నిదానమే ప్రదానమనే సిద్ధాంతాన్ని అనుసరించే పవన్ కళ్యాణ్ పదవులు ఆశించకుండా..పార్టీని భూస్థాపితం చేయకుండా..ఏ పార్టీలోనూ విలీనం చేయకుండా..కేవలం తనని నమ్ముకున్న కార్యకర్తల కోసం పార్టీ సిద్ధాంతాలనే నమ్ముకుని నడిపించుకుంటూ వస్తున్నారు. పార్టీ స్థాపించినప్పుడు ఆర్థిక సమస్యలు. అందుకోసమే సినిమాలలో నటించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో పార్టీని నడిపించుకుంటూ మధ్యమధ్య ఉచితంగా సామాజిక సేవలు, తన సొంత డబ్బుతో విద్యార్థులకు ఫీజులు, పేదలకు వైద్య సేవలు లాంటి గుప్త సాయాలు చేస్తూ వచ్చారు. మొన్నటి ఎన్నికలలో అనూహ్యంగా బీజేపీని టీడీపీని తన జనసేనతో కలిపి ఓ కూటమిని ఏర్పాటు చేశారు. జగన్ పై జన గర్జన చేశారు. పదేళ్ల తపస్సు ఫలించిందిప్రజలలో అనూహ్యంగా నమ్మకం పెరిగిపోయింది. ఇప్పుడు ఓటమి నుంచి కూటమి దాకా చేరుకున్నారు. ఇప్పుడు కూటమిలో ఉన్న మూడు పార్టీలలో జనసేనకు అనూహ్యంగా వలసలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వైసీపీ నుంచి జనసేనకు క్యూ కడుతున్నారువైసీపీ కూడా వచ్చే అసెంబ్లీ నాటికి పుంజుకోవడం కష్టమే. అలాంటప్పుడు జనం కొత్త నేతను కోరుకోవడం సహజమే. జగన్ కూడా ఒక్క ఛాన్స్ అంటూ వచ్చారు. అయితే ఆ ఛాన్స్ దుర్వినియోగం కావడంతో అది కాస్తా మొన్నటి ఎన్నికలలో మిస్ ఫైర్ అయింది. మళ్లీ జగన్ కు అధికారం రావాలంటే విశ్వప్రయత్నమే చేయాలి. ఈలోగా జనసేన మరింత బలంగా తయారవుతోంది. బీజేపీ సపోర్టు తో వచ్చే ఎన్నికలలో క్రియాశీలక శక్తిగా మారనుంది.ఇన్నాళ్లూ పవన్ స్థాపించిన జనసేన నుంచి కార్యకర్తలు కూడా పార్టీని ,తమ నేతను జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. వారికి కావలసిందల్లా తమ నాయకుడిని సీఎం సీటులో చూడాలని. ఇంతకాలం కళ్లలో ఒత్తులు వేసుకుని ఈ అవకాశం కోసమే ఎదురుచూశారు. అయితే పవన్ ను అనూహ్యంగా డిప్యూటీ సీఎం పదవి వరించింది. రాష్ట్రంలో సెకండ్ ప్లేస్ దక్కించుకున్నారు. ఇటు చంద్రబాబు, అటు మోదీ కూడా పవన్ కే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే మొదటి నుంచీ పదవీ వ్యామోహం లేనట్లుగా ఉండే పవన్ కళ్యాణ్ కు ఇది తేలికైన విషయమే. కాగా కార్యకర్తలు మాత్రం జీర్ణించుకోలేకపోవున్నారుఇక ఎప్పటినుంచో కాపు వర్గం నేతలు కూడా తమ నత్తా నిరూపించుకునే సమయం వచ్చిందని ఆనందపడుతున్నారు. చిరంజీవి సైతం కాపు వర్గం మద్దతు దక్కించుకోలేకపోయారు. కనీసం పదళ్లకయినా పవన్ కు ఆ ఆవకాశం లభించింది. ఈ పరిస్థితిలో తమ వర్గానికి అండగా ఉంటాడు పవన్ అని భావిస్తున్న తరుణంలో పవన్ పేల్చిన బాంబు కాపు వర్గాలు సైతం జీర్ణించుకోలేకపోతున్నాయి.పవన్ చెప్పినదాన్ని బట్టి మరో పదేళ్లు అంటే ఇప్పటి ఐదేళ్లతో కలుపుకుంటే మరో పదేళ్లు కలిపి 15 సంవత్సరాలన్నమాట. 15 ఏళ్లు ఎదురుచూడటమంటే మాటలు కాదు. పవన్ మాత్రం గోల్డెన్ ఛాన్స్ పదులుకుంటున్నారని కార్యకర్తలు, కాపు వర్గం భావిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలపరిచే సమయం వచ్చింది. వైకాపా కూడా రేసులో వెనకబడింది. ఇదే సమయంలో జనం కూడా పవన్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో పవన్ డైలాగ్ అందరినీ డైలమాలో పడేసింది

లీడర్ల లెటర్ల కోసం తిరిగేపని లేకుండా శ్రీవారి వీఐపీ దర్శనం

తిరుమల, నవంబర్ 22,

తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి ఒక్క హిందువుకు ఎంతో ముఖ్యం. పుట్టిన రోజు నాడు అయినా .. జీవితంలో ఏదైనా సాధించిన రోజు అయినా.. దూర ప్రాంతంలో ఉండి సొంత రాష్ట్రానికి వచ్చినా ముందుగా శ్రీవారి దర్శనం చేసుకోవాలని అనుకుంటారు.అందుకే తిరుమల కొండలపై ఎప్పుడూ విపరీతమైన రద్దీ ఉంటుంది. 300 దర్శనం టిక్కెట్లను మూడు నెలల ముందుగానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక వీఐపీ దర్శన టిక్కెట్లకు అయితే రాజకీయ నేతల సిఫారసు లేఖలు అవసరం. అయితే రాజకీయ నేతల సిఫారసు లేఖలు అవసరం లేకుండానే శ్రీవారి పథకం ద్వారా వీఐపీ దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. ఎయిర్ పోర్టునూ ఈ ఫెసిలిటీ ఉంది. రేణిగుంట విమానాశ్రయంలో దిగిన వెంటనే శ్రీవాణి టిక్కెట్లు కొనుగోలు చేసి వీఐపీ దర్శనానికి వెళ్లవచ్చు. ఇప్పటి వరకూ ఉన్న శ్రీవాణి టికెట్ల సంఖ్య పెంచుతూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. రేణిగుంట విమానాశ్రయంలో ప్రతిరోజూ జారీ చేస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల సంఖ్యను టీటీడీ 100 నుండి 200 కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో భక్తులు టికెట్లను బుక్ చేసుకోవచ్చని తెలిపింది. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో మాత్రమే ఈ ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేస్తారు. అలాగే తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం వెనుక వైపు ఉన్న శ్రీవాణి టికెట్ కౌంటర్ లో ఆఫ్ లైన్ లో జారీ చేస్తున్న టికెట్ల సంఖ్యను 900 నుండి 800 కు తగ్గించారు. మొదటి వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఈ టికెట్లను జారీ చేస్తారు. అంటే రోజుకు వెయ్యి మంది వరకూ వీఐపీ దర్శనం చేసుకోవచ్చు. ఈ దర్శనం టిక్కెట్ రూ. 10వేలు ఉంటుంది. ఇప్పటి వరకూ శ్రీవాణి ట్రస్ట్ కు పదివేలు విరాళం ఇచ్చే వారికి రూ. 500 కలిపి మొత్తం పదివేల ఐదు వందలకు ఈ టిక్కెట్ ఇస్తున్నారు. నిధులన్నీ శ్రీవారి ట్రస్టుకు వెళ్లేవి. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రూల్స్ మార్చారు. తిరుమలలో కొత్త టీటీడీ బోర్డు ఏర్పడిన తర్వాత కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుటున్నారు. ఈ క్రమంలో రాజకీయ నేతల వద్దకు వెళ్లడం కన్నా ఇలా శ్రీవాణి టిక్కెట్లు కొనుగోలు చేయడం మంచిదని భావించే వారి కోసం ఈ ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వీఐపీ టిక్కెట్ల పేరుతో రాజకీయ నేతలు టిక్కెట్లు అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మాస్టర్ ప్లాన్ కు అనుగణంగా లేని అభివృద్ధి

టీటీడీ మాస్టర్ ప్లాన్ 2019లో రూపొందించినా దానికి అనుగుణంగా అభివృద్ధి పనులు, నిర్మాణాలు జరగలేదని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. చారిత్రాత్మక చరిత్ర ఉట్టిపడేలా నిర్మాణాలు జరగడం లేదని అభిప్రాయపడ్డారు. పవిత్రత అనేది లేకుండా భవన నిర్మాణాలు చేశారని, తిరుమలలో కట్టిన నిర్మాణాలు సొంత పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు.తిరుమలలో పలువురు ప్రైవేట్ వ్యక్తులకు టీటీడీ భూమి కేటాయించడం ద్వారా స్వామి వారి భక్తుల కోసం వసతి గృహాలను నిర్మించి వాటిని టీటీడీకి అప్పగించే పద్ధతి ఎప్పటి నుంచో ఉంది. ఈ క్రమంలో కొందరు టీటీడీ కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చేపట్టి వాటికి సొంత పేర్లను పెట్టుకోవడాన్ని గుర్తించారు. అలాంటి నిర్మాణాలకు టీటీడీ నుండి కొన్ని పేర్లు ఇస్తామని అవే పేర్లను ఆయా గెస్ట్ హౌస్‌లకు పెట్టుకోవాలని ఈవో స్పష్టం చేశారు. తిరుమలలో కట్టే టౌన్ ప్లానింగ్ ప్రకారం నిర్మించాలని, ఎలాంటి ప్లానింగ్ లేకుండా తిరుమలలో నిర్మాణాలు కట్టేశారని, సరైన నిబంధనలు లేకుండా కట్టినవారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తిరుమలలో నూతన టౌన్ ప్లాన్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు. వచ్చే 25 సంవత్సరాలకు సంబంధించిన విజన్ డాక్యుమెంటరీ తయారు చేస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని చెప్పారు. తిరుమలలో మల్టిలెవల్, స్మార్ట్ పార్కింగ్, పుట్ పాత్ లు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. బాలాజీ బస్టాండ్‌ను వేరేచోటకు తరలించాల్సి ఉందన్నారు.

పీపీపీ మోడల్ లో అభివృద్ధి పనులు

విజయవాడ, నవంబర్ 22,

తెలుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పబ్లిక్,ప్రైవేటు పార్టనర్ షిప్ గురించి ఇటీవలి కాలంలో ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఇప్పటి వరకూ ఈ మోడల్ కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. అయితే చంద్రబాబునాయుడు ఏపీలో అభివృద్ధి పనులకు ఈ మోడల్ అనుసరించాలనుకుంటున్నారు. అంటే రోడ్లను ప్రైవేటు కంపెనీలతో వేయిస్తారు. ప్రజల నుంచి టోల్ వసూలు చేస్తారు. ఇప్పటి వరకూ జాతీయ రహదారుల్లో ఈ విధానం ఉంది. ఇప్పుడు రాష్ట్ర రహదారులకూ తీసుకు వస్తారు. అలాగే గోదావరి నీటిని బనకచర్ల వరకూ తీసుకెళ్లేందుకూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు రూ. 70వేల కోట్లు ఖర్చవుతాయి. అంటే ఆ డబ్బులూ ప్రజలు కట్టాల్సిందే. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నారు. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీలో చెప్పారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో టోల్‌గేట్లు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయన గుర్తు చేసుకున్నారు. అంటే ఇప్పుడు రాష్ట్ర రహదారులపైనా ప్రయాణించాలన్న టోల్ గేట్లు తప్పవన్నమాట.గోదావరి నీటిని పెన్నాకు తరలించడానికి నదుల అనుసంధాన ప్రాజెక్టును చంద్రబాబు పరిశీలిస్తున్నారు. కృష్ణా నదికి తరలించిన గోదావరి మిగులు జలాలను ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురం కు తరలిస్తారు. అక్కడ ప్రకాశం బ్యారేజీ తరహాలో బ్యారేజీ నిర్మిస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లికి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి నల్లమల మీదుగా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించేలా జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల 22 టీఎంసీలను వెలిగొండ ప్రాజెక్టుకు సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఇక బనకచర్ల కాంప్లెక్స్ నుంచి తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు 140 టీఎంసీలను తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 180 టీఎంసీల గోదావరి జలాలను తరలించే వీలుంది. ఈ ప్రాజెక్టు చేపట్టాలంటే రూ.70 వేల కోట్లు కావాలి. అంత మొత్తం ప్రభుత్వం వద్ద ఉండదు. అందుకే చంద్రబాబు ఖఖఖ మోడల్ గురించి ఆలోచిస్తున్నారు.రోడ్లు, ప్రాజెక్టులు ప్రైవేటు, ప్రభుత్వ పార్టనర్ షిప్‌లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఆయా కంపెనీలు ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపిస్తారు. టోల్ వసూలు చేస్తారా నీటి తీరువా వసూలు చేస్తారా మరొకటా అన్నది తర్వాత. రైతుల పంటలకు కావాల్సినంత నీరు సదుపాయం వస్తే.. అంత కంటే కావాల్సిందేమీ ఉండదని అంచనా వేస్తున్నారు. ఖఖఖ విధానంతో ఏపీని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు నుంచీ చెబుతున్నారు . ప్రజల ఆదాయాలను పెంచితే వారు ఈ విధానం ద్వారా మేలు జరిగితే ఎంతో కొంత పన్నులు కట్టేందుకు సిద్ధంగా ఉంటారు. మేలు జరగకపోతే మాత్రం ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.

బెగ్గర్ మాఫియా....

కర్నూలు, నవంబర్ 22,

చిన్న పిల్లలను కిడ్నాప్ చేసి వారితో బిచ్చమెత్తించి ఆ డబ్బులు తాము వాడుకునే రాక్షసుల గురించి సినిమాల్లోనే చూసి ఉంటాం. కానీ నిజంగానే అలాంటి మాఫియా ఉంది. ఏపీలో ఇలాంటి మాఫియాను గుర్తించారు. వారిని పట్టుకునేందుకు అధికారులు రంగంలోకి దిగారు. చిన్న పిల్లవాడు ఒంటి నిండా రంగు పూసుకుని గాంధీ అవతారంలో రోడ్డుపై కునికి పాట్లు పడుతున్న వీడియోను ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో చూసి నారా లోకేష్ చలించిపోయారు. వెంటనే ఎవరో ఏంటో తెలుసుకోవాలని.. ఎందుకు అలా భిక్షాటన చేయాల్సి వస్తుందో గుర్తించాలని ఆదేశించారు. కర్నూలులో ఆ పిల్లవాడి కోసం

వెదుకుతున్న పోలీసులకు అలాంటి వారు చాలా చోట్ల కనిపించారు. శరీరానికి రంగు పూసుకుని భిక్షాటన చేస్తున్న మరి కొందరు చిన్నారులను గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని, వివరాలు సేకరించారు. అంతా వ్యవస్థీకృతంగా జరుగుతున్న మాఫియాగా గుర్తించారు. ఆ పిల్లల తల్లిదండ్రులను గుర్తించి వారికి అప్పగించారు. అయితే ఈ బిచ్చగాళ్ల మాఫియా వెనుక ఉన్నది ఎవరో బయటకు లాగేందుకు ఆపరేషన్ ప్రారంభించారు.నిజానికి ఒక్క కర్నూలులోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి బిచ్చగాళ్ల మాఫియాలు ఉంటాయి. అన్ని రకాల వయసుల వాళ్లు ఇందులో ఉంటారు. చంటి బిడ్డలను వేసుకుని కొంత మంది మహిళలు రోడ్డు మీదకు వస్తారు. నిండు గర్భిణి వేషంతో మరికొంత మంది వస్తారు. రూపాయి చేయని పెన్నును పది రూపాయలు పెట్టి కొనాలని దీనంగా అడిగేవారూ ఉంటారు. ఇదంతా ఓ బెగ్గింగ్ మాఫియా అని చాలా మందికి తెలుసు. అయినా కొంత మంది డబ్బులు ఇస్తూంటారు. పోలీసులు పట్టించుకోరు. ఈ మాఫియాను నడిపే వ్యక్తులు లక్షలు వెనకేసుకుంటూ ఉంటారు. పిల్లల్ని పావులుగా పెట్టుకుంటూ ఉంటారు. బెగ్గర్లు లక్షాధికారులుగా ఉన్నారని అనేక చోట్ల నుంచి వార్తలు వస్తున్నాయి. ముంబైలో ఒక్కో బెగ్గర్ లక్షలు సంపాదిస్తారు. లక్నోలో బెగ్గర్లకు ఐ ఫోన్లు కూడ ఆంటాయి. అక్కడ ఓ మాఫియాలాగా వ్యవస్థీకృతంగా ఉందో లేదో ఏపీలో మాత్రం పిల్లల జీవితాలను నాశనం చేస్తూ.. ఏమీ తెలియని వయసులో కూడా వారి ఒంటికి రంగులేసి భిక్షాటనకు పంపుతున్నారు. ఈ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేసే అవకాశాలు ఉన్నాయి.

1400 కిలోల అల్లం వెల్లుల్లి మిశ్రమం సీజ్..
50 కిలోల సింథటిక్ రంగులు సైతం

హైదరాబాద్‌పరిమిత స్థాయిలో అల్లం వెల్లుల్లి వాడుతూ సింథటిక్ రంగులు సిట్రిక్ యాసిడ్ ఇతరత్రా పదార్థాలను ఈ మిశ్రమంలో కలుపుతున్నారు. కాటేదాన్, లో తెలంగాణ కమిషనర్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించింది. అక్కడి ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థలో 1000 కిలోలు, ఉమాని ఫుడ్స్ ఇంటర్నేషనల్‌లో 400 కిలోల ప్యాకేజ్డ్ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, రంగు వచ్చేలా ఈ మిశ్రమంలో కలిపేందుకు ఉంచిన 50 కిలోల సింథటిక్ టార్ట్రాజైన్, రంగులను స్వాధీనం చేసుకున్నారు.మిశ్రమం తయారు చేస్తున్న కేంద్రాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, గ్రైండింగ్, వాష్ ఏరియా వద్ద నీటి నిల్వలు, తయారీ, స్టోరేజ్‌లో కనీస ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారు. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిన అధికారులు. రెండు తయారీ కేంద్రాలను సీజ్ చేశారు.

పిల్లలకు సోషల్ మీడియా నిషేధం....

ప్రస్తుతం చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు మొబైల్ ఫోన్‌తోనే ఎక్కువ సేపు గడుపుతున్నారు. దీనికి తోడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ఈ పరిస్థితి మరీ తీవ్రమైంది. ఎప్పుడైనా సోషల్ మీడియా యాప్‌ల్లో అంతరాయం కలిగితే వినియోగదారులు ఎంతో గాబరా పడుతుంటారు. దీన్ని బట్టి సోషల్ మీడియా ప్రభావం మనుషులపై ఎంతగా ఉంటుందో చెప్పవచ్చు. అయితే ఈ వినియోగం పిల్లల జీవితంపై ఎక్కువ వ్యతిరేక ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. పిల్లలు మానసిక కుంగుబాటుతో పాటు అనేక నమన్యలకు గురవుతున్నారు.ముఖ్యంగా అమ్మాయిల విషయంలో అశ్లీల దృశ్యాలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం పరిపాటి అవుతోంది. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించేలా చట్టాన్ని తీసుకురాడానికి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడం స్వాగతించాల్సిందే. నవంబర్ 18న ఆస్ట్రేలియా పార్లమెంట్ సమావేశంలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు.ప్రజా ప్రతినిధులు ఆమోదించిన 12 నెలల తరువాత ఈ చట్టం అమలులోకి వస్తుందని చెప్పారు. తల్లిదండ్రుల సమ్మతి ఉన్న పిల్లలకు లేదా ఇప్పటికే అకౌంట్స్ ఉన్న పిల్లలకు కూడా ఇందులో మినహాయింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ చట్టం అమలైన తరువాత ఎక్స్, టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు 16 ఏళ్ల లోపు పిల్లలను తమ సైట్ల నుంచి ఎలా మినహాయించాలో ఆలోచించాలని సూచించారు.నిర్దేశించిన వయో పరిమితిని సోషల్ మీడియా సంస్థలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు. పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఈ జరిమానా వర్తించదు. చిన్నపిల్లలకు యాక్సెస్ నిరోధించే బాధ్యత సోషల్ మీడియా సంస్థలదే. ఆ బాధ్యత తల్లిదండ్రులు లేదా యువతపై ఉండదు. దీనిపై ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, హెడ్ ఆఫ్ సేఫ్టీ యాంటిగోన్‌డేవిస్ ప్రభుత్వం నిర్ణయంచే వయో పరిమితులను తమ సంస్థ గౌరవిస్తుందని చెప్పారు. అయితే ఈ నిబంధనలను ఎలా అమలు చేయాలన్న దానిపై లోతైన చర్చ అవసరమన్నారు. యాప్ స్టోర్‌లలో, ఆపరేటింగ్ సిస్టమ్‌లలో సమర్థవంతమైన టూల్స్‌తో తల్లిదండ్రులు వారి పిల్లలు ఏ యాప్ వాడాలో నియంత్రించవచ్చని చెప్పారు.ఇది చాలా సులభమైన, సమర్థవంతమైన పరిష్కారం అని అభిప్రాయపడ్డారు. గత ఏడాది 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలని ఫ్రాన్స్ ప్రతిపాదించింది. కానీ వినియోగదారులు, తల్లిదండ్రుల సమ్మతితో నిషేధాన్ని దాటవేయగలిగారు. అమెరికాలో 13 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను యాక్సెస్ చేయాలంటే తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరిగా ఉండాల్సిందే. 13 ఏళ్లకన్నా తక్కువ వయసు పిల్లలకు సోషల్ మీడియా నిషేధించాలని చాలా సోషల్ మీడియా సంస్థలు విధానాలను ఏర్పర్చుకున్నాయి. బ్రిటన్ మీడియా రెగ్యులేటర్ 'ఆఫ్‌కామ్' 2022లో నిర్వహించిన అధ్యయనంలో బ్రిటన్ లోని 80% మంది పిల్లలు 12 ఏళ్ల వయసులోనే సోషల్ మీడియా అకౌంట్లు కలిగి ఉన్నారని బయటపడడం విశేషం. అమెరికా సర్జన్ జనరల్స్ ఆఫీస్‌కు చెందిన 2023 అడ్వైజరీ అధ్యయనంలో సోషల్ మీడియా నుంచి పిల్లలను నెల రోజుల కన్నా ఎక్కువ కాలం దూరంగా ఉంచితే వారికి మానసిక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టమైంది.మన దేశంలో లోకల్ సర్కిల్స్ అనే సంస్థ సోషల్ మీడియాకు ఏ విధంగా నిమగ్నం అయిపోతున్నారో అధ్యయనం నిర్వహించింది. సోషల్ మీడియా ప్రభావం 9 ఏళ్ల నుంచి 17 ఏళ్ల పిల్లలపై ఎలా ఉంటుందో తెలుసుకోడానికి ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 31 వరకు 368 అర్బన్ జిల్లాల్లో 13,743 మంది తల్లిదండ్రులపై సర్వే చేయగా 70,000 స్పందనలు వచ్చాయి. 66 శాతం తల్లిదండ్రుల్లో 47% మంది తమ పిల్లలు ప్రతిరోజూ మూడు నాలుగు గంటలు, 10 శాతం తల్లిదండ్రులు తమ పిల్లలు ఆరు గంటలకు మించి సోషల్ మీడియాలోనే లీనమైపోతున్నారని వెల్లడించారు.58% తల్లిదండ్రులు తమ పిల్లల్లో దూకుడుతనం కనిపిస్తోందని, 49% తల్లిదండ్రులు తమ పిల్లలు అసహనంగా ఉంటున్నారని, మరో 49% మంది తమ పిల్లలు నీరసంగా ఉంటున్నారని తెలిపారు. 42 శాతం మంది తమ పిల్లలు కుంగుబాటుకు గురవుతున్నారని, 30% మంది తమ పిల్లలు అన్ని విషయాల్లో అత్యుత్సాహం చూపిస్తుంటారని చెప్పారు. ఏదేమైనా పిల్లల మానసిక ప్రవర్తనపై, ఆరోగ్యంపై సోషల్ మీడియా అనేక విధాలుగా వ్యతిరేక ప్రభావం చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే ఆస్ట్రేలియాలో పిల్లలకు సోషల్ మీడియా నిషేధం అమలు ఎలా సాధ్యమవుతుందో ముమ్ముందు గమనించాల్సిందే.

మన్ కీ బాత్ తరహా ప్రోగ్రామ్ కు చంద్రబాబు ప్లాన్

గుంటూరు, నవంబర్ 22,

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వినూత్న తరహా కార్యక్రమాలతో ప్రజలతో మమేకం అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' తరహాలోనే రాష్ట్రంలో కూడా ప్రజలతో నేరుగా చంద్రబాబు మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. గతంలో 1995 -2004 మధ్య ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలో చంద్రబాబు నాయుడు 'డయల్ యువర్ సీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అప్పట్లో సంచలనంగా మారింది. ప్రజలు నేరుగా సీఎంకు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించేవారు.సంక్రాంతి నుంచి ఏపీలో మన్ కీ బాత్, డయల్ యువర్ సీఎం కార్యక్రమాల కలయిక ద్వారా ప్రజలతో మమేకం అయ్యేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆడియో గానీ, వీడియో విధానంలో గానీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఇదిలాఉంటే.. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సంఘ విద్రోహశక్తుల ఆట కట్టిస్తామని, సామాజిక మాధ్యమాల ద్వారా ఏ ఆడబిడ్డను అవమానించేలా వ్యవహరించినా అదే వారికి చివరి రోజవుతుందని హెచ్చరించారు. ఇష్టానుసారం వ్యక్తిత్వ హననం చేస్తే ఉపేక్షించమని అన్నారు. అదేవిధంగా పంచాయతీలకు రూ. 999 కోట్లు విడుదల చేశామని, త్వరలో రూ. 1,100 కోట్లు రాబోతున్నాయని చంద్రబాబు చెప్పారు. ఒకేరోజు రాష్ట్ర వ్యాప్తంగా 16వేల గ్రామ సభలు పెట్టాం. రూ. 4,500 కోట్లతో 30వేల పనులు చేపట్టాం. సంక్రాంతికి ముందే పనులు పూర్తి చేస్తామని చంద్రబాబు అసెంబ్లీ వేదికగా చెప్పారు

సన్న వడ్లకు బోనస్ అందడంతో మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

మంథని నవంబర్ 22,

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500బోనస్ అందడంతో మంథని పట్టణంలోని శ్రీపాద కాలనిలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతు నాయకుడు మూల పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి రైతులతో

కలిసి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో ఏ రాష్ట్రం చేయని విదంగా రైతులకు క్వింటాలకు రూ. 500 ల బోనస్ ను రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. రైతులందరి తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి శ్రీధర్ బాబు కు, శ్రీను బాబులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా నిలుస్తున్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మంథని

పేద ప్రజలకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అండగా నిలుస్తున్నారు.అనారోగ్య బాధితులకు మంత్రి శ్రీధర్ బాబు భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నారు.

మంథని నియోజకవర్గ పరిధిలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గారేపల్లి గ్రామానికి చెందిన పెస్తం అంజమ్మ కు గుండె వైద్య చికిత్సకు సంబంధించిన అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రి లో చికిత్స పొందుతు సహాయం కొరకు తెలంగాణ రాష్ట్ర ఐటి,పరిశ్రమల మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను సంప్రదించగా వెంటనే స్పందించిన మంత్రి ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తనీ వీరికి 2 లక్షల 50 వేల ఎల్వోసి మంజూరు చేయించారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు శుక్రవారం వారికి హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్వోసి పత్రాలను అందజేశారు. రెండు లక్షల 50 వేల రూపాయలు మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కు అంజమ్మ కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ హత్య అమానుషం

బద్వేలు నవంబర్ 22,

బద్వేల్: నియోజకవర్గంలోని అవధూత కాశీనాయన మండలం చెన్నవరం పరిసరాల్లో గుర్తు తెలియని మహిళ హత్య ఘటనపై టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జన రోషన్న, మాజీ ఎమ్మెల్యే కొనిరెడ్డి విజయమ్మ స్పందించారు. మహిళపై పాశవికంగా దాడి చేసి, హత్య చేయడం అమానుషమని ఖండించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. దీనిపై రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. వైసీపీ ప్రభుత్వంలో నిందితులంతా ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే, ఎంపీలే అని ఎద్దేవా చేశారు.

పీఏసీ పదవి దూరమేనా

విజయవాడ, నవంబర్ 22,

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పీఏసీ చైర్మన్ ఎంపిక సైతం వైసీపీకి కలిసివచ్చినట్లు కనిపించడం లేదు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించి అధికారాన్ని కైవసం చేసుకుంది. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం చతికిల పడాల్సి వచ్చింది. దీంతో కేవలం 11 అంటే 11 సీట్లకు మాత్రమే వైసీపీ పరిమితం కావలసి వచ్చింది. దీంతో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లేకపోవడంతో శాసనసభలో కనీసం ప్రతిపక్ష హోదా లేదన్న విమర్శలను మూటకట్టుకుంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.అయితే ప్రతిపక్ష హోదా ఉండాలి అంటే కనీసమైన సభ్యుల సంఖ్య ఉండాలన్న నిబంధనలు చెబుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోర్టును సైతం ఆశ్రయించింది. అయితే అనూహ్యంగా సభలో కీలకమైన బాధ్యతలు చేపట్టే పీఏసీ చైర్మన్ పదవి ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వవలసి ఉంటుందని వైసీపీ పట్టుపడుతోంది. ప్రధాన ప్రతిపక్షం పదవి కట్టుబెట్టాలన్న నిబంధనలు చెబుతున్న నేపథ్యంలో ప్రస్తుతం శాసనసభలో ప్రధాన ప్రతిపక్షం హోదా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కేలా లేదనిపిస్తోంది. ఐతే నేపథ్యంలో ఎవరు ఆ బాధ్యతను చేపడుతారని ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో జనసేనకు ఛాన్స్ దక్కేలా కనిపిస్తోంది. జనసేన నుంచి పులపర్తి ఆంజనేయులు పేరును ఆపార్ట అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించినట్లు సమాచారం. దీంతో పీఏసీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ తొలిగింది.పీఏసీ చైర్మన్‌గా మొదట పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి చంద్రశేఖర్లతో కలిసి నామినేషన్లు దాఖలు చేయగా చివరి నిమిషంలో 20 మంది సభ్యులు ఉంటేనే పీఏసీ చైర్మన్‌గా నియమిస్తారని పీఏసీ సభ్యులుగా ఎంపిక కావాలన్నా, చైర్మన్‌గా ఎంపిక కావాలన్నా 20 మంది సభ్యుల మద్దతు కావాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని తెరపైకి తెచ్చింది అధికార కూటమి.దీంతో అవసరమైన 20 మంది సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో లేని నేపథ్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏసీ ఎన్నికయ్యే అవకాశం లేదని చర్చ నడుస్తోంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నుంచి 12 నామినేషన్లు దాఖలు కాగా పీఏసీలో మొత్తం 12 మంది సభ్యులు అందులో 9 మంది ఎమ్మెల్యేలు ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. అయితే మొత్తం అన్ని సభ్యులకు కూటమి ప్రభుత్వమే నామినేషన్ దాఖలు చేసింది.పీఏసీ చైర్మన్‌గా 2014 ? 2019 మధ్య బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, 2019 ? 2024 మధ్య పయ్యావుల కేశవ్ బాధ్యతలను నిర్వర్తించగా, తాజాగా 2024 ? 2029 మధ్య ప్రతిపక్ష హోదా లేని పార్టీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉండటంతో ఆ బాధ్యతలను కూటమి ప్రభుత్వంలోని కీలక నేతకు కట్టబెట్టే అవకాశం ఉంది. ప్రధాన ప్రతిపక్ష హోదా లేకపోవడం సభలో సంఖ్యాబలం లేని కారణంగా ప్రతిపక్ష హోదా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేన నేపథ్యంలో పీఏసీ చైర్మన్ నియామకం కూడా దక్కదన్న చర్చ నడుస్తోంది. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం తమకు 40 శాతం ఓట్ షేర్ ఉందని శాసనసభలో అధికార పక్షం, ప్రతిపక్షం రెండే ఉంటాయి. కాబట్టి ఆదిశగా నిర్ణయం తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేస్తుంది. కాగా, అధికారం కోల్పోయిన వైసీపీకి తాజా ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు పెద్ద దెబ్బ తగిలితే, ఇప్పుడు కీలకమైన పీఏసీ చైర్మన్ పదవి సైతం చేజారినట్లు కనిపిస్తోంది..!

డిజిటల్ మీడియా పేరుతో దోచేశారు

కడప, నవంబర్ 22,

రుకు ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులు..చేసేదంతా పార్టీ ప్రచారం. ప్రచారమంటే అది మామూలు ప్రచారం కాదు. విషం చిమ్మడే పని అంటున్నారు. సోషల్ మీడియాలో నీచమైన పోస్టులు, వికృత వీడియోలు, అడ్డగోలు కామెంట్స్ పెట్టడమే వాళ్ల డ్యూటీ అంట. ఆఫీస్‌కు పోవాల్సిన పనిలేదు. ప్రభుత్వం చేస్తున్న మంచిని చెప్పాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఎక్కడ ఉన్నా ప్రాపగండ చేస్తే చాలంటూ వాళ్లకు బాధ్యత అప్పగించారట. కట్ చేస్తే లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటూ రెచ్చిపోయినోళ్ల తిక్క కథలు అంతా ఇప్పుడు బయటికి వస్తోంది. ఇలా కూడా చేయొచ్చా అన్నట్లుగా..ఓ మూడు కార్పొరేషన్ల నుంచి..ప్రభుత్వ డబ్బును ప్రసాదంలా పంచేశారట. సర్కార్ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాల్సిన కార్పొరేషన్ నుంచి నెలనెలా ప్రజాధనాన్ని జీతం

ఇస్తూ..కూటమి నేతలు, వారి కుటుంబసభ్యుల మీద నీచమైన పోస్టులు పెట్టించారట. ఇదంతా వైసీపీ పెద్ద లీడర్ల డైరెక్షన్‌లో జరిగిందని..అప్పుటి విషనాగుల వివరాలన్నీ ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయని చెప్తున్నారు కూటమి నేతలు.చంద్రబాబు, పవన్ కల్యాణ్ కుటంబసభ్యులే కాదు..వైఎస్ షర్మిల, సునీతా మీద అడ్డగోలుగా, అసభ్యంగా పోస్టులు పెట్టిన పలువురిని..కొద్ది రోజులుగా అరెస్ట్ చేస్తూ వస్తున్నారు పోలీసులు. అందులో కొందరిని విచారించగా అసలు విషయం బయటికి వచ్చిందట. కూటమి పార్టీల నేతలు, వారి కుటుంబసభ్యుల మీద పోస్టులు పెట్టే వ్యవహారం ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా నడిచిందని గుర్తించారట. పక్కా ప్లాన్‌తో వైసీపీ పెద్దల డైరెక్షన్‌లో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అందరికీ పోస్టర్లు డిజైన్ చేసి పంపిస్తారని..వాటిని వాళ్లు సోషల్ మీడియాలో పెడతారని పోలీస్ విచారణలో తేలిందట. అలా పోస్టులు పెట్టినందుకు కొందరికి అయితే లక్షలకు లక్షలు జీతాలు ఇచ్చారట. ఈ విషయాన్ని అరెస్ట్ అయిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లే పోలీసులకు చెప్పడంతో..ఈ మ్యాటర్ తెలిసి కూటమి నేతలు షాక్ అయినట్లు తెలుస్తోంది.కడప ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి కేసులో పోలీసులు తీగ లాగితే సోషల్ మీడియా పోస్టుల బాగోతం కథ మొత్తం బయటపడినట్లు చెబుతున్నారు. మొత్తం 46 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. వీరంతా నెలనెలా ప్రభుత్వ నుంచి జీతాలు తీసుకుంటూ..అప్పటి ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబ సభ్యులైన మహిళల మార్ఫింగ్ ఫోటోలతో అసభ్యకర, నీచమైన కామెంట్స్‌తో ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నట్లు దర్యాప్తులో తేలిందంటున్నారు. ఈ 46 మందిలో 30 మంది ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ద్వారా జీతాలు తీసుకున్నట్లు విచారణలో గుర్తించారట.మిగిలిన వారికి ఏపీ ఈ ప్రగతి ఏపీ ఫైబర్ నెట్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ నుంచి శ్యాలరీస్ ఇచ్చారని అంటున్నారు. నిందితుల్లో 30 వేల రూపాయల నుంచి 3 లక్షల రూపాయల వరకు జీతాలు తీసుకున్నారని..అందులో ముగ్గురికి రెండు లక్షల 80 వేల జీతం 50 వేల రూపాయలు ఇతర అలవెన్స్ కూడా ఇచ్చినట్లు టాక్. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 130 మంది ఉద్యోగులతో డిజిటల్ మీడియా కార్పొరేషన్‌ను రన్ చేసిన వైసీపీ..వాళ్లందరినీ పార్టీ ప్రచారం కోసం, ప్రత్యర్థుల మీద దుష్ప్రచారం చేసేందుకు వాడుకుందంటున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా తాడేపల్లిలోని ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఆఫీస్‌లో తనిఖీలు చేసిన కడప పోలీసులు కీలక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది.వైసీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ సజ్జల భార్గవ్‌రెడ్డి డైరెక్షన్‌లో..పక్కా ప్లాన్ ప్రకారం ఇదంతా జరిగిందనేది కూటమి నేతల ఆరోపణ. ఆయనకు సన్నిహితులుగా ఉన్నవారు, వైసీపీ మద్దతుదారులకు నెలనెలా జీతాలు ఇచ్చి..అడ్డగోలుగా పోస్టులు పెట్టించేవారని పోలీసుల దర్యాప్తులో తేలిందంటున్నారు. వైసీపీ సోషల్ మీడియా కేంద్రంగా తయారయ్యే పోస్టులను..పోస్ట్ చేయడమే వీళ్ల పని అంటున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది ఒకే సామాజికవర్గం వారు ఉన్నారంటున్నారు కూటమి నేతలు. వాళ్లందరికీ బంధుత్వం కూడా ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. ఇలా కడప పోలీసుల దర్యాప్తులో బయటికి వచ్చిన బాగోతం ఇప్పుడు కొత్త టర్న్ తీసుకుంటోంది.ఇప్పటికే అసభ్యకర పోస్టులు, మహిళలను కించపరిచారంటూ కేసులు నమోదు అవుతుంటే..ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం మీద ఉన్నతస్థాయి విచారణ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సెగ ఏకంగా వైసీపీ పెద్ద నేతల దాకా వెళ్లే అవకాశం కూడా ఉందంటున్నారు. కార్పొరేషన్ల ఏర్పాటు చేసింది ఎందుకోసం? వాళ్లందరినీ ఉద్యోగులుగా ఎలా నియమించారు.? పార్టీ కోసం వాడుకుని ప్రభుత్వం నుంచి జీతాలు ఎందుకు ఇచ్చినట్లు.? ఈ ఓవరాల్ ఎపిసోడ్ వెనక మాస్టర్ మైండ్ ఎవరు..వాళ్లకు వంత పాడిందెవరనే దానిపై కూటమి సర్కార్ కూపీ లాగుతోందట. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అరెస్టులే కాదు..కార్పొరేషన్ల ద్వారా పార్టీ సానుభూతిపరులకు ఇచ్చినట్లు చెప్తున్న జీతాల రికవరీ కూడా చేస్తామంటున్నారు కూటమి నేతలు. ==========

శ్రీరామ్ నగర్ లో ఉచిత పశు వైద్య శిబిరం 150 కి పైగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించిన పశు వైద్యులు

మంథని నవంబర్ 22,

మంథని మునిసిపల్ పరిధిలోని శ్రీరామ్ నగర్ లో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పశు సమగ్ర అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పశువులకు యదకు రాని సమస్యలు, సూడి పరీక్షలతో పాటు ఇతర సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150 కి పైగా పశువులకు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శంకర్, మంథని ఏడి డాక్టర్ జి. సంపత్ రావు, గుంజపడుగు పశువైద్యాధికారి రవి, సూపర్వైజర్లు, గోపాలమిత్ర లు పాల్గొన్నారు.

==========

ఆలింగనం చేసుకున్న పవన్, బొత్స

అమరావతి నవంబర్ 22,

అసెంబ్లీ ప్రాంగణంలో ఆసక్తికర పరిణామం జరిగింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కారెక్కేందుకు వస్తుండటం చూసి వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఎదురుగా నిలబడ్డారు. పవన్ కళ్యాణ్ వస్తుండటం చూసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇతర వైసీపీ ఎమ్మెల్సీలు పక్కకు వెళ్లిపోయారు. పవన్ కళ్యాణ్ కంటపడిని బొత్స సత్యనారాయణ నమస్కారం పెట్టారు. బొత్స స్పందనను చూసి పవన్ కళ్యాణ్ ఆయనకు ఎదురెళ్లారు. పవన్ కళ్యాణ్ తనవైపు వస్తుండటం చూసిన బోత్స ఎదురెళ్లి ఆలింగనం చేసుకున్నారు. ఇద్దరు ఒకరినొకరు పలకరించుకున్నారు. ఆప్యాయంగా ముచ్చటించుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బొత్స భుజంపై తట్టి పవన్ కళ్యాణ్ మర్యాదపూర్వకంగా కరచాలనం చేసి నమస్కారం పెట్టిన వెళ్లిపోయారు. "జరుగుతున్న పరిణామాల్ని దూరం నుంచీ చూస్తూ అయోమయంలో పడిన వైసీపీ నేతలు.

ప్రభాస్ తో నాకు సంబంధం లేదు: షర్మిల

హైదరాబాద్

స్టార్ హీరో ప్రభాస్ తో తనకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. వైఎస్ జగన్ తన సైతాన్ సైన్యంతో ప్రభాస్ తో నాకు సంబంధం ఉందని ప్రచారం చేయించారని ఆమె ఆరోపించారు. 'నేనెప్పుడూ ప్రభాస్ ను చూడలేదు. నా పిల్లల మీద ప్రమాణం చేసి అప్పుడు చెప్పా.. ఇప్పుడు చెబుతున్నా' అని వైఎస్ షర్మిల అన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి మెడకు చుట్టుకున్న అదాని కుంభకోణం అరెస్ట్ వ్యవహారం

న్యూఢిల్లీ నవంబర్ 22,

అదాని అవినీతిపరుడు అని రాహుల్ గాంధీ అంటున్నాడు.. అదే నిజమైతే, అదాని నుంచి రేవంత్ రెడ్డి రూ.100 కోట్ల విరాళం ఎందుకు తీసుకున్నారని బీజేపీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర ప్రశ్నించారు. దావోస్లో పర్యటనలో అదానితో రేవంత్ రెడ్డి రూ.12,400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం ఎలా కుదుర్చుకున్నారని అన్నారు. అదాని కుంభకోణం అరెస్ట్ వ్యవహారం, సీఎం రేవంత్ రెడ్డి మెడకు చుట్టుకున్నదని అయన అన్నారు.

మాలల ఆత్మీయ సభను విజయవంతం చేయాలి

మేడ్చల్‌డిసెంబర్ ఒకటవ తేదీన జరగనున్న మాలల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఈరోజు నేరేడ్మెట్ అంబేద్కర్ భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ ఒకటవ తేదీన జరగనున్న మాలల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ప్రతి ఒక్క మాల ఈ సభకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. మన హక్కులను మనం కాపాడుకునేందుకు సంఘటితం కావలసిన సమయం ఆసన్నమైందని తెలియజేశారు. స్వచ్ఛందంగా మాలలందరూ ఈ సభకు వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జగన్ కు ఆదానీ దెబ్బ...

విజయవాడ, నవంబర్ 22,

దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన ఓ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. సోలార్ విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన ఓ భారీ డీల్ కుదుర్చుకునేందుకు.. ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్- ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద వ్యవహారం క్రమంగా.. ఆంధ్రప్రదేశ్ గత సర్కార్ కు చుట్టుకుంటోంది. 2019- 2024 మధ్య అధికారంలోని ప్రభుత్వంతో గౌతమ్ అదానీ.. ఈ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నడిపినట్లు ఆమెరికా విచారణ సంస్థ ఎఫ్‌బీఐ పరిశోధనలో వెల్లడైంది. ఇందుకోసం.. దాదాపు రూ.1,750 కోట్లు చేతులు మారినట్లు అమెరికా విచారణ సంస్థ.. ఆ దేశ కోర్టుకు సమర్పించిన ఫైలింగ్ లో వెల్లడించింది.లాభదాయకమైన సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు రూ. 2.029 కోట్లు లంచం ఇచ్చినందుకు అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీ, మరో ఆరుగురు వ్యక్తుల ప్రయత్నించినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో మరింత లోతైన దర్యాప్తు చేపడతామని ప్రకటించిన అమెరికా విచారణ సంస్థ.. ప్రాథమిక నివేదికను కోర్టుకు అందించింది. ఈ కుట్రలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తి సహకారం ఎక్కువగా ఉందన్న ఎఫ్‌బీఐ.. తేదీలతో సహా వారి మధ్య భేటీలను వెల్లడించి, ఆశ్చర్యపరిచింది.భారత్ లో అతిపెద్ద సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకునేందుకు గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సహా మరో ఆరుగురు.. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వజూశారని అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ ఆరోపిస్తోంది. అయితే.. ఈ ఒప్పందాలను చూపించి బ్యాంకులు, ఇన్వెస్టర్లను తప్పుడు సమాచారంతో మోసం చేసి నిధులు సమీకరించేందుకు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఇందులో ఆమెరికా ఇన్వెస్టరు సైతం ఉండడంతో.. తమ దేశ పెట్టుబడిదారుల్ని మోసం చేస్తున్నారన్న కారణంతో ఆమెరికా దర్యాప్తు ప్రారంభించింది. ఈ దర్యాప్తునకు సంబంధించిన అంశాలను తెలుపుతూ.. కోర్టులో ఎఫ్‌బీఐ ఫైలింగ్ చేసింది.రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు.. అదానీ గ్రీన్ ఎనర్జీ గ్రూప్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల సహకారం కోరిన అదానీ, ఇతర నిందితులు.. ప్రతిగా భారీగా లంచాలు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా.. భారత ప్రభుత్వంలోని వ్యక్తులకు రూ.2,029 కోట్లు లంచంగా ఇచ్చేందుకు ప్రయత్నించారని ఎఫ్‌బీఐ నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకునే ఒప్పందాలతో అదానీ గ్రీన్ ఎనర్జీ, దాని అనుబంధ సంస్థలకు పెద్ద మొత్తంలో లాభం చేకూరుతుందని పేర్కొంది.సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం కుదుర్చేందుకు అదానీ స్వయంగా ప్రయత్నించారు. ఇందుకోసం.. అతను ఆంధ్రప్రదేశ్ లోని అత్యున్నత స్థాయి కార్యనిర్వాహక వ్యక్తిని కలిశారు అని అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ స్పష్టంగా వెల్లడించింది. ఇక్కడే అసలు విషయం పూర్తిగా వెల్లడైంది. ఆమెరికా విచారణ సంస్థ తేదీలతో సహా తెలిపినట్లుగా..2021లో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. నాడు విద్యుత్ సరఫరా ఒప్పందాలపై చర్చలు జరిగినట్లు ప్రభుత్వం తెలపగా.. దాదాపు ఏడు మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ముఖ్యమంత్రి జగన్ అంగీకారం తెలుపారు. ఇది.. భారత్ లోని మరే ఇతర రాష్ట్రాలు చేసుకోలేనంత భారీ ఒప్పందంగా.. అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వెల్లడించింది.

రామకుప్పంలో కిడ్నాపర్ల ముఠా అరెస్ట్

చిత్తూరు

కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పంలో కిడ్నాపర్ల ముఠాను గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 14న మండలంలోని గోవిందపల్లి మాజీ సర్పంచ్ కుటుంబాన్ని ఐటీ శాఖ పేరుతో కిడ్నాప్ చేసిన సంగతి పాఠకులకు విదితమే. ఈ కేసులో ప్రధాన నిందితులు ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల చెంత మూడు వాహనాలు సీజ్ చేశారు. రైస్ పుల్లింగ్ వ్యవహారంతో పాటు ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్ కు కారణమని తెలిసింది.

మోడీనే టార్గెట్ చేసిన ట్రుడో..

న్యూఢిల్లీ, నవంబర్ 22, (

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్వార్థంతో భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఖలిస్తానీ ఉగ్రవాది, సిక్కు వేర్పాటు వాది అయిన హర్‌దీప్ సింగ్ నిజ్జర్ ఏడాది క్రితం కెనడాలో హత్యకు గురయ్యాడు. ఈ హత్య వెనుక భారత ఏజెంట్ల హత్య ఉందని కెనడా ప్రధాని ట్రూడో ఆరోపించారు. దీనిని భారత్ నాడే ఖండించింది. సాక్షాలు ఉంటే ఇవ్వాలని సూచించింది. ఏడాదిపాటు మౌనంగా ఉన్న కెనడా.. తాజాగా ఈ విషయాన్ని తెరపైకి తెచ్చి.. భారత రాయబారులను విచారణ చేసేందుకు సిద్ధమైంది. వెంటనే అప్రమత్తమైన భారత్.. కెనడాలోని భారత రాయబారులను వెనక్కి పిలిపించింది. భారత్‌లోని కెనడా రాయబారులను ఇక్కడి నుంచి బహిష్కరించింది. దీంతో దౌత్య

సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో కెనడా.. భారత్ విషయాలను అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ పత్రికకు అందించి కథనాలు రాయించింది. అంతటితో ఆగకుండా నిజ్జర్ హత్య గురించి భారత హోం మంత్రి అమిత్‌షాకు ముందే తెలుసని ఆరోపించింది.పాకిస్తాన్ తరహాలో భారత్‌తో గిచ్చి కయ్యం పెట్టుకోవాలని చూస్తున్న కెనడా ప్రధాని ట్రూడో తాజాగా మరోమారు కెనడా పత్రికలో భారత ప్రధాని మోదీపై ఓ కథనం రాయించారు. అందులో నిజ్జర్ హత్య గురించి భారత ప్రధాని మోదీకి ముందే తెలుసని రాసుకొచ్చింది. ఈ కథనాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో గెలవడానికి భారతీయులను తమవైపు తిప్పుకోవడానికి కెనడా ప్రధాని చేస్తున్న చీఫ్ ట్రిక్స్‌లో ఇది ఒకటి అయింది.ఇక కెనడా కథనంపై భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. తాము సాధారణంగా మీడియాలో వచ్చే కథనాలపై స్పందిరమని, కొన్ని అసత్య ప్రకటనల నేపథ్యంలో స్పందించాల్సి వస్తోందన్నారు. నిరాధారమైన ఇలాంటి కథనాలు హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఇలాంటి వార్తలకు అధికారుల జవాబు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఇలాంటి కథనాలతో రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత దెబ్బతీస్తాయని తెలిపారు.

గౌతమ్ ఆదానీకి వరుస షాక్ లు

ముంబై, నవంబర్ 22, (

మనదేశంలో అపర కుబేరుడు.. రిలయన్స్ సంస్థను అధిగమించి.. అన్ని రంగాలలో దూసుకుపోతున్న గౌతమ్ అదానికి దెబ్బల మీద దెబ్బలు తగులుతున్నాయి. గ్రీన్ ఎనర్జీ విషయంలో న్యూయార్క్ అధికారులు అభియోగాలు మోపిన నేపథ్యంలో.. ఆయన కంపెనీకి చెందిన షేర్లు విపరీతమైన నష్టాలను నమోదు చేశాయి.ఈ విషయాన్ని మర్చిపోకముందే మరో షాక్ గౌతమ్ ఆదానికి తగిలింది. గౌతమ్ అదాని ప్రపంచంలోని వలుదేశాలలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అందులో కెన్యా కూడా ఒకటి. కెన్యా దేశంలో గౌతం అదాని గ్రూప్ రెండు ప్రాజెక్టులను ఆదేశ ప్రభుత్వంతో కుదుర్చుకుంది. కెన్యా దేశంలో పవర్ ట్రాన్స్ మిషన్ లైన్లో నిర్మించడానికి కెన్యా దేశంతో గతంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 700 మిలియన్ డాలర్లను కెన్యా ప్రభుత్వం ఖర్చు చేయనుంది. అయితే గౌతమ్ అదాని గ్రీన్ ఎనర్జీ కంపెనీ పై ఆరోపణలు రావడంతో.. న్యూయార్క్ అధికారులు అభియోగాలు మోపి.. ఏకంగా అరెస్టులకు వారెంట్లు జారీ చేయడంతో కెన్యా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో గౌతమ్ అదానీ గ్రూప్ తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు కెన్యా అధ్యక్షుడు విలియం రుతో ప్రకటించారు. ఇది మాత్రమే కాకుండా జేకేఐ విమానాశ్రయ విస్తరణ ప్రణాళికలు కూడా రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. దీంతో గౌతమ్ అదాని గ్రూప్ కు కోలుకోలేని షాక్ తగిలింది. కొంతకాలంగా గౌతమ్ అదానీ గ్రూప్ కెన్యాలో కార్యకలాపాలు సాగిస్తోంది. మైనింగ్లో అడుగుపెట్టడానికి ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే కెన్యా ప్రభుత్వంతో వ్యూహాత్మక వ్యాపారాలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఈ క్రమంలోనే కెన్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గౌతం అదానీ గ్రూప్ కు కోలుకోలేని షాక్ ఇచ్చింది.సౌర విద్యుత్ తయారీ లో భాగంగా 20 సంవత్సరాల లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొందడానికి గౌతం అదానీ కంపెనీ ఒప్పందాలకుదురుచుకుంది. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే అంతస్థాయిలో లాభాలు కళ్ల చూడాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో అధికారులకు 265 మిలియన్ డాలర్లను గౌతమ్ అదానీ గ్రూప్ లంచాలుగా ఇచ్చిందని అభియోగాలు ఒక్కసారిగా గుప్పమన్నాయి.

అంతేకాకుండా గౌతమ్ అదానీ ఏర్పాటు చేసిన గ్రీన్ ఎనర్జీ కంపెనీలోకి అక్రమంగా అప్పులు వచ్చాయని.. పెట్టుబడిదారులు కూడా తప్పుడు విధానాలలో ఇన్వెస్ట్మెంట్ చేశారని న్యూయార్క్ అధికారులు అభియోగాలు మోపారు. దీంతో గౌతమ్ అదాని గ్రూప్ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి స్టాక్ మార్కెట్లో గౌతమ్ ఆదాని కంపెనీకి సంబంధించిన షేర్లు ఒక్కసారిగా పతనమయ్యాయి. అయితే న్యూయార్క్ అధికారులు మోపిన అభియోగాలను తాము కోర్టులోనే తేల్చుకుంటామని గౌతమ్ ఆదాని ప్రకటించినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. న్యూయార్క్ అధికారులు మోపిన అభియోగాలు అలా ఉండగా.. కెన్యా ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది.

5నెలల ముందే ఆప్ పేర్లు ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 22,

అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ పురుడు పోసుకుంది. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో ఈ పార్టీని ప్రారంభించారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు షాక్ ఇచ్చి.. ప్రారంభించిన ఏడాదికే ఢిల్లీలో అధికారంలోకి వచ్చింది ఆప్. పార్టీ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీకి మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత పంజాబ్‌లోనూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. ఉత్తర భారత దేవంలోని గోవా, గుజరాత్, హర్యాన, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలోనూ పోటీ చేసిన ఆప్.. ఎన్నికల నిబంధనల మేరకు ఓట్లు సాధించి జాతీయ పార్టీగా కూడా గుర్తింపు పొందింది. ఇక ఎన్నికల వేళ.. అరవింద్ కేజ్రీవాల్ నుసరించే వ్యూహాలు భిన్నంగా ఉంటాయి. రాజకీయాల్లో ఆరితేరిన నేతలకు భిన్నంగా కేజ్రీవాల్ ఆలోచిస్తారు. వ్యూహాలు రచిస్తారు. పంజాబ్ ఎన్నికల్లో ఆయన సీఎం అభ్యర్థిని ప్రజల అభిప్రాయం మేరకే ఎంపిక చేశారు. ఈమేరకు టెర్నాలజీ సాయంతో ఓటింగ్ కోరారు. ఆప్ విధానాలు నచ్చి వివిధ పార్టీల నేతలు కూడా అందులో చేరారు. ఇక పంజాబ్‌లో కూడా ప్రస్తుతం ఆప్ అధికారంలో ఉంది.ఢిల్లీ మద్యం కుంభకోణంలో చిక్కుకున్న అర్వింద్ కేజ్రీవాల్ నాలుగు నెలలు జైల్లో ఉన్నారు. సీఎంగా జైలు నుంచే పాలన సాగించారు. అయితే బెయిల్ మంజూరైన తర్వాత సీఎం పదవికి రాజీరామా చేశారు. అతిషిని తన వారసురాలుగా సీంఎ కుర్చీలో కూర్చోబెట్టారు. ఇదిలా ఉంటే.. ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలో కోసమే పార్టీని మరింత బలోపేతం చేయడానికి అరవింద్ కే జ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే పార్టీ కోసం ఢిల్లీలో పాదయాత్ర కూడా చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. కానీ, పాదయాత్ర చేయలేదు. ప్రస్తుతం ఢిల్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.ఇక ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉంది. కానీ, అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. పార్టీ తరఫున వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే తొలి జాబితాను విడుదల చేశారు. ఇందులో 11 మంది పేర్లు ఉన్నాయి. దీంతో ఢిల్లీ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించిన తొలి పార్టీగా ఆప్ నిలిచింది.

ఇక కేజ్రీవాల్ ప్రకటించిన ఆఫ్ ఫస్ట్ లిస్ట్‌లో ఛత్తర్‌పూర్ నుంచి బ్రహ్మ సింగ్, తన్వార్, కిరాడి నుంచి అనిల్ ఝా, విశ్వాస్‌నగర్ నుంచి దీపక్ సింగ్లా, రోహతాన్ నగర్ నుంచి సరితాసింగ్, లక్ష్మీనగర్ నుంచి బీబీ.త్యాగి, బదార్‌పూర్ నుంచి రామ్ సింగ్, సీలన్‌పూర్ నుంచి జుబీర్ చౌధురి, సీమాపురి నుంఇ వీర్ సింగ్ ధిగాన్, హోండా నుంచి గౌరవ్‌శర్మ, కర్వాల్ నగర్ నుంచి మనోజ్ త్యాగి, మాటియాల నుంచి సోమేష్ షౌకీన్ పేర్లు ప్రకటించారు. 11 మందిలో ఆరుగురు కాంగ్రెస్. బీజేపీ నుంచి ఆప్‌లో చేరిన వారే ఉన్నారు. బీజేపీ మాజీ నేతలు బ్రహ్మసింగ్ తన్వర్, అనిల్ ఝా, బీబీ త్యాగితోపాటు కాంగ్రెస్ మాజీ నాయకులు చైదరి జుబేర్ అహ్మద్, వీర్ ధింగన్, సుముష్ సోకీన్లను అభ్యర్థులుగా కేజ్రీవాల్ ప్రకటించారు. ముగ్గురు సిట్టింగ్‌కు కేజ్రీవాల్ టికెట్ నిరాకరించారు

మూడు వారాల్లోనే దీపం-2 పథకం క్రింద 50 లక్షల మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

విజయవాడ, నవంబర్ 22, (

కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందిన వారి సంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం విజయవాడ, కృష్ణలంకలోని కోత మిషన్ రోడ్డు ప్రాంతంలో జరిగిన దీపం-2 ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, పౌర సరఫరాల కార్పొరేషన్ వీసీ, ఎండీ జి.వీరపాండ్యన్, జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా, విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య తదితరులు పాల్గొని లబ్ధిదారు ఎం.కోటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.

గ్యాస్ స్టవ్‌పై టీ కాచి, రుచి చూశారు. మాలాంటి కుటుంబాలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తే.. ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2,476.50 ప్రయోజనం లభిస్తుంది. ఇలాంటి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల పిల్లల్ని బాగా చదివించుకోగలుగుతున్నామని చెబుతూ ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కోటీ 55 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని.. దీపావళి పండుగ రోజు ప్రతి మహిళ కళ్లల్లో సంతోషం నింపే విధంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే దీపం-2 పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకాకుళం జిల్లాలో లాంఛనంగా ప్రారంభించారని.. పథకం విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. నారా చంద్రబాబు నాయుడు 1999లో దేశంలోనే మొదటిసారిగా మహిళల ఆరోగ్య భద్రత గురించి ఆలోచించి కట్టెల పొయ్యి పొగతో అనారోగ్య సమస్యలు వస్తాయనే ఉద్దేశంతో దీపం పథకాన్ని ప్రారంభించారని వివరించారు. గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉంటే చాలని ఇప్పుడు దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందొచ్చన్నారు. ప్రతిపక్షాలు, మాజీ సీఎం జగన్ కావాల్నా దుష్ప్రచారం చేస్తున్నారని, గ్యాస్ కనెక్షన్ల సంఖ్యపై కూడా అవగాహన లేకుండా కోటి 85 లక్షలు అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. మూడు గ్యాస్ కంపెనీలు అందించిన సమాచారం మేరకు రాష్ట్రంలో కోటి 55 లక్షల 200 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని.. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకం అందేలా రూ. 894 కోట్ల అడ్వాన్సును గ్యాస్ కంపెనీలకు అందజేయడం జరిగిందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాష్ట్రంలోని మహిళల సంక్షేమం లక్ష్యంగా, వారి పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారన్నారు. ఇంత పెద్ద కార్యక్రమానికి సంబంధించి ఇప్పటివరకు కేవలం 521 ఫిర్యాదులు మాత్రమే అందడం కార్యక్రమం అమల్లో పారదర్శకత, నిజాయితీకి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఇంటిలో సంతోషం నింపాలని, 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాలో నిధులు జమవుతున్నాయని వివరించారు. మరింత మెరుగైన సేవలందించే విధంగా స్థానిక గ్యాస్ కంపెనీలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి లబ్ధిదారునికి పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు.

అత్యంత పారదర్శకంగా పథకం అమలు: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కట్టెల పొయ్యితో వంట చేస్తూ మహిళలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు దీపం పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఇప్పుడు దీపం -2 పథకం ద్వారా 21 రోజుల్లోనే 50 లక్షల మందికి లబ్ధి చేకూరడం సంతోషంగా ఉందన్నారు. అతి తక్కువ ఫిర్యాదులు నమోదు కావడం ఈ పథకం అమలు పారదర్శకతకు నిదర్శనం అన్నారు.

క్యారమ్స్ లో విశ్వవిజేత మనోడే

హైదరాబాద్ నవంబర్ 22

హైదరాబాద్ కు చెందిన కె శ్రీనివాస్ క్యారమ్స్ లో ప్రపంచ విజేతగా నిలిచాడు. అమెరికా లో జరిగిన 6వ ప్రపంచ క్యారమ్స్ కప్ పోటీల్లో 18 దేశాలు పాల్గొన్నాయి. భారత దేశానికి చెందిన శ్రీనివాస్ తన ప్రతిభను చాటుకొని కప్ ను సాధించాడు. శ్రీనివాస్ 2014 లో కూడా 4వ ప్రపంచ కప్ విజేతగా నిలిచాడు. ప్రపంచ కప్ సాధించడం పై శ్రీనివాస్ తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు. తనకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, తను పని చేస్తున్న ఇండియన్ ఆయిల్ కంపెనీకి కృతనతలు తెలిపారు. ప్రభుత్వ సహకారం తో క్యారమ్స్ అకాడమిని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తామన్నారు. ప్రపంచ కప్ గెలవడంతో శ్రీనివాస్ ను కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో ఫార్మసిస్టులు బాధ్యతతో పని చేయాలి

మంత్రి దామోదర రాజనర్సింహా

హైదరాబాద్‌ప్రభుత్వ ఆసుపత్రులలో ఫార్మసిస్టులు బాధ్యతతో పని చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కృత్రిమ మందుల కొరత పై చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాదికారులకు ఆదేశం ఇచ్చారు. సెంట్రల్ మెడికల్ స్టోర్స్ (అఓా) లలో ఫార్మసీ సిబ్బంది, మౌళిక సదుపాయాల కల్పన, మందుల సరఫరాకు రవాణా వాహనాలు అందుబాటులో ఉంచాలే చర్యలు చేపట్టాలి. హెల్త్ ఫెసిలిటీ పనితీరుపై ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ క్షేత్ర స్థాయిలో పరిశీలించిన పలు అంశాల పై మంత్రి సమీక్ష జరిపారు.

బీఎస్ఎన్ఎల్ వైపు ప్రజల చూపు

ముంబై, నవంబర్ 22, మార్చిన తర్వాత టెలికాం కంపెనీలు నిరంతరం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సెప్టెంబర్ నెల చందాదారుల డేటాను విడుదల చేసింది. ట్రాయ్ విడుదల చేసిన డేటాను చూస్తుంటే, జియో, ఎయిర్ టెల్, ఐడియా కంపెనీల పరిస్థితి చాలా దారుణంగా ఉందని స్పష్టమవుతోంది. మరోవైపు ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ లాభపడుతోంది. సెప్టెంబరు నెలలో టెలికాం కంపెనీలు కోటి మందికి పైగా సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయినట్లు తెలుస్తోంది.సెప్టెంబర్ నెలలో భారతీ ఎయిర్‌టెల్ 14 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను కోల్పోగా, వోడాఫోన్ ఐడియా 15 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల కంటే ముఖేష్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో భారీ నష్టాలను చవిచూసింది. సెప్టెంబర్ నెలలో జియో దాదాపు 79 లక్షల మంది సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయింది. అంటే ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాతో పోలిస్తే జియో పరిస్థితి మరింత దారుణంగా మారిందని తెలిసిపోతుంది.

రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ మళ్లీ ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే, కంపెనీ తన వ్యూహాన్ని కొంచెం మార్చుకోవాలి. టారిఫ్ పెంపు కారణంగా కోపంతో ఉన్న వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌కి మారుతున్నారు. ఎందుకంటే బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌లు చాలా చౌకగా ఉంటాయి. దీని నుండి జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా వినియోగదారులను మళ్లీ నెట్‌వర్క్‌కి కనెక్ట్ చేయవలసి వస్తే, ప్లాన్‌లను చౌకగా చేయవలసి ఉంటుందని స్పష్టమవుతుంది. లేదంటే వినియోగదారులు తక్కువ ధరకు ప్లాన్‌లను అందించాల్సి ఉంటుంది.ఒకప్పుడు అందరూ ప్రైవేట్ కంపెనీలతో సహవాసం చేసేవారు. కానీ టారిఫ్‌ల పెంపు తర్వాత ఆట మొత్తం మారిపోయింది. ఒకవైపు ంతితీబివశ్రీ, ఏతినీ, ఎతి టారిఫ్ పెంవును ప్రకటించగా, మరోవైపు ఖాఔఒ కంపెనీ టారిఫ్‌లను పెంచదని స్పష్టం చేసింది. క్రమంగా ప్రజలు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కి కనెక్ట్ అవ్వడానికి ఇదే కారణం. సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయే బదులు బీఎస్ఎన్ఎల్ సెప్టెంబరులో 8 లక్షల మంది కొత్త సబ్‌స్క్రైబర్‌లను నెట్‌వర్క్‌లోకి చేర్చుకుంది. దీంతో బీఎస్ఎన్ఎల్‌కు మంచి రోజులు వస్తున్నాయి. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌ను కొన్ని ప్రాంతాల్లో ఉంది. పూర్తి స్థాయిలో తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. అంతేకాకుండా 5జీ నెట్‌వర్క్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వేగంగా పనులు కొనసాగుతున్నాయి.

మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

బద్వేలు : నేటికి కూటమి ప్రబుత్వం ఏర్పాటు అయ్యి 150 రోజులు. పూర్తి అయిన శుభ సందర్భంగా మన ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రజాగలం నందు చెప్పిన మాట ప్రకారం ప్రబుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లాండ్ టైటిల్ యాక్ష రద్దు -పై సంతకం చేసినారు నేడు అసెంబ్లీ లో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయుటక న్యాయ శాఖ మంత్రి వర్యులు ఫరూక్ గారు తీర్నానాన్ని ప్రవేశ పెట్టగా మన ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు చొరవతో శాసన సభ్యుల అంగీకారంతో మరీ ముఖ్యముగా రాయలసీమ కొనసీమ సభ్యుల అంగీకారంతో కర్నూలు నందు హైకోర్టు బెంచి ఏర్పాటుకు శాసనసభ ఆమోదంపట్ల బద్వేలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి హర్షం ప్రకటించారు . నాటి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారము కర్నూలు నందు రాజదాని గాని హైకోర్టు గాని ఏర్పాటు చేయుటకు తీర్మానం అయినది కాని కర్నూలు నందు రాజ దాని ఏర్పాటు చేసినను అది మూనాళ్ళ ముచ్చటగా ఆంధ్ర ప్రదేశ్ విప్పటు చేసుకున్న మనం హైకోర్టును హైదరాబాదుకు తేరలలించటమైనది ఆనాటి నుంచి ఈ నాటి వరకు రాయల సీమలో హైకోర్టు ఏర్పాటు చేయుటకు న్యాయ్యవాదులు అనేక పోరాటాలు చేయడమైనది. గత ప్రభుత్యం కర్నూలులో హైకోర్టు రాజదానిగా. ఏర్పాటు చేస్తామని చెప్పి వారి రాజకీయ స్వలాబం చూసుకున్నారు హైకోర్టు ఒకే చోట ఉండడం ఉత్తమము అని ప్రజలకు న్యాయస్థానాలు అందుబాటులో ఉంచి త్వర తగతిన న్యాయం పొందుటకు నేడు కూటమి ప్రభుత్వం నారా చంద్ర బాబు నాయకత్వం తో మన రాయలసీమ వాసుల కలను నెరవేరుస్తూ ఈనాడు కర్నూలు నందు హైకోర్టు బెంచి ఏర్పాటు చేయట అభినందనీయ విషయం అని ప్రభుతం ఏర్పాటు అయినప్పట్టనండి రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం కష్టపడుతున్నట్లు మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు

జిల్లాలో 75.15 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తి: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

-కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వివరాలు సేకరించిన ఎన్యుమరేటర్

-సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), నవంబర్ 22:ఖమ్మం జిల్లాల నవంబర్ 21 నాటికి 75.15 శాతం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు.శుక్రవారం సర్వే ఎన్యుమరేటర్ లు ఖమ్మం కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకుని, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కుటుంబ సర్వే నిర్వహించారు. సర్వే సిబ్బందికి కలెక్టర్ పూర్తిగా సహకరిస్తూ వివరాలను తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ,ఖమ్మం జిల్లాలో హౌస్ లిస్టింగ్ చేసిన మొత్తం 5 లక్షల 67 వేల 338 ఇండ్లను సర్వే కోసం గుర్తించామని, నవంబర్ 21 నాటికి 4129 ఎన్యుమరేటర్ బ్లాక్ పరిధిలో మొత్తం 4 లక్షల 26 వేల 333 ఇండ్ల సర్వే పూర్తయిందని అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఖమ్మంలో 54.96 శాతం, పాలేరులో 80.93 శాతం, మధిరలో 80.66 శాతం, వైరా లో 88.54 శాతం, సత్తుపల్లిలో 88.54 శాతం, జిల్లా వ్యాప్తంగా 75.15 శాతం సర్వే పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో పెండింగ్ సర్వే ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారం పకడ్బందీగా భద్రపర్చాలని, డేటా ఎక్కడా లీక్ కాకుండా చూసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 22: నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వా పేట్ గ్రామంలో పిఏసిఎస్ మంజులాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతులకు కేంద్రాల్లో అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.

అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డిఓ రత్న కళ్యాణి, డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం గోపాల్, ఏడి మార్కెటింగ్ శ్రీనివాస్, గ్రామీణ తహసిల్దారు సంతోష్, తదితరులు ఉన్నారు.

ఖమ్మం మార్కెట్ యార్డ్ నందు మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలులి

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), నవంబర్ 22:కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని,బోనస్ మాట బోగస్ అయింది మద్దతు ధర కూడా రావట్లేదు అని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యనించారు.6500 రూపాయలు కూడ మద్దతు ధర పత్తికి రాలేదు పత్తి ప్రతి క్వింటాకు రైతుకు 1500 నష్టం వాటిల్లుతుందని దుయ్యబట్టారు.లక్షా ఇరవై వేల మెట్రిక్ టన్నులు కూడా పత్తి కొనలేదు మొత్తం దళారులకే పోతుందని,ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడం కుట్రలు చేయడం తప్ప కాంగ్రెస్ చేసింది జీరో అని అన్నారు.వరి,పత్తి పంట దళారుల పాలు అవుతుంది ప్రభుత్వం ఏమి చేస్తోందని,రైతు బంధు లేని రుణమాఫీ లేని మద్దతు ధర లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రి ఉన్నప్పుడు పత్తికి గరిష్టంగా 11 వేలు కనిష్టంగా 9 వేలు ధర పలికిందని,ఇప్పుడు ఎందుకు ధర తగ్గిందని అన్నారు.పత్తి రైతులకు మద్దతు ధర రావాలి 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం ను డిమాండ్ చేస్తున్నాం.సిసిఐ రైతుల దగ్గర కొనట్లేదు, దళారుల దగ్గర కొంటున్నారు.మిర్చి కి 13 వేలు కూడా దాటట్లేదు,కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు కోటలు చేతలు గడప దాటట్లేదని, జిల్లా మంత్రులు ఆధిపత్యం కోసం బాగా బిజీ అయ్యారని అన్నారు.ప్రజా సమస్యలను గాలి కొదిలి గొప్పలుకు పోతున్నారు.సన్నాలకు బోనస్ కూడా ఇవ్వట్లేదు.ఖమ్మం జిల్లాలో సన్నాలు 4 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం పండింది,ఒక్క రైతుకు అయినా బోనస్ ఇచ్చారా మొత్తం దళారులు కొంటున్నారని అన్నారు.ఆంధ్రా దళారులు వరి ధాన్యం కొనుక్కొంటున్నారని తెలిపారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 22:నిర్మల్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమ అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలను సరిపడినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో కుర్చీల కొరత రాకుండా చూడాలన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతూ, వారికి గల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలనను పాటిస్తూ శ్రద్ధగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలి, తాహసిల్దార్ రాజు, అధికారులు మోహన్ సింగ్, విజయ శ్రీ, సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ లు ఆత్మ గౌరవంతో జీవించేందుకు సంపూర్ణ సహకారం:జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ట్రాన్స్ జెండర్ లతో సమావేశమైన జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిది (భారత శక్తి), నవంబర్ 22:ట్రాన్స్ జెండర్ లు ఆత్మగౌరవంతో జీవించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ట్రాన్స్ జెండర్ లతో సమావేశమయ్యారు.ట్రాన్స్ జెండర్ లకు ఆధార్ కార్డు జారీ, పేరు మార్పు విధానం, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్, నూతన ఎస్.హెచ్.జి. ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ట్రాన్స్ జెండర్ ల సంక్షేమానికి చర్యలు చేపడతామని అన్నారు. ఆధార్ కార్డులు లేనివారికి ఆధార్ కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. పేరు మార్చుకోవాలనుకుంటే చేయాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలన్నారు. రేషన్ కార్డు కోసం ట్రాన్స్ జెండర్ లు దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం నూతన రేషన్ కార్డులు మంజూరు సమయంలో అర్హులైన వారికి రేషన్ కార్డులు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా ప్రభుత్వం నుండి ఎటువంటి పెన్షన్ పథకం లేదని, ఒంటరి మహిళల కోట క్రింద పెన్షన్ మంజూరుకు దరఖాస్తులు సమర్పిస్తే, మంజూరుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. స్వశక్తి మహిళా సంఘాల తరహాలో ట్రాన్స్ జెండర్లు సంఘాలుగా ఏర్పాటయితే వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందిస్తామని అన్నారు. ఖమ్మం నగర పరిధిలో 13 చోట్ల స్త్రీ టీ లను ఏర్పాటు చేయనున్నట్లు, వీటిలో 2 చోట్ల ట్రాన్స్ జెండర్ లకు అవకాశం కల్పిస్తామని, మరో నాలుగు ఇతర వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు సహకారం అందిస్తామని, ట్రాన్స్ జెండర్ లు చర్చించుకుని, ఎటువంటి వ్యాపారం ప్రారంభించాలో ఆలోచించుకోవాలని కలెక్టర్ సూచించారు. ట్రాన్స్ జెండర్లకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిఆర్డీవో ఎస్. సన్యాసయ్య, డిఆర్వో ఎం. రాజేశ్వరి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లో లెవల్ జోన్ పరిధి రిజర్వాయర్ సమీపంలో పైపు లైన్ లీకేజీ పనులను సంధర్శించిన మేయర్ సునీల్ రావు.

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 22(భారత శక్తి):నగరపాలక సంస్థ మంచి నీటి సరఫరా లో భాగంగా నగరంలోని 33 వ డివిజన్ రిజర్వాయర పరిధిలో 300 ఎం ఎం డయా మంచి నీటి పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను శుక్రవారం రోజు మేయర్ యాదగిరి సునీల్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంగడ్డ రోడ్డులో పోలీస్ క్వాటర్స్ వద్ద రిజర్వాయర్ పరిధిలో రెండు చోట్ల మంచి నీటి పైపు లైన్ లీకేజి ఏర్పడి ప్రజలకు సమస్యగా మారింది. లీకేజీ వల్ల మంచి నీరు వృధాగా పోతుండటంతో లీకేజీని అరికట్టాలని సునీల్ రావు ఆదేశాలు చేశారు. దీంతో అధికారులు లీకేజీ మరమ్మతు పనులు చేపట్టారు. చేపట్టిన మరమ్మతు పనులను స్వయంగా పరిశీలించారు. అధికారులకు తగిన సలహాలు సూచనలు చేశారు. లీకేజీ మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేసి,డివిజన్ ప్రజలకు నీరు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంచి నీటి సరఫరా లైన్ మెన్ కాశీ తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జ్ వద్ద 16 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కమండ్ కంట్రోల్ ఆఫీస్ ను సంధర్శించిన మేయర్ సునీల్ రావు.

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 22(భారత శక్తి):స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో చేపట్టిన పనులు నగర ప్రజలకు ఉపయోగపడాలని, వాటి ఫలాలు పది కాలాల పాటు అనుభవించాలనే మా ధ్యేయం అని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. స్మార్ట్ సిటీ కార్పోరేషన్ లిమిటెడ్ అభివృద్ధి లో భాగంగా శుక్రవారం నగరంలోని కేబల్ బ్రిడ్జ్ సమీపంలో స్మార్ట్ సిటీ కి చెందిన 16 కోట్ల రూపాయల నిధులతో నూతనంగా నిర్మాణం చేస్తున్న" స్పెషల్ పర్పస్ వేక్షిల్", ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ఆఫీస్ భవనాన్ని సునీల్ రావు సందర్శించారు. నగరపాలక సంస్థ అధికారులు, పిఎంసీ అధికారులు, కాంట్రాక్టర్ తో కలిసి ప్రస్తుతం జరుగుతున్న భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఇప్పటికే 70 శాతం పూరైన పనులను పరిశీలించి, మిగితా 30 శాతం పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనుల పై అధికారులు, కాంట్రాక్టర్ కు సూచనలు చేసి ఆదేశాలు జారీ చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి... జనవరి మాసంలో ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం మరో వైపు నగరపాలక సంస్థ లో గతంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ను సందర్శించి... దాని పనితీరును తనిఖీ చేసి పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ ద్వారా నగర భద్రతా చర్యల కోసం ఏర్పాటు చేసిన సర్వలెన్స్ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నలింగ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, అడ్రస్ ఇంగ్ సిస్టమ్, తదితరల అంశాల పై కమాండ్ కంట్రోల్ సిబ్బందిని ఆరా తీసారు. కెమెరాల పనితీరును పరిశీలించి... కమాండ్ కంట్రోల్ పూర్తి స్థాయి పని తీరు పై సోమవారం పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు.

దేవంపల్లి గురుకులంలో జోనల్ మీట్ ను సక్సెస్ చేసిన ప్రిన్సిపాల్ జగన్నాథం: అంబేద్కర్ సేవ రత్న అవార్డు గ్రహీత రమేష్

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 22(భారత శక్తి)సాంఘిక సంక్షేమ గురుకులం మానకొండూరు దేవంపల్లిలో నవంబర్ 11 నుంచి 14 వరకు 10 వ జోనల్ మీట్ క్రీడలు జరిగాయి. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ క్రీడలను ప్రిన్సిపల్ గోలి జగన్నాథం సమర్థవంతంగా నిర్వహించి అందరి మన్ననలు పొందారాని ఇన్చార్జిగా ప్రిన్సిపాల్ గా చార్జి తీసుకున్న ఒక నెలలో అనేక సవాల్లను దాటుకుంటూ,జోనల్ మెట్ ను సక్సెస్ చేయడం వట్ల దేవంవల్లి పేరెంట్స్ హర్షం వ్యక్తం ప్రకటించారు.అనంతరం 10 వ జోనల్ స్పోర్ట్స్ కు సహకరించిన సీనియర్ స్వేరో , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవ రత్న అవార్డు గ్రహీత మొగు రం.రమేష్ కు గురువారం ఉదయం శాలువా కప్పి ఘన సన్మానం దేవంపల్లి గురుకుల ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ కొమురయ్య, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ రబియా, సీనియర్ టీచర్ శ్రావ్య, టీచర్లు చారి, ఆంజనేయులు, బాబు, పి ఈ టీ లు శివప్రసాద్, ప్రవీణ్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు రేణిగుంట బాబు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ లు , పాల్గొన్నారు

న్యాయవాదులకు రక్షణ చట్టం కావాలి: ఐ.ఏ.ఎల్ రాష్ట్ర నాయకులు వెంకటస్వామి

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 22(భారత శక్తి): భారత న్యాయవాదుల సంఘం ఐ ఏ ల్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈనెల 30 నుండి వచ్చేనెల 1 వరకు హన్మకొండ లో జరిగే మహాసభల వాల్ పోస్టర్ ను శుక్రవారం జిల్లా కోర్టు లో ఆవరణలో సీనియర్ అడ్వకేట్ మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ రోజు రోజుకీ న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందనీ,తక్షణమే న్యాయవాదుల రక్షణ కోసం చట్టం చేయాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన న్యాయవాదుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. జూనియర్ న్యాయవాదులకు ప్రతి నెల 5000 రూపాయలు స్టైఫండ్ ఇవ్వాలని, హెల్త్ కార్డులను 10 లక్షలకు పెంచాలని, హౌసింగ్ సొసైటీ కింద ప్రతి న్యాయవాదికి ఇంటి స్థలం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ లాయర్స్ ఐ . ఏ .ఎల్. రాష్ట్ర ద్వితీయ మహానభలను విజయవంతం చేయాలన్నారు. మహాసభలలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించడం జరుగుతుందని, మహాసభల జయప్రదానికై కరీంనగర్ జిల్లా నుండి అధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరై జయప్రదం చేయాలని వెంకటస్వామి న్యాయవాదులను కోరారు.కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నత్యనారాయణ,మురహరి రావు,బాలకృష్ణ రావు,లక్ష్మణ్ రావు,వేణుగోపాల్, న్యాయవాదులు వివేకానంద,శంకరయ్య, రే ణు క ,మ హే ం ద ర్ ,ఆ ం జ నే యులు,రాజశేఖర్ లు పాల్గొన్నారు.

సీఎం కప్ లో యోగాసనకు చోటు

కృతజ్ఞతలు తెలిపిన టిఫైఎస్ఎ రాష్ట్ర నేతలు.

కరీంనగర్ ప్రతినిధి,నవంబర్ 22(భారత శక్తి):రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న సీఎం కప్ క్రీడోత్సవాలలో యోగాకు చోటు కల్పించడం పట్ల తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ హర్షం ప్రకటించింది.శుక్రవారం హైదరాబాద్ లాల్ బహుదూర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి సోనీ బాలాదేవిని కలిసిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.తెలంగాణ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, అసోసియేషన్ ప్రతినిధులు యోగ రామ్ రెడ్డి , తోట సతీష్,రవీందర్ చైర్మన్ ను కలిసిన వారిలో ఉన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రావు మాట్లాడుతూ డిసెంబర్ మాసంలో నిర్వహించే సీఎం కప్ లో జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు యోగానా పోటీలు ఉండబోతున్నాయనితెలిపారు.

సీఎం కప్ లో యోగాను చేర్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. యోగ అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతుంది. ఖేలో ఇండియా, ఖేలో ఇండియా ఉమెన్స్ నేషనల్ గేమ్స్, యూత్ గేమ్స్ ఏషియన్ పోటీలలో కూడా యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దీనివల్ల క్రీడాకారులు ఆరోగ్యవంతమైన జీవనంతో పాటు, విద్య,ఉద్యోగ రంగాలలో అవకాశాలు పొందడానికి అవకాశాలు ఏర్పడ్డాయని అసోసియేషన్ కార్యదర్శి నందనం కృపాకర్ చెప్పారు.

దివ్యంగులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)నవంబర్22:అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల క్రీడా పోటీలను ప్రారంభించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జె ఎన్ ఎస్ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగుల క్రీడా మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలసి ఎంపీ డా. కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై వారి చేతులమీదుగా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సమాజంలో దివ్యాంగులు అందరితోపాటు సమానమేనని, ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందే స్వచ్ఛంద సంస్థలతో దివ్యాంగులకు అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బ్యాటరీ సైకిల్స్, కృత్రిమ కాలు, చేతు అవయవాలు అంద జేశామన్నారు. చిన్నారుల్లో జన్యుపర లోపాలను అంగన్ వాడీ సెంటర్లలో ముందస్తుగానే గుర్తించాలన్నారు. వారికి ప్రత్యేకంగా స్పీచ్ థెరపీ, మానసిక వైద్య నిపుణుల ద్వారా చికిత్స అదిస్తే 80 శాతం వ్యాధి బారి నుండి బయటపడే అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్లలో 5శాతం దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించి మంజూరు చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు సంకల్పసిద్ధులని వారికున్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తే వారు ఎంచుకున్న రంగంలో రాణిస్తారని అన్నారు.దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ప్రత్యేక దృష్టి సారించారని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో దివ్యాంగుల సంక్షేమం కోసం చర్చిస్తామని. దివ్యాంగుల సంఘ ప్రతినిధులు అధికారులు సంబంధిత డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి జయంతి, ఇంచార్జి డి వై ఎస్ ఓ శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షులు మహేందర్, దివ్యాంగ ప్యారా జెనరల్ సెక్రటరీ ప్రశాంత్, రాష్ట్ర రెడ్ క్రాస్ సొసైటీ ఈసీ మెంబర్ ఈ వి శ్రీనివాస్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సంరక్షణే పోలీసుల ప్రధాన ధ్యేయం : జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల.

భారత శక్తి ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 22:నిర్మల్ జిల్లా కేంద్రంలోని భరోసా కేంద్రం, నిర్మల్ నందు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు భరోసా సెంటర్‌లో భరోసా కౌన్సెలింగ్ ద్వారా తిరిగి కలుసుకున్న అన్ని జంటల తో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.జిల్లాలో తొలి మహిళా ఎస్పి గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నిర్మల్ పోలీస్.. మీ పోలీస్ అంటూ నిర్మల్ పట్టణంలో భరోసా సెంటర్ ను ప్రారంభించి అక్కడ ఉద్యోగస్తుల ను నియమించుకుని అందరూ అందుబాటులో ఉండే విధంగా నిరంతరం ఎస్పి స్వీయ పర్యవేక్షణలో భరోసా కేంద్రమును నడుపుచున్నారు.ఇక్కడ చిన్న చిన్న సమస్యలతో , క్షణికావేశంలో, చిన్న చిన్న మనస్పర్థలతో, కుటుంబ కలహాలతో దూరంగా ఉంటున్న కుటుంబ సభ్యులకు మరియు భార్య భర్తలకు భరోసా కేంద్రం లోని నిశ్నాతులచేత, ఒక మహిళా ఎస్ఐ పర్యవేక్షణలో కౌన్సెలింగ్ ఇప్పించటం జరుగును. వారు చెప్పిన మాటలు ఓపిగ్గా విని ఒక సారి చెపితే వినకపోతే మరల మరల పిలిపించుకొని వారిని ఒకటి చేయటమే ద్యేయంగా వని చేయటం జరుగుతుంది.వీరి కృషి ఫలితమే ఇప్పటి వరకు 52 కుటుంబ జీవితాలను నిలబెట్టటం జరిగింది. కలిసిన జంటల మరియు వారి కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. వీరందరూ ఎస్పి స్వీయ నేతృత్వం లొ పని చేస్తున్న భరోసా కేంద్రం యొక్క సేవలను కొనియాడారు. ఓపికతో మా బాధలు వినటమే కాకుండా మమ్మల్ని ఒకటి చేయటానికి భరోసా సభ్యులు చేసిన కృషి మరువలేనిది అని కొనియాడారు. మా బాధలు మా కుటుంబ సభ్యులే వినేవారు కాదు, సమాజం లోని కొంత మంది సూటి పోటీ మాటలతో మానసికంగా హీసించేవారు. కానీ భరోసా కేంద్ర సభ్యులు ఓపికతో మా కుటుంబ పెద్దల్లగా విని ఇరువురుని సర్దిచేపటమే కాకుండా జీవితాంతం కలిసి ఉండేలా సూచనలు ఇవ్వత హర్షించదగ్గ విషయం అన్నారు.

ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు ఒకే చోట మెడికల్, న్యాయసలహా, వైద్యం, కౌన్సిలింగ్, సైకాలజికల్ సమస్యలను ఇలా అన్ని సౌకర్యాలు ఒకే చోట కల్పిస్తూ రాష్ట్ర పోలీసు ఉమెన్ అండ్ చెల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో భరోసా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగినది. మహిళల భద్రతకు భరోసనిస్తూ, బాధిత మహిళలను, పిల్లలను హక్కున చేర్చుకొని, కొండంత ధైర్యాన్నిస్తూ, మహిళల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా భరోసా సెంటర్ సేవలు అందిస్తుందని అన్నారు. జిల్లాలోని ఏ ప్రాంతమైనా సరే తప్పకుండా పోలీసులు ఇంటి వారిలాగా పరిగణించి ఏ సమస్య వచ్చినా చెప్పుకుంటే తప్పకుండా సమస్యకి పరిష్కారాన్ని చూపేలా ప్రయత్నం చేయడంలో నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం 100% పని చేస్తుంది అనే నమ్మకం మీలో కలగాలి ఎందుకంటే దాంపత్య జీవితం అనేది ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు పంచే లాగా ఉండాలి తప్పితే సమస్యల వల్ల విడిపోయి దూరంగా ఉండడం ఇరువురికి ఎంత బాధని కలిగిస్తుందో ప్రతి ఒక్కరికి తెలుసు అని అందుకొరకై ఇలాంటి సమస్య వచ్చినా తప్పకుండా భరోసా సెంటర్ సిబ్బందిని గాని లేదా జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో వచ్చి చెప్పిన కూడా తప్పకుండా తోడుగా ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేస్తామని హామీ ఇస్తున్నాను. అలా అని పోలీసులు వారి జీవన శైలి సైతం అందరికీ తెలిసిందే వృత్తి ధర్మానికి న్యాయం చేయాలని కోణంలో ఆలోచిస్తూ చాలా సందర్భాల్లో తమ సొంత కుటుంబాలకు కూడా ఇవ్వలేని సమయాన్ని నిర్మల్ జిల్లా ప్రజల కోసం కేటాయిస్తున్నారు.

అందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నాను. భరోసా సెంటర్ ద్వారా వివిధ పోలీస్ స్టేషన్ లో నమోదైన పోక్సో మరియు అత్యాచార కేసులలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.పోలీసు స్టేషన్ లో కేసు నమోదు మొదలుకొని, చివరివరకు అన్ని తానై వెన్నంటి ఉంటూ, బాధిత మహిళలకు అండగా ఉంటుందని అన్నారు. మహిళలు మరియు పిల్లల పై జరిగే నేరాలను, హింసను తగ్గించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యం అని కావున మహిళలు, యువతులు, బాలికలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల. తెలిపారు. ఇక్కడ షి టీం సభ్యులు కూడా ఉన్నారని వారు బాలికల, మహిళల, విద్యార్థుల భద్రత, రక్షణ కొరకు పనిచేస్తున్నాయని, ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేసిన, మానసికంగా, శారీరకంగా హింసించిన, సోషల్ మీడియాలో ఫోటోలను మార్చి వేధింపులకు గురిచేసిన వారి వివరాలను షిటీమ్ పోలీసులకు సమాచారం ఇస్తే ఆకతాయిలను పట్టుకొని వారు మైనర్ గా ఉంటే కౌన్సిలింగ్ ఇవ్వడం, మేజర్ గా అయితే కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అని ఎవరైనా కొత్త వ్యక్తులు చెప్పే మాయమాటలకు మోసపోవద్దని, సూచించారు. ఉమెన్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ, ఫోక్సో చట్టాల గురించి బాల్య వివాహాల గురించి, మానవ అక్రమ రవాణా, బాలలను అక్రమ రవాణా, బాలలను అక్రమ దత్తత లాంటివి చేయకూడదని ఇలాంటి అక్రమ రవాణాలు జరిగినట్టు మీకు దృష్టికి వస్తే వెంటనే జిల్లా షీటీమ్ నెంబర్ 8712659550 నెంబర్ కు, లేదా డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనిస్పెక్టర్లు, ఆర్ ఐ లు, ఎస్సైలు, ఆర్.ఎస్ఐ లు, మహిళా ఎస్ఐ సుమాంజలి, సుమలత, జ్యోతిమణి, పెర్సిన్, జిల్లా పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, భరోసా సెంటర్ సిబ్బంది, షి టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణ యువజన సేవసంఘం జిల్లా కన్వీనర్ గా శ్రీనివాస్

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 22(భారత శక్తి):తెలంగాణ నాయి బ్రాహ్మణ యువజన సంఘం జిల్లా కన్వీనర్ గా సమ్మెట శ్రీనివాస్, కో కన్వీనర్ వేణులను జిల్లా కమిటీ అధ్యక్షులు నిలం మొండయ్య , కార్యదర్శి సంపత్ లు శుక్రవారం ఒక ప్రకటనలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలోని 10 మండలాల్లో యువజన సంఘాల ను బలోపేతం చేస్తామని, మాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తామని చెప్పారు.. మా నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు, కార్యదర్శికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

బండెల రమేష్ (టీచర్) ప్రధమ వర్ధంతికి హాజరైన స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ (శ్రీమాన్)

భారతశక్తి ప్రతినిధి, హనుమకొండ,నవంబర్ 22:గ్రేటర్ వరంగల్ హనుమకొండ 5 వ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ వాస్తవ్యులైన బండెల రమేష్ (టీచర్) ప్రధమ వర్ధంతికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కార్పొరేటర్ పోతుల శ్రీమన్నారాయణ (శ్రీమాన్) వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని శుక్రవారం తెలిపారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ గాండ్ల స్రవంతి, సోషల్ మీడియా అధ్యక్షుడు గుత్తికొండ సురేందర్,ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి లక్ష్మీనారాయణ, కానుగంటి సతీష్ కుమార్, దండబోయిన శ్రీకాంత్, అనిత,అహల్య,న్యవ్న, అనిశెట్టి న్యవ్న,రాణి సురేష్,రమేష్,తిలక్ దావూద్ జఫి,సంపత్,తదితరులు పాల్గొన్నారు.

ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాలకు నేత్రదానం చేసిన నీల రాజేశ్వరి

భారతశక్తి ప్రతినిధి, హనుమకొం
నవంబర్ 22:కరీంనగర్ పట్టణంలోని పా
బజార్ కు చెందిన నీల రాజేశ్వరి, (7
నంవత్సరములు గురువారము రా
మరణించగా,శుక్రవారం ఉదయం ఆమె చి
కోరిక మేరకు ఆమె కుమారుడు నీల రమే
కోడలు నీల మాధవిలత నీల రాజేశ్వ
నేత్రాలను ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్యశాల
పంపించి నేత్రదానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కో
అన్నారెడ్డి, చింతల కిషన్ పటేల్, కరీంనగ
లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముక్క శర
కృష్ణమ్యాదం శివకాంత్, బట్టు వినోద్ కుమా
లంబు సుధాకర్ రెడ్డి, కొండ రాంబాబు,కేశె
రజిత,కేశెట్టి శ్రీకాంత్, కాచం రజిని,కాచ
నాగరాజు,బంధుమిత్రులు అధిక సంఖ్య
పాల్గొన్నారు.

వేధింపులకు గురౌవుతున్న మహిళలు మౌనం వీడి షీటీంకు ఫిర్యాదు చేయండి: వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ ప్రతినిధి(భారత శక్తి)నవంబర్22:మహిళలు ఎక్కడ్కెన లైంగిక వేధింపులకు గురౌవుతుంటే మౌనం పాటించకుండా ధైర్యంగా షీ టీంకు ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ మహిళలు, విధ్యార్థునులకు పిలుపునిచ్చారు. వివిధ ప్రదేశాల్లో మహిళలు ఏవిధమైన లైంగిక వేధింపులకు గురౌవుతున్నారు. తక్షణమే సదరు బాధిత మహిళలు స్పందించాల్సిన తీరుపై మహిళలకు అవగాహన కల్పించేందుకుగాను తెలంగాణ మహిళ రక్షణ విభాగం నూతనంగా రూపొందించిన వాల్‌పోస్టర్లను వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం అవిష్కరించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మహిళలు బాలికల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అలాగే మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన పట్లకూడా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తోంది. ప్రధానంగా మహిళలు, బాలికలు,అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా వుండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని.

మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడ్కెన లైంగిక వేధింపులకు గురౌవుతున్న, అలాగే ర్యాగింగ్ ముగుగులో విద్యార్థునులు సైతం వేధింపులకు గురౌవుతున్న మహిళలు, విధ్యార్థునులు, బాలికలు మౌనంతో వుందిపోకుండా, ధైర్యంగా స్థానిక షీ టీం బృందాన్ని సంప్రదించాలని, మహిళల భద్రత కోసమే షీ టీం లేదా డయల్ 100 సమాచారం ఇవ్వాలిందిగా పోలీస్ కమిషనర్ మహిళలకు పిలువునిచ్చారు. ఈ కార్యక్రమములో పరిపాలన విభాగం అదనపు డిసిపి రవి, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి జితేందర్ రెడ్డి, వరంగల్ షీ టీం ఇన్స్‌స్పెక్టర్ సుజాతతో పాటు షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

శివాని డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా విజయవంతం: కరస్పాండెంట్ %&% సెక్రటరి తళ్ళపల్లి స్వామి గౌడ్ వ

హనుమకొండ, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:హనుమకొండ భీమారంలోని శివాని డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మెళాకు అధిక సంఖ్యలో యువత హాజరై విజయవంతం చేశారని శివాని విద్యాసంస్థల కరస్పాండెంట్ %ఁ% సెక్రటరి తళ్ళపల్లి స్వామి గౌడ్ తెలిపారు.ఈ జాబ్ మేళాకు 12 కంపెనీలు 300 పైగా అభ్యర్థులతో ఇంటర్వులను నిర్వహించి వారిలో ప్రతిభ ఆధారంగా వారికి కావాల్సిన నైపుణ్యత గల అభ్యర్థులను 70 మంది యువతి యువకులను ఎంపిక చేసుకున్నారు. ఇందులో శివాని డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులకు డిగ్రీ పూర్తి చేసుకున్న 20 “విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైనారు. వారికి నియమక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వద్దె సురేష్ మాట్లడుతూ విద్యార్థులకు కావలసిన స్కిల్ డెవలప్ చేస్తూ ఈలాంటి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి మా కళాశాల ఎప్పుడు ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో శివాని డిగ్రీ కళాశాల డైరెక్టర్లు మురళి, రమేష్,సంతోష్ రెడ్డి, సురేందర్ రెడ్డి, చంద్రమోహన్ గౌడ్,డాక్టర్ శివకుమార్ గౌడ్,రాజు, ప్రిన్సిపాల్ సంజీవ్, ప్రోగ్రామ్ అఫిసర్ ప్రశాంతి అధ్యాపకులు ఎర్రం రమేష్, విష్ణువర్ధన్రెడ్డి,న్వవ్నలత, యాకాంతం,వవన్,రమేష్ రెడ్డి,జ్ఞానేశ్వర్,నాగరాజు, అశోక్,స్వాతి, తదితరులు పాల్గోన్నారు.

మా ఊరు సేవ సంఘం ఆధ్వర్యంలో పేద ప్రజలకు నిత్యవసర వస్తువుల పంపిణీ

మందమర్రి, భారత శక్తి ప్రతినిధి,నవంబర్ 22:మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామంలో మా ఊరు సేవ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సంఘం అధ్యక్షులు పెద్ది రాజన్న,సంఘం ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం యాదవ్ పాల్గొని పేద ప్రజలకు నిత్యవసరకులు అందజేశారు.

అనంతరం సదానందం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించి పేదలకు అండగా ఉన్న మా ఊరు సేవ సంఘం సభ్యులను అభినందించారు. పేదలకు సహాయపడే ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని పేదలకు సహాయపడే కార్యక్రమానికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. అనంతరం సేవా సభ్యులు బండి సదానందం ను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట రాజన్న, మేకల శంకర్, లు తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతిని కాపాడుకుందాం

ఈ నెల 26న టిడిడీ ఆవరణలో కార్తీక దీపోత్సవం

సమితి అధ్యక్షులు సుగుణాకర్ రావు

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్22(భారత శక్తి):ప్రపంచంలో మన సంస్కృతి, సాంప్రదాయ, ఆచార వ్యవహారాలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, దాని విశిష్టతను చాటి చెప్పుతూ భావితరాలకు అందజేయాలనే ఉద్దేశ్యంతో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆ సమితి అధ్యక్షులు, బిజెపి సీనియర్ నాయకులు పోల్సాని సుగుణాకర్ రావు తెలిపారు. శుక్రవారం నగరంలోనీ గాంధిరోడ్ లోగల టిడిడీ కళ్యాణమండపమలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సుగుణాకర్ రావు మాట్లాడుతూ ఈ నెల 26వ తేది మంగళవారం సాయంత్రం గాందిరోడ్ లోని టిడిడీ కల్యాణ మండపంలో కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ నిర్వహణ సారథ్యంలో అంగరంగ వైభవంగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. మన సాంప్రదాయాలలో కార్తీక మాసానికి చాలా విశిష్టతుందన శివకేశవులు ఇరువురిని ఆరాధించే ఈ మాసం ప్రత్యేకత అని గుర్తుచేశారు.కార్తీక మాసంలో దీపారాధన, దీపోత్సవం ద్వారా చీకటిని తొలగించి వెలుగుని నింపినట్లు సమాజంలోని చెడును తొలగించి మంచిని ప్రోత్సహించుటయే దీపోత్సవ లక్షమని స్పష్టం చేశారు. ప్రతి పండుగ, ఆచారం మానవాళి హితం కొరకనీ మన పూర్వీకులు ప్రారంభించారని అలాంటి వారసత్వాన్ని మన భావితరాలకు అందజేయాలనే తపనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. కరీంనగర్ లో గత మూడు సంవత్సరాలుగా ఆధ్యాత్మిక భావనతో మన సాంస్కృతి, సాంప్రదాయ వైభవాన్ని తెలియపరిచే విధంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మహిళలు, పుర ప్రముఖులు, ఆధ్యాత్మికచింతకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరుతూ ఆహ్వానిస్తున్నమని చెప్పారు.దిపోత్సవ కార్యక్రమానికి వచ్చే మహిళలు ఇంటి నుంచి ఏమి తీసుకురావద్దని, ప్రమిదలు, నూనె, వత్తులు సమితి ఆధ్వర్యంలో అందజేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమం రాజకీయాలకు ఏమి సంబంధం లేదని, ధర్మ బద్ధంగా, సంప్రదాయాలకు అనుగుణంగా ఆధ్యాత్మిక బావాలకు తగ్గట్టుగా చేపట్టడం జరుగుతుందన్నారు. ఆధ్యాత్మిక కలిగిన హిందూ మత గురువులు సైతం పాల్గొంటారని చెప్పారు.ఈ సమావేశంలో కార్తీక దీపోత్సవ సమితి వ్యవస్థాపక సభ్యులు గంప జగన్, తాళ్లపెల్లి హరికుమార్ గౌడ్, బేతి మహేందర్ రెడ్డి, మారుతీ, తాడూరి బ్రహ్మం, జెడి భగవాన్, పసుల మహిపాల్, కామారపు నరహరి, పిట్ల స్వామి, తోట రాజేందర్, మొలగూరి కిషోర్, నడిగొట్టు కుమార్, పరశురాములు, కాచం రాజేశ్వర్, భాగ్య, శైలజలు పాల్గొన్నారు.

ధూమ్ దాం గా సాగిన కళా ప్రదర్శనలు, ప్రతిబింబించిన తెలంగాణ సంస్కృతి

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 22: నిర్మల్ జిల్లాలో ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి,సంక్షేమానికి పాటుపడుతూ సమర్థవంతంగా పథకాలను అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సంబురాలు పట్టణంలోని దివ్య గార్డెన్స్ లో గురువారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఆహ్లాదకర వాతావరణంలో సాగిన కళాయాత్ర ప్రదర్శనలో అంతడుపుల నాగరాజు బృందం ఆటపాటలతో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను చాటుతూ, ప్రభుత్వ సంక్షేమ పాలనను ఆవిష్కరింపజేశారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్, గ్రంథాలయ, మార్కెట్ కమిటీల చైర్మన్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పెద్ద సంఖ్యలో మహిళలు, యువతీయువకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఎంతో ఆసక్తి తో కళాకారుల ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఎన్నో రకాల పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలుపరుస్తుందని తెలియజేస్తూ జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరును కలెక్టర్ వివరించారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించిన కళాకారుల బృందాలకు కలెక్టర్ ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఇన్చార్జి డిఆర్ఓ రత్న కళ్యాణి, డీపీఆర్ఓ ఇ.విష్ణువర్ధన్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సయ్యద్ అర్జుమన్ అలి, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్లు గంద్రత్ ఈశ్వర్, రాజుర సత్యం లు, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావ్ పటేల్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు, విద్యార్థులు, మహిళా సంఘాలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏ ఐ పి ఎస్ యు అధ్వర్యంలో 28న చలో పార్లమెంట్ ను విజయవంతం చేయండి: జిల్లా కన్వీనర్ చాకటి ఆనంద్ కుమార్

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 22: నిర్మల్ జిల్లా అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్ ఎస్ ఆర్ కళాశాల వద్ద చలో పార్లమెంట్ పోస్టర్ల ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐపిఎస్ యు జిల్లా కన్వీనర్ చాకటి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 28న విద్యా ,ఉపాధి మరియు ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడాన్ని , అదేవిదంగా ప్రజా వ్యతిరేక విధానాన్ని మానుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ విద్య రంగాన్ని కాపాడుకోవాలంటే కొఠారి కమిషన్ ప్రకారం మొత్తం కేంద్ర బడ్జెట్లో విద్య రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలి, కానీ ప్రతి ఏటా 2-3శాతం కంటే ఎక్కువ కేటాయించడం లేదని అన్నారు.కార్పొరేట్ వ్యక్తులకు విద్యారంగాన్ని ధారా దత్తం చేసేందుకే ఈ నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల, మేధావుల అభిప్రాయం తీసుకోకుండా నేరుగా అమలు చేయడం దారుణమని అన్నారు. వెంటనే నూతన జాతీయ విద్యా విధానం 2020 ను రద్దు చేయాలని, చరిత్రను వక్రీకరిస్తూ చేస్తున్న ఎన్సీఈఆర్ సిలబస్ మార్పులను ఆపాలిఅని అన్నారు. యూనివర్సిటీ గ్రాండ్ కమిషన్ నిధులను తగ్గించి నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాలని తెలిపారు.యూనివర్సిటీలో స్వయం ప్రతిపతి ని కాపాడాలి, ఎస్సీ ఎస్టీ మైనారిటీ పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్ లో కోతలు విరమించుకోవాలని,అదేవిధంగా విద్యా కాషాయీకరణ కుట్రను మానుకోవాలని అన్నారు. శాస్త్రీయ విద్యా విధానాన్ని బలపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమం చేయడం జరుగుతుందని,విద్యార్థి యువజన మహిళ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జిన్నారం మండల కేంద్రంలో సామాజిక, ఆర్థిక ,విద్య, ఉపాధి ,రాజకీయ, కుటుంబ సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 22:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కుటుంబ సర్వే వివరాలలో తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సూచించారు. మండల కేంద్రమైన జిన్నారంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లతో మాట్లాడి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పై ప్రజలు అపోహలు పెట్టుకోకుండా సర్వే సిబ్బంది అడిగిన ప్రతి సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. సర్వేలో తీసుకున్న వివరాలు గోప్యం గా ఉంటాయని ప్రతి అంశాన్ని కోడుల రూపంలో రాస్తున్నందున సర్వేకు పూర్తిస్థాయి భద్రత ఉంటుందన్నారు. సర్వే పై ప్రజలు అపోహలు పెట్టుకోవదన్నారు. సర్వే సిబ్బంది కి పూర్తిస్థాయిలో ప్రజలు సహకరించి వారు అడిగిన వివరాలు అందజేయాలని సూచించారు. సూపర్వైజర్లు రూట్ అధికారులు సర్వే పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే సిబ్బందికి వచ్చే అనుమానాలను వెంటవెంటనే సూపర్వైజర్లు అధికారులు నివృత్తి చేసి కచ్చితత్వంతో కూడిన సర్వే జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి , ఏం పి డి ఓ అరుణారెడ్డి , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .

సర్వేను 100శాతం పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయి

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 22(భారత శక్తి):ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను రేపటి లోగా 100 శాతం పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రపుల దేశాయి ఆదేశించారు. కరీంనగర్ మండలం నగునూరు గ్రామంలో చేపట్టిన కుల గణన తోపాటు, కుటుంబ సమగ్ర సర్వే ఎన్యుమారెటర్ల వద్దకు వెళ్లి పరిశీలించారు.ఎన్యుమారెటర్లను సమన్యలు ఏమైనా ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.కరీంనగర్ మండలంలో నిర్వయించే సర్వే నేటి సాయంత్రంతో ముగుస్తుందని, అందరు సమన్వయంతో 100 శాతం పూర్తిచేయాలని ఆదేశించారు.అలాగే సర్వేలో పాల్గొనని వారి వివరాలు సేకరించి వారినీ సర్వేలో పాల్గొనే విధంగా ఆవాహన కల్పించాలన్నారు. గ్రామంలోని పాతపోచమ్మకుంట వద్ద నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులను అదనపు కలెక్టర్ పర్యవేక్షించారు.ఈ గ్రామం అభివృద్ధిలో పాలకమండలి సహకారంతో ముందంజలో ఉందన్నారు.వారి వెంట ఎంపిడిఓ సంజీవరావు, ఎంపీఓ జగన్మోహన్ రెడ్డి, అరి ఐ కనుకరాజులు పాల్గొన్నారు.

ఆటో కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేత

మందమర్రి, (భారత శక్తి) నవంబర్ 22:మండలంలోని నార్లపూర్ గ్రామంలో నివాసం ఉంటున్న ఏనుగు పోషం గత సంవత్సరం రోడ్డు ప్రమాదంలో వెన్నుపూస విరగడం వలన అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడారు. విషయం తెలిసి ఆటో కార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో వారి కుటుంబానికి 25 కిలోల బియ్యం నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నేరెళ్ల వెంకటేష్ ,గౌరవ చైర్మన్ మొయ్య రాంబాబు, సముద్రాల శ్రీనివాస్, సూరం శ్రీనివాస్, పంబాల శ్రీనివాస్, మామిడాల సారయ్య, ఏదులపురం రాజు, ఆకుల శ్రీనివాస్, పాల రమేష్, కొప్పుల సంజీవ్, జనార్ధన్, ఐ. రమేష్, దుర్గం రవి లు పాల్గొన్నారు.

కామారెడ్డి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులు పంపిణీ చేసిన ప్రభుత్వ సలహాదారులు

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, నవంబర్ 22: కామారెడ్డి నియోజకవర్గం పట్టణము లోని విద్యానగర్ కు చెందిన ప్రియ శైలేష్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 60 వేలు, 56 వేల రెండు చెక్కులు ప్రభుత్వ సలహాదారులు మాజీ మంత్రి షబ్బీర్ అలీ వారికి పంపిణీ చేసారు .ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, కౌన్సిలర్ అన్వర్ అహెమద్, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, అధ్యక్షులు పంపరి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన,

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి: మండల విద్యాధికారి శ్రీనివాస్

మందమర్రి (భారత శక్తి) నవంబర్ 22:రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని మండల విద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఆయన పట్టణంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల హాజరు నమోదు, వివిధ రికార్డులను, పాఠశాల పరిసరాలను, పని విధానాన్ని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి, వారి మేధాశక్తిని పరీక్షించి, పాఠశాల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్థికంగా నష్టపోకుండా, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం అందజేయడంతో పాటు మధ్యాహ్న భోజనం సైతం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, వారిలోని సృజనాత్మకను వెలిక్కి తీసే విధంగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు ఇన్నారెడ్డి, భీం పుత్ర శ్రీనివాస్, రవి, ఉమా లు పాల్గొన్నారు.

ప్రజల మద్దతు పెరుగుతున్నందుకే ఆహ్వానాలు అందడం లేదా?

-ఇది మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పంతానికి పరాకాష్ట నా?

-మంచిర్యాల జిల్లా రాజకీయంలో ఊపందుకున్న వాడి వేడి చర్చ



(భారత శక్తి,)మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 22:మంచిర్యాల పట్టణంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ ఆధ్వర్యంలో తలపెట్టిన మాతా శిశు సంక్షేమ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ భూమి పూజకు పెద్ద పెళ్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేరు ఆహ్వాన పత్రికలో లేకపోవడం చాలామంది రాజకీయ విశ్లేషకులను విస్మయానికి లోను చేసింది. ప్రోటోకాల్ ప్రకారం తప్పకుండా ఎంపీ పేరు ఉండవలసిందే అంటున్నారు మేధావులు. మంచిర్యాల ఎమ్మెల్యే పంతానికి పరాకాష్ట నా అని మేధావి వర్గం ఆలోచిస్తుంది. అతి చిన్న వయసులోనే పెద్దపెల్లి ఎంపీగా గెలిచి అభివృద్ధికి ఆశా కిరణంగా మారిన గడ్డం వంశీకృష్ణ. యువతరం అతనికి దాసోహం అంటుంది. ప్రజల మద్దతు పెరుగుతున్నందుకే ఆహ్వానం అందటం లేదా అని ప్రజలు వాపోతున్నారు. వారి తాత ఒక రాజకీయ కురువృద్ధుడు కాంగ్రెస్ పార్టీకే ఒక మూల స్తంభం. మహామహులనే రాజకీయాలకు పరిచయం చేసిన ఒక గొప్ప రాజకీయ వేత్త .కాకా అంటే ఢిల్లీలో కేక పుట్టించే పేరు అది. మరి వారి కుటుంబానికి ఇలా జరుగుతే ఎలా అంటున్నారు అభిమానులు. వారి తండ్రి ఒక గొప్ప ఆదర్శాలు కలిగిన రాజకీయవేత్త ప్రజా క్షేత్రంలో అలుపెరగని ప్రజా యోధుడిగా పలుకుబడి ఉన్న ప్రజల కోసమే తన అడుగులు వేసిన మహానుభావుడిగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ పేరు సంపాదించుకున్నారు. వివేక్ అంటే తెలంగాణ కోసం తన పదవులను పణంగా పెట్టి తెలంగాణ సాధనలో ముఖ్యపాత్ర పోషించిన మహా ఋషి అంటారు. మరి ఇదెక్కడి విచిత్రం అంటున్నారు మంచిర్యాల జిల్లా ప్రజలు. తన తాత తన తండ్రి అనుభవాలతో ఆశయాలతో ఉనికిపుచ్చుకొని అతి చిన్న వయసులోనే వ్యాపార రంగంలో అడుగుపెట్టి అనేకమంది నిరుద్యోగులకు బాసటగా నిలిచిన గొప్ప యువశక్తి వంశీకృష్ణ. రాజకీయంలో ఉంటే ఇంకా ఎంతోమందికి సేవ చేయవచ్చు అనే ఆశయ సాధనతో రాజకీయంలో అరంగేట్రం చేసిన యువ నాయకుడు. తను చేసిన మొదటి ప్రయత్నంలోనే పెద్దపెల్లి ఎంపీగా గెలిచి పెద్దపల్లి ఏడు నియోజకవర్గాలను అభివృద్ధి బాటలో కథము తొక్కిస్తున్న యువ కెరటం. తను గెలిచి ఏడాది కాకముందే ఎన్నో పథకాలను తెలంగాణ కోసం తెచ్చిన తెప్పించబోతున్న తెలంగాణ ఆశా కిరణం గడ్డం వంశీకృష్ణ.యువతను తన పనులతో ఆకట్టుకొని యువతకు దారి చూపే నాయకుడిగా ఎదుగుతున్నాడని ఆక్రోశామా, లేదా మంత్రి పదవుల పంతమా అంటున్నారు తన అభిమానులు. ఇంతమంది మన్ననలు చూరగొన్న నాయకుడిని ఎలా మరిచారు అని వారి అభిమానులు ఆవేశంతో ఊగిపోతున్నారు. ఇది ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీకే ముప్పు తెస్తుందని ఇప్పటికైనా అధిష్టానం పెద్దలు చొరవ తీసుకొని దీనిపై స్పందించకపోతే తీవ్ర పరిణామాలకు కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాల్సి వస్తుందని మేధావి వర్గం చెప్పకనే చెబుతుంది. ఏది ఏమైనాప్పటికీ ప్రోటోకాల్ ప్రోటోకాలే ఎవ్వరికి ఎలాంటి అపోహలు ఉన్నా పట్టింపులు ఉన్న ప్రోటోకాల్ ను పాటించవలసిందే అంటున్నారు మేధావులు. మరి దీనిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏమి చేస్తుందో వేచి చూడాల్సిందే.

తాడ్వాయి మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ డీసీఓ క్లస్టర్ ఆఫీసర్

(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, నవంబర్ 22: శుక్రవారం తాడ్వాయి మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా జాయింట్ కలెక్టర్ డీసీఓ క్లస్టర్ ఆఫీసర్ ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, టాబ్ ఎంట్రీలు తొందరగా జరిగేలా చూడాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. టోటల్ మన మండలంలో టాబ్ ఎంట్రీలు వెంటనే చేస్తున్నాం అని సిబ్బంది కూడా అందుబాటులో ఉండి రైతులకు అందుబాటులో ఉంటున్నాం అని జేసీ కి తెలియజేశారు.

రెడ్ల కార్తీకమాస వనభోజన మహోత్సవ ఆత్మీయ ఆహ్వానం

కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 22(భారత శక్తి):ఈ నెల 24వ తేది ఆదివారం రోజున రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో రెడ్ల కార్తీక మాస వనబోజన ఆత్మీయ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, రెడ్డి జే ఏ సి చైర్మన్ పిట్ట శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఆత్మీయ వనమహోత్సవ కార్యక్రమాన్ని హైదరాబాదులోని అనన్య రిసార్ట్స్, డీర్ పార్క్ వక్కన, వనస్థలిపురంలో జరుగుతుందని, రెడ్డిలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.అలాగే భావితరాల బంగారు భవిష్యత్తు కోసం రెడ్డి జాతి ఐక్యతను, ఆత్మగౌరవాన్ని చాటుదాం.జాతీ ఔన్నత్యం , పేద రెడ్ల అభవృద్ధి కోసం లక్ష్యం దిశగా అడుగులు వేద్దాం అన్నారు.

భైంసా తాహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ముందు 9 మందిని బైండోవర్ చేసిన ఎక్సైజ్ అధికారి

భారత శక్తి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 22: నిర్మల్ జిల్లా భైంసా పట్టణములో అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న 9 మందిని శుక్రవారం నాడు ముందు జాగ్రత్తగా భైంసా తాహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ముందు 9 మందిని హాజరు పరిచి బైండోవర్ చేసిన ఎక్సైజ్ ఎస్సై నిర్మల పాటిల్.ఆ తొమ్మిది మంది పై జరిమానా విధించారని తెలిపారు.

జిల్లాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం

ప్రజా ఆరోగ్యం, ప్రమాణాలతో కూడిన విద్య ప్రభుత్వ బాధ్యత

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

భారత శక్తి ప్రతినిధి,మంచిర్యాల,నవంబర్ 22:ఉత్తర తెలంగాణలోని మంచిర్యాల జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో 300 కోట్ల రూపాయల నిధులతో మంజూరైన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టిజిఎంఎస్ఐడిసి ఎండి హేమంత్ బొర్కడే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, తెలంగాణ కనీస వేతనాల వేజెస్ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా హరీష్ రాజ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ ఎండి సులేమాన్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి మాట్లాడుతూ, ఉత్తర తెలంగాణ ప్రాంతంలో మంచిర్యాల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తామని, ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటు మంచి ఆలోచన అని, పేద కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు, ప్రమాణాలతో కూడిన విద్య అందించడం ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటుందని తెలిపారు. వైద్య సేవల కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లకుండా 90 శాతం వైద్యం ఇదే ప్రాంతంలో ఉచితంగా అందించి ప్రజలలో భద్రత, నమ్మకం కలిగిస్తామని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 6 పడకలను 30 పడకలకు అప్ గ్రేడ్ చేయడంతో పాటు మరిన్ని ఉప కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో 7 వేలకు పైగా వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందని, సుమారు 54 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరిగిందని తెలిపారు. అత్యవసర సేవల సమయంలో వేగవంతమైన వైద్యం అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అంబులెన్స్ సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటామని, గిరిజన ప్రాంతాలలో 2, మండలానికి 1 చొప్పున అందించేందుకు కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. ప్రతి 30, 35 కిలోమీటర్లకు ఒక ట్రామా కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర వ్యాప్తంగా 74 ట్రామా కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రజలు ప్రాణాపాయానికి గురి కాకుండా బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో అంబులెన్స్ లను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని కిడ్నీ డయాలసిస్ కేంద్రంలో 10 పడకలను 30 పడకలకు పెంచడంతో పాటు డయాబెటిక్ వ్యాధిగ్రస్తుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో అదనంగా 29 ఉప కేంద్రాల ఏర్పాటుతో పాటు మంచిర్యాల నియోజకవర్గంలోని వెంకట్రావుపేట, చెన్నూర్ నియోజకవర్గంలోని అంగ్రాస్ పల్లి లలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉత్తర తెలంగాణలో 4 క్యాన్సర్ కేంద్రాలు, వస్కులర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది సంఖ్యను పెంచి ప్రజలకు వైద్య సేవలను సంపూర్ణంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మహిళలను విద్యావంతులను చేసి సమాజంలో అభివృద్ధిలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రజలు రాష్ట్ర అభివృద్ధిలో జవాబుదారీగా ఉండాలని, సిద్ధాంత పరంగా సమాజ అభివృద్ధిలో భవిష్యత్తు నిర్ణయాలను జాగ్రత్తగా తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం సంవత్సర కాలంలో అనేక రంగాలలో అభివృద్ధి సాధించిందని, ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీ నుండి డిసెంబర్ 7వ తేదీ వరకు ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు. మంచిర్యాలలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా 7 నియోజకవర్గాలు, మహారాష్ట్ర, చత్తీస్ ఘడ్, ఇతర రాష్ట్రాల నుండి వైద్య సేవల నిమిత్తం వచ్చే ప్రజలకు అందుబాటులో అన్ని సేవలను అందించడం జరుగుతుందని, ప్రజలకు భారం కాకుండా ఉచితంగా సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతని ఇస్తుందని, ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అకుంఠిత దీక్షతో ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, మంచిర్యాలలో వరద ప్రభావిత ప్రాంతాలు ముంపుకు గురికాకుండా 262 కోట్ల రూపాయల వ్యయంతో కరకట్ట నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, 40 కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అభివృద్ధి చేసి నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం క్రింద అంతర్గత రహదారులను నిర్మిస్తూ మండల, జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేయడం ద్వారా వేగవంతమైన అభివృద్ధికి బాటలు వేస్తున్నామని తెలిపారు. జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధికి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు.యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటులో భాగంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలలో మొదటిసారిగా మంచిర్యాల నియోజకవర్గంలోని దండేపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లా ప్రజలకు మందులను అందుబాటులో ఉంచేందుకు డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 6 గ్యారంటీల అమలుకు ఆర్థిక క్రమ శిక్షణతో చర్యలు చేపడుతున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, వసతి గృహ విద్యార్థులకు కాస్మాటిక్, డైట్ చార్జీలు పెంచడం జరిగిందని తెలిపారు. 2 లక్షల రూపాయల రుణమాఫీలో భాగంగా రైతులకు 3 విడతలలో రాష్ట్ర వ్యాప్తంగా 18 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ క్రింద అందించడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని, సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు బోనస్ అందించామని, 800 మెగావాట్ల సామర్థ్యంతో 3 పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తున్నామని, ఆర్థిక వ్యవస్థను సరిచేసి ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందిస్తామని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు మాట్లాడుతూ, జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దాదాపు 15 లక్షల మందికి ఉపయోగపడుతుందని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లలేని వారికి ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటు కొరకు ప్రభుత్వం 300 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని, 225 పడకలతో మాత శిశు, 425 పడకలతో ప్రభుత్వ ఆసుపత్రి కలిపి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం కొరకు ఈ ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఇక్కడే పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా జిల్లాతో పాటు పక్క రాష్ట్రాల నుండి వచ్చే ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

జనహృదయనేతకు జన్మదిన వేడుకలు

హనుమకొండ ప్రతినిధి (భారత శక్తి)నవంబర్22:బాలసముద్రం లోని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ పుట్టినరోజు రోజు వేడుకలను బీఆర్ఎస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. దాదాపు 20 ఏళ్లు ప్రజాప్రతినిధిగా ఓరుగల్లు నగరానికి వేల కోట్లు నిధులు తెచ్చి అభివృద్ధి చేసిన ఘనత దాస్యం వినయ్భాస్కర్ కే దక్కుతుందన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధనలో ఓరుగల్లు కేంద్రంగా ఉద్యమాన్ని నడిపిన నాయకుడని కొనియాడారు. అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారాన్ని కృషి చేసే నిజమైన నాయకుడని అన్నారు.ఈ సందర్భంగా పేదల పెన్నిధిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం వర్గానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ఉడుతల సారంగపాణి, జోరిక రమేష్, డివిజన్ అధ్యక్షులు సదాంత్, కోటేశ్వరరావు, సుంచు కృష్ణ, నాయకులు రజినీ కుమార్, బుద్దె వెంకన్న, విజయ్ రాజు రఘు మహేష్ వరుణ్, గౌస్ ఖాన్, అహ్మద్, ఆరూరి రంజిత్, భైరపాక ప్రశాంత్, మధుకర్, తస్లీమా తదితరులు పాల్గొన్నారు.

అశ్విన్ ఐపీఎల్ మాక్ వేలం..

రూ. 8.5 కోట్లకు ఏ జట్టు తీసుకుందంటే?

్క: ఆస్ట్రేలియా – భారత్ తొలి టెస్టు జరుగుతోంది. మరోవైపు రెండు రోజుల్లో ఐపీఎల్ మెగా వేలం జరగనుంది. దీనికి సౌదీ అరేబియా వేదికగా నిలవనుంది. వేలంలో రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అశ్విన్, సిరాజ్, చాహల్ వంటి భారత స్టార్లు ఉన్నారు. గత ఏడాది వరకు రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన అశ్విన్‌ను ఆ ఫ్రాంచైజీ రిటైన్ చేసుకోలేదు. ఈసారి ఏ జట్టు తీసుకుంటుందో ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలో తనకు తానుగా ఓ ఫ్రాంచైజీకి అమ్ముడైనట్లు అశ్విన్ తెలిపాడు. అయితే, ఇదంతా మాక్ వేలంలో కావడం గమనార్హం.

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే అశ్విన్ క్రికెట్ విషయాలపై స్పందిస్తూ ఉంటాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో డిబేట్‌లూ పెడుతుంటాడు. ఆసీస్‌తో తొలి టెస్టుకు ముందు షేర్ చేసిన వీడియోలో అశ్విన్ మాక్ వేలం నిర్వహించాడు. అందులో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తనను తీసుకున్నట్లు వెల్లడించాడు. రూ. 8.5 కోట్లకు సీఎస్కేకు అమ్ముడైనట్లు పేర్కొన్నాడు. అశ్విన్ 2009 నుంచి 2015 వరకు ఆ జట్టుకే ప్రాతినిధ్యం వహించాడు. సీఎస్కే స్థానంలో వచ్చిన రైజింగ్ పుణె జట్టులోనూ ఆడాడు. 2017లో గాయం కారణంగా ఆడని అతడు.. తర్వాత పంజాబ్ కింగ్స్‌కు వెళ్లిపోయాడు. 2018లో కెప్టెన్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు. దిల్లీకి వెళ్లిన అశ్విన్ గత మూడు సీజన్లు రాజస్థాన్ జట్టుకు ఆడాడు. సీఎస్కే ఈసారి అశ్విన్‌ను తీసుకొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ముందుగానే ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభం

ఐపీఎల్ 2025 సీజన్ గతంతో పోలిస్తే ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పలు క్రీడా ఛానళ్ల నివేదిక ప్రకారం. . మార్చి 14 నుంచి మే 25 వరకు ఐపీఎల్ 2025 సీజన్ పోటీలు జరగనున్నాయి. ఐపీఎల్ 2026 ఎడిషన్ మార్చి 15 నుంచి మే 31 వరకు.. ఐపీఎల్ 2027 సీజన్ మార్చి 14 నుంచి మే 30 వరకు జరుగుతాయని కథనాలు వస్తున్నాయి. అయితే, వీటిపై ఐపీఎల్ కమిటీ లేదా బీసీసీఐ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

రోహిత్.. ఆదివారం నాటికి

పెర్త్: భార్య ప్రసవించడంతో పెర్త్‌లో ఆస్ట్రేలియాతో జరిగే తొలి టెస్టుకు దూరమైన భారత కెప్టెన్ రోహిత్‌శర్మ (%ఙుఙ్ఞుఅఅ =శీష్ట్రఱ్ వాష్ట్రుతీఎఱ%) ఆదివారం జట్టును కలుసుకోనున్నాడు. తొలి టెస్టు మూడోరోజు నాటికి అతడు పెర్త్‌కు చేరుకోవచ్చని భావిస్తున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. నవంబర్ 15న రోహిత్ భార్య రితిక మగబిడ్డకు జన్మనిచ్చింది. తొలి టెస్టులో రోహిత్ గైర్హాజరు నేపథ్యంలో పేసర్ జస్ప్రీత్ బుమ్రా టీమ్ఇండియాకు సారథ్యం వహిస్తున్నాడు. డిసెంబర్ 6న అడిలైడ్‌లో ఆరంభమయ్యే రెండో టెస్టులో రోహిత్ (%=శీష్ట్రఱ్ వాష్ట్రుతీఎఱ%) బరిలో దిగనున్నాడు. అతడు జట్టు సభ్యులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాడని తాత్కాలిక కెప్టెన్ బుమ్రా తెలిపాడు.

కోహ్లి స్ఫూర్తితో..

పెర్త్: భారత జట్టుకు ఎక్కువ కాలం ఆడాలనుకుంటే ఆటతో పాటు క్రమశిక్షణ చాలా ముఖ్యమని విరాట్ కోహ్లి సలహా ఇచ్చాడని యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అన్నాడు. చిన్న వయసులోనే టెస్టులు ఆడే అవకాశాన్ని దక్కించుకున్న యశస్వి.. ఓపెనర్‌గా స్థిరంగా రాణిస్తున్నాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్–గావస్కర్ సిరీస్‌లోనూ అతడు కీలకం కానున్నాడు.

''సీనియర్ క్రికెట్ జట్టులోకి వచ్చినప్పుడు విరాట్ పాజీతో మాట్లాడాను. క్రికెటర్‌గా తానెలా ముందుకు సాగాడో అతడు వివరించాడు. సుదీర్ఘ కాలం టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించాలంటే క్రమశిక్షణ ముఖ్యమని విరాట్ చెప్పాడు. నాకేం చెప్పాడో అతడు అనుసరించడం ప్రత్యక్షంగా చూశా. కోహ్లి స్ఫూర్తితోనే నా అలవాట్లలో మార్పులు చేసుకున్నా. ఎంత ప్రాక్టీస్ చేయాలి.. ఎలాంటి ఆహారం తీసుకోవాలి.. తాజాగా ఎలా ఉండాలో నేర్చుకున్నా'' అని యశస్వి పేర్కొన్నాడు.

రత్‌కు భిన్నంగా ఆస్ట్రేలియాలో బంతి ఎగసి వడుతూ ఉంటుందని దానికి తగ్గట్టుగా ఆటను సర్దుబాటు చేసుకోవాలని జైస్వాల్ తెలిపాడు. ''ఆస్ట్రేలియాలో ఆడబోతుండడం క్రికెటర్‌గా నేర్చుకోవడానికి ఎంతో మంచి అవకాశం. ఇక్కడ పిచ్‌లు నవాల్ వినురుతాయి. బంతి బౌన్స్ అవుతుంది. కానీ దానికి తగ్గట్టుగా ఆటను సర్దుబాటు చేసుకోవాలి'' అని యశస్వి తెలిపాడు.

ఆసీస్‌తో తొలి టెస్టు.. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులకు ఆలౌట్

ఆస్ట్రేలియాతో జరుగుతున్న (తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 150 పరుగులకు ఆలౌటైంది. తెలుగు కుర్రాడు నితీశ్‌రెడ్డి (41) టాప్ స్కోరర్ కావడం గమనార్హం. నితీశ్ కాకుండా.. పంత్ (37), కేఎల్ రాహుల్ (26), ధ్రువ్ జురెల్ (11) మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. యశస్వి జైస్వాల్, దేవదత్ పడిక్కల్ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరారు. విరాట్ కోహ్లి (5), సుందర్ (4), హర్షిత్ రాణా (7), బుమ్రా (8) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లు జోష్ హేజిల్ వుడ్ (4/29), కమిన్స్ (2/14), మార్ష్ (2/12), స్టార్క్ (2/14) సత్తా చాటారు.

పేస్ దెబ్బకు విలవిల..

దూకుడుగా ఆడే యశస్వి జైస్వాల్) పరుగుల ఖాతా తెరవకుండానే 8 బంతులు ఆడి పెవిలియన్‌కు చేరాడు. పిచ్ పేస్‌కు అనుకూలంగా ఉండటంతో పరుగులు రాబట్టడం చాలా కష్టంగా మారింది. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ క్రీజ్‌లో పాతుకుపోయాడు. చాన్నాళ్ల తర్వాత జట్టులోకి వచ్చిన దేవదత్ పడిక్కల్ 23 బంతులు ఆడినా.. ఒక్క పరుగు కూడా చేయకుండానే ఔటయ్యాడు. తమ బౌలింగ్‌ను కాచుకున్న అతడిని హేజిల్‌వుడ్ ఔట్ చేశాడు. తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన విరాట్ కోహ్లి కాస్త కన్ఫిడెంట్‌గా కనిపించాడు. అయినా ఎక్కువ సమయం ఉండలేకపోయాడు. హేజిల్‌వుడ్ బౌన్సర్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమై స్లిప్‌లో దొరికిపోయాడు. అయితే, కేఎల్ రాహుల్ వివాదాస్పద నిర్ణయంతో పెవిలియన్‌కు చేరడం భారత్‌కు ఇబ్బందిగా మారింది.

స్వల్ప వ్యవధిలో వికెట్లను కోల్పోయిన భారత ఇన్నింగ్స్‌ను ఆదుకొనేందుకు రిషభ్ పంత్ (ప్రయత్నించాడు. నిలకడగా ఆడుతూనే బౌండరీలు కొట్టేందుకు ప్రయత్నించాడు. ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్ అనుకున్నంత మేర నక్సెన్ కాలేకపోయారు. యువ క్రికెటర్ నితీశ్ రెడ్డితో ( ) కలిసి పంత్ ఏడో వికెట్‌కు 48 పరుగులు జోడించడంతో టీమ్ఇండియా స్కోరు 150కైనా చేరుకోగలిగింది. కీలక సమయంలో పంత్‌ను కమిన్స్ ఔట్ చేశాడు. బుమ్రా సిక్స్‌తో కాస్త జోష్ తెప్పించినా అదీ కాసేపే. అతడు ఔట్ కావడంతో.. వేగంగా పరుగులు రాబట్టే క్రమంలో నితీశ్ కూడా దూకుడు పెంచాడు. కమిన్స్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి ఖవాజా చేతికి చిక్కాడు. దాంతో భారత ఇన్నింగ్స్ ముగిసింది.

ఆసీస్‌తో తొలి టెస్టు.. గిల్ గాయంపై బీసీసీఐ అప్‌డేట్

: బోర్డర్ – గావస్కర్ ట్రోఫీలో (భాగంగా పెర్త్ వేదికగా ఆస్ట్రేలియా – భారత్ జట్ల మధ్య తొలి టెస్టు ప్రారంభమైంది. టీమ్ఇండియా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. తుది జట్టులో కొత్త కుర్రాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణాకు అవకాశం దక్కింది. వేలికి అయిన గాయం నుంచి కోలుకుంటాడని భావించిన గిల్‌కు మేనేజ్‌మెంట్ విశ్రాంతి ఇచ్చింది. దీంతో అతడి గాయం తీవ్రతపై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో బీసీసీఐ అప్‌డేట్ ఇచ్చింది.

''శుభ్‌మన్ గిల్ వేలికి గాయమైంది. వాకాలో వార్మప్ మ్యాచ్ సందర్భంగా గాయపడ్డాడు. పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని తొలి టెస్టుకు ఎంపిక చేయలేదు. బీసీసీఐ వైద్య బృందం నిరంతరం అతడి పరిస్థితిని గమనిస్తూనే ఉంది'' అని బీసీసీఐ వెల్లడించింది.

ఇద్దరు సారథులు బౌలర్లే..

పెర్త్ టెస్టుకు ఓ అరుదైన ఘనత దక్కింది. 1947 తర్వాత తొలిసారి ఇరు జట్ల సారథులూ బౌలర్లే కావడం ఇదే ప్రథమం. భారత జట్టుకు జస్‌ప్రీత్ బుమ్రా.. ఆసీస్‌కు ప్యాట్ కమిన్స్ కెప్టెన్లుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. రోహిత్ గైర్హాజరీలో బుమ్రాకు జట్టు పగ్గాలు దక్కాయి.

ఏడున్నర నెలల్లో మొత్తం మారిపోయింది..

నితీశ్ కుమార్ రెడ్డి సంచలన ప్రయాణం

2024 ఏప్రిల్ 5.. నితీశ్ కుమార్ రెడ్డి అనే కుర్రాడు ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (తరఫున అరంగేట్రం చేశాడు. అప్పటివరకు భారత క్రికెట్ అభిమానులకు ఈ పేరు పెద్దగా పరిచయమే లేదు. తొలి మ్యాచ్‌లో అతను పెద్దగా సత్తా చాటింది కూడా లేదు. కానీ ఏడున్నర నెలలు గడిచాయి. 2024 నవంబరు 22.. అదే కుర్రాడు ఇప్పుడు ప్రతిష్ఠాత్మక బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో ఆడుతున్నాడు. పేస్ ఆల్‌రౌండర్‌గా తుది జట్టులో చోటు దక్కించుకున్న అతడి మీద మంచి అంచనాలున్నాయి. అనుకున్నట్లుగానే పెర్త్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 41 పరుగులు చేశాడు. ఈ అవకాశాన్ని సిరీస్‌లో సద్వినియోగం చేసుకుంటే నితీశ్ కెరీర్ ఇంకా గొప్ప మలుపు తిరగడం ఖాయం.

ఐపీఎల్‌తో ఎందరో క్రికెటర్ల జీవితాలు వలువు తిరిగాయి. అనామకులుగా ఇందులో అడుగుపెట్టి.. ఆశ్చర్యపరిచే ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిలోపడి.. అంతర్జాతీయ స్థాయిలో మేటి క్రికెటర్లుగా ఎదిగిన కుర్రాళ్ల జాబితా పెద్దదే. రవీంద్ర జడేజా, జస్‌ప్రీత్ బుమ్రా రిషబ్ పంత్.. ఇలా చాలామందే ఐపీఎల్‌తో అంతర్జాతీయ స్టార్లుగా ఎదిగారు. ఇప్పుడు నితీశ్ కుమార్ రెడ్డి కూడా అదే బాటలో పయనించేలా కనిపిస్తున్నాడు. అతను ఈ ఏడాది సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అరంగేట్రం చేశాడు. తన తొలి మూడు మ్యాచ్‌ల్లో సన్‌రైజర్స్ నితీశ్‌కు అవకాశం ఇవ్వలేదు. నాలుగో మ్యాచ్‌లో ఆడిస్తే 14 పరుగులు చేశాడు. తర్వాత మ్యాచ్‌లో అతడి సత్తా ప్రపంచానికి తెలిసింది. 37 బంతుల్లో 64 పరుగుల మెరుపు ఇన్నింగ్స్ (పంజాబ్ కింగ్స్‌పై) ఆడడమే కాదు.. ఒక వికెట్ కూడా తీసి తనేంటో చాటి చెప్పాడు.

ఈ సీజన్లో అతను మరికొన్ని మంచి ఇన్నింగ్స్‌తో 303 పరుగులు చేశాడు. 3 వికెట్లు కూడా పడగొట్టాడు. ఈ ప్రదర్శనే అతడికి టీమ్ఇండియాలో చోటు తెచ్చిపెట్టింది. బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో తుది జట్టులో ఆడే అవకాశం దక్కించుకున్న నితీశ్.. ఢిల్లీలో జరిగిన రెండో టీ20లో 74 పరుగులు చేయడమే కాక.. 2 వికెట్లు తీశాడు. ఆ తర్వాత రంజీ ట్రోఫీలో సత్తా చాటడంతో నితీశ్‌కు టెస్టు జట్టులోనూ చోటు దక్కింది. ఇది మామూలు అవకాశం కాదు. అతను ఎంపికైంది ఆస్ట్రేలియాతో ప్రతిష్ఠాత్మక బోర్డర్ గావస్కర్ ట్రోఫీకి. అయితే జట్టులో చోటిచ్చారు కానీ.. ఇలాంటి పెద్ద సిరీస్‌లో తుది జట్టులో వెంటనే ఛాన్స్ దొరకడం కష్టం అనుకున్నారు. కానీ నెట్ సెషన్లలో నితీశ్ బౌలింగ్, బ్యాటింగ్‌కు ఇంప్రెస్ అయిన టీమ్ మేనేజ్‌మెంట్ నేరుగా తొలి మ్యాచ్ నుంచే అతడిని తుది జట్టులో ఆడించాలని నిర్ణయించింది. దీంతో పెర్త్‌లో అతడి అరంగేట్రం ఖాయమైంది.

ఉపయోగించుకుంటే..

ఆస్ట్రేలియా తో ఆస్ట్రేలియాలో టెస్టు మ్యాచ్ ఆడడం అంటే అరుదైన అవకాశం. ఐపీఎల్ కెరీర్ మొదలుపెట్టిన ఏడున్నర నెలల్లో నితీశ్ ఈ అద్భుత అవకాశాన్ని పట్టేశాడు. ఇక్కడ సత్తా చాటితే ప్రపంచంలో ఎక్కడైనా తిరుగుండదని అంటారు విశ్లేషకులు. సిరీస్‌లో అతడికి ఆస్ట్రేలియా బౌలర్లు, బ్యాటర్ల నుంచి కఠిన సవాలు ఎదురవడం ఖాయం. ఆస్ట్రేలియాలో ఎంతో అనుభవం ఉన్న బ్యాటర్లు అయినా తడబడతారు. కాబట్టి నితీశ్ ఆచితూచి ఆడాల్సిందే. ఇప్పటివరకు అతను టీ20ల్లో విధ్వంసంతో ఆకట్టుకున్నాడు. ఇప్పుడతను ఆచితూచి ఆడడం ద్వారా టెస్టులకూ తాను సరిపోయే బ్యాటర్‌నే అని చాటిచెప్పాలి. ప్రస్తుతం కొంత బలహీనంగా కనిపిస్తున్న భారత మిడిలార్డర్‌ను బలోపేతం చేయాల్సిన బాధ్యత నితీశ్ మీద ఉంది. వికెట్ల పతనాన్ని అడ్డుకోవడం.. లోయరార్డర్ బ్యాటర్లతో భాగస్వామ్యాలు నెలకొల్పి స్కోరు పెంచడం అతడి బాధ్యత.

ఇక ఆస్ట్రేలియా వికెట్ల మీద బంతి వేగంగా దూసుకెళ్తుంది. బౌన్స్ కూడా ఉంటుంది. నితీశ్ లాంటి మీడియం పేసర్లు కూడా ఇక్కడ ప్రభావం చూపగలరు. ప్రధాన పేసర్ల మీద భారాన్ని తగ్గించేలా అతను మధ్యమధ్యలో ఫిలప్ ఓవర్లు వేయడమే కాదు.. సమయానుకూలంగా వికెట్లు కూడా పడగొడితే జట్టుకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఆల్‌రౌండర్ జట్టులో ఉంటే ఒక అదనపు బ్యాటర్ లేదా బౌలర్‌ను తుది జట్టులోకి తీసుకునే సౌలభ్యం ఉంటుంది. కాబట్టి నితీశ్ ఆల్ రౌండర్‌గా సత్తా చాటి తన ఎంపికకు న్యాయం చేస్తే జట్టులో అతడి స్థానం సుస్థిరమవుతుంది. కపిల్ దేవ్ తర్వాత సరైన ఆల్‌రౌండర్ లేని లోటును హార్దిక్ పాండ్య భర్తీ చేస్తాడనుకుంటే.. టెస్టుల్లో అతను నిలకడగా రాణించలేకపోయాడు. మరి నితీశ్ అయినా ఆ లోటును భర్తీ చేస్తాడేమో చూడాలి.

భారీ లాభాల్లో సూచీలు.. ఒక్క రోజులో ఏం మారింది?

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు) భారీ లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణిస్తున్నాయి. దీంతో వరుస నష్టాల్లో ట్రేడవుతున్న సూచీలు నేడు భారీ లాభాల్లో ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ వెయ్యి పాయింట్ల లాభంతో కొనసాగుతోంది.

మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి సెన్సెక్స్ 1,065 పాయింట్ల లాభంతో 78,221.71 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సైతం 341.35 పాయింట్ల లాభంతో 23,691.25 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్ మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ఉన్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, టైటాన్ షేర్లూ ప్రధానంగా లాభాల్లో కొనసాగుతున్నాయి.

గ్రీన్‌లో అదానీ షేర్లు: అమెరికాలో కేసు నమోదు నేపథ్యంలో నిన్న భారీగా పతనమైన అదానీ గ్రూప్ కంపెనీ షేర్లు నేడు కోలుకున్నాయి. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతు కారణంగా ఇవాళ అన్ని షేర్లూ స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

లాభాలకు కారణాలు ఇవే..

అమెరికాలో వెలువడిన నిరుద్యోగ డేటా కారణంగా నేడు ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. నవంబర్ నెలలో ఉద్యోగాల్లో వృద్ధి మెరుగ్గా నమోదవడం మన ఐటీ స్టాక్స్‌కు కలిసొచ్చింది. నిఫ్టీ ఐటీ సూచీ దాదాపు 2 శాతం మేర రాణిస్తోంది.

వరుస నష్టాల నేపథ్యంలో ప్రధాన కంపెనీల షేర్లు ఇవ్వటికే భారీగా క్షీణించాయి. ఈనేపథ్యంలో బ్లూచిప్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు సూచీలకు కలిసొచ్చింది. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ షేర్లు సూచీలకు దన్నుగా నిలిచాయి.

నిన్న అమెరికా మార్కెట్లతో పాటు నేడు ఆసియా మార్కెట్లు కూడా పాజిటివ్‌గా ట్రేడవుతుండడం మార్కెట్లు రాణించడానికి మరో ప్రధాన కారణం. ఆసియాలో హాంకాంగ్, షాంఘై మినహా మిగిలిన మార్కెట్లు లాభాల్లో ఉన్నాయి.

అదానీ గ్రూపు స్టాక్స్ లాభాల్లో కొనసాగుతున్నాయి. గురువారం నాటి నష్టాల నుంచి కొంతమేర గట్టెక్కాయి. అయితే, సూచీలపై వీటి ప్రభావం ఉండబోదని అనలిస్టులు చెబుతున్నారు.

చుట్టూ వివాదాలే కొన్నేళ్లలోనే శరవేగంగా ఎదిగిన గౌతమ్ అదానీ

అదానీ గ్రూప్... స్వతంత్ర భారతావనిలో అత్యంత వేగంగా ఎదిగిన కార్పొరేట్ సామ్రాజ్యం. మూడు దశాబ్దాల క్రితమే వ్యాపారాలు ప్రారంభించినా, పదేళ్ల కిందటి వరకు పెద్దగా ఉనికి లేని అదానీ గ్రూపు కంపెనీలు, ఉన్నవళంగా ఉన్నతస్థానాలను అందుకుంటున్నాయి. విమానాశ్రయాలు - నౌకాశ్రయాల నిర్వహణ, వంటనూనెలు, సిమెంటు, విద్యుత్తు... ఇలా ఎన్నో రంగాల్లో అదానీ గ్రూపు బలంగా విస్తరించింది. వ్యాపార సామ్రాజ్యాలను ఏళ్లతరబడి శక్తియుక్తులతో నిర్మించుకుంటూ రావటం ఒక ఎత్తు. కానీ అదానీ గ్రూపు మాత్రం ఆయా రంగాల్లో బలమైన సంస్థలను ఏదో ఒక విధంగా కానేసుకుంటూ ఎదుగుతోంది.

తెలుగు రాష్ట్రాలోనూ ఎన్నో ప్రాజెక్టులు అదానీ సొంతం అయ్యాయి. హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న జీవీకే గ్రూపునకు చెందిన ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంబీ ఆంధ్రప్రదేశ్‌లోని గంగవరం, కృష్ణపట్నం నౌకాశ్రయాలు.. అదానీ ఆధీనంలోకి చేరాయి.

దేశంలోని అగ్రశ్రేణి సిమెంటు కంపెనీలైన అంబుజా సిమెంట్స్, ఏసీసీ అమ్మకానికి వచ్చినప్పుడు.. దాదాపు రూ.80,000 కోట్లు చెల్లించి వాటిని కొనుగోలు చేయగల సత్తా ఎవరికి ఉంది? అనేది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. కానీ అదానీ గ్రూపునకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం, ఈ రెండు సంస్థలను కొనుగోలు చేయడం జరిగిపోయింది. సిమెంట్ రంగంలో అల్ట్రాటెక్ సిమెంట్‌ను నేరుగా ఢీకొనేలా తన సిమెంట్ సామర్థ్యాన్ని అదానీ 'మరిన్ని సంస్థల' కొనుగోళ్లతో సాధించారు.

సంపద విలువ అమాంతంగా

అదానీ వ్యాపార సామ్రాజ్య విస్తరణకు తగ్గట్లుగా అదానీ వ్యక్తిగత సంపద విలువా వేగంగా పెరిగింది. తత్ఫలితంగా అతి తక్కువకాలంలో ప్రపంచ కుబేరుల అగ్రగామి జాబితాలో గౌతమ్ అదానీ స్థానం దక్కించుకున్నారు. ఒక దశలో మనదేశంలో అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీని సైతం పక్కకు నెట్టేసి, దేశంలో అత్యంత ధనిక వ్యాపారవేత్తగా అదానీ నిలిచారు.

ఇవీ కారణాలు

అదానీ గ్రూపు ఎన్నో వివాదాల్లో చిక్కుకుంది. ఎక్కడ ఏ భారీ ప్రాజెక్టు చేపట్టినా ఏదో ఒక విమర్శ, ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. పారదర్శకత లేకపోవడం, పాలక వర్గాలతో అంటకాగడం, పెద్దఎత్తున ముడుపులు చెల్లించటం.. అదానీ గ్రూపు విషయంలో వెల్లువెత్తుతున్న ప్రధాన ఆరోపణలు. అలాంటిదేమీ లేదని, తాము అంతా వ్యాపార ప్రణాళికల ప్రకారమే ముందుకు సాగుతున్నామని అదానీ గ్రూపు ప్రకటిస్తూ వస్తోంది. ఇప్పటివరకు వచ్చిన ఆరోపణలతో పోలిస్తే, తాజాగా అమెరికాలో నమోదైన కేసు మాత్రం తీవ్రమైనదిగా కనిపిస్తోంది. అదానీ గ్రూపు తన లబ్ధి కోసం మనదేశంలోని ప్రభుత్వ వర్గాలకు భారీగా లంచాలు ముట్టజెప్పిందని.. అందుకు అమెరికాలో ఇన్వెస్టర్ల నుంచి సేకరించిన పెట్టుబడులు వినియోగించినట్లు కేసు నమోదవ్వడమే ముఖ్యమైన అంశం. మనదేశంలోని వివిధ రాష్ట్రాల్లో విద్యుత్తు ప్రాజెక్టులు దక్కించుకోవడానికి ఎడాపెడా లంచాలు ఇచ్చిందని, అందులో సింహభాగం ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వానికి ఇచ్చినట్లు వెలుగుచూడటం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టిస్తోంది.

ఆరోపణలూ అంతే వేగంగా

అదానీ ఎంత వేగంగా ఎదిగారో, ఆయన వ్యాపార తీరుతెన్నులపై ఆరోపణలూ అంతేస్థాయిలో వచ్చాయి. మరీ ముఖ్యంగా 2023 జనవరి నుంచి చోటుచేసుకున్న ఉదంతాలతో అదానీ ప్రతిష్ఠ మసకబారింది. అదానీ గ్రూప్ కంపెనీల వద్దుల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని, షేర్ల ధరలు కృత్రిమంగా పెంచుతున్నారంటూ అమెరికాకు చెందిన పెట్టుబడుల పరిశోధనా సంస్థ హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడటం సంచలనమే అయ్యింది. అంతకు ముందు కూడా అదానీ గ్రూపు చిక్కుకున్న కొన్ని ముఖ్యమైన వివాదాలను గమనిస్తే..

2017- కార్మికుల్ బొగ్గు గని ప్రాజెక్టు: ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్ లో కార్మికుల్ బొగ్గు గని ప్రాజెక్టును 11 బిలియన్ డాలర్లతో అదానీ గ్రూపు ప్రతిపాదించింది. అక్కడి పర్యావరణ కార్యకర్తల నుంచి ఈ ప్రాజెక్టుపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ఎంతో సున్నితమైన గ్రేట్ బారియర్ రీఫ్‌కు ఈ ప్రాజెక్టు నష్టం చేస్తుందన్నది వారి ఆందోళన. అయినా ఆ ప్రాజెక్టును కొనసాగించడానికి అదానీ గ్రూపు అన్ని రకాల ప్రయత్నాలు చేసింది.

2021- యాంగాన్ నౌకాశ్రయం: మ్యాన్‌మర్ (బర్మా)లో ఎంతో కీలకమైన యాంగాన్ నౌకాశ్రయంలో కంటెయినర్ టెర్మినల్ నిర్మించేందుకు అదానీ గ్రూపు సైన్యం నుంచి భూములను కూడా తీసుకుంది. అదే సమయంలో మ్యాన్‌మర్‌లోని సైనిక ప్రభుత్వం, ఆందోళన చేస్తున్న ప్రజలపై ఆయుధ ప్రయోగం చేసి ఎంతో మందిని పొట్టనపెట్టుకుంది. దీనిపై అంతర్జాతీయంగా తీవ్ర నిరసన వ్యక్తం అయింది. ఫలితంగా ఆ దేశంలో చేపట్టే ప్రాజెక్టులకు నిధులు సమకూర్చటానికి అంతర్జాతీయ సంస్థలు ముందుకు రాలేదు. ఈ వివాదాస్పద ప్రాజెక్టును విరమించుకోవాలని అదానీ గ్రూపునకు సూచించాయి.

2022- శ్రీలంక పవన విద్యుత్తు ప్రాజెక్టు: శ్రీలంకలో అదానీ గ్రీన్ ఒక పవన విద్యుత్తు ప్రాజెక్టు సొంతం చేసుకుంది. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి, స్థానిక ప్రజల ఉపాధికి తీవ్రనష్టం వాటిల్లుతుందనే విమర్శలు వెల్లువెత్తాయి. స్థానికులు పోరుబాట పట్టి ప్రాజెక్టుకు అవరోధంగా నిలిచారు.

2023 జనవరి- హిండెన్‌బర్గ్ నివేదిక: అదానీ గ్రూపు సంస్థలు ఎన్నో అనైతిక విధానాలను అనుసరిస్తున్నాయంటూ హిండెన్‌బర్గ్ వెల్లడించిన నివేదిక తీవ్ర సంచలనం సృష్టించింది. అదానీ గ్రూపు కంపెనీల షేర్ల ధరలను స్టాక్‌మార్కెట్లో కృత్రిమంగా పెంచడానికి అదానీ గ్రూపు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని, అకౌంటింగ్ మోసాలున్నాయని ఆరోపించింది. విదేశాల్లో పన్ను స్వర్గాలుగా విలసిల్లుతున్న దేశాల నుంచి నిధులను అక్రమంగా మనదేశంలోకి మళ్లిస్తున్నట్లు, ఎడాపెడా అప్పులు చేస్తున్నట్లు చేసిన ఆరోపణలు సంచలనం రేకెత్తించాయి. స్టాక్‌మార్కెట్లో అదానీ గ్రూపు కంపెనీల షేర్ల ధరలు కుప్పకూలి, మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్లకు పైగా క్షీణించింది. అప్పట్లో దేశీయ మదుపర్లు 56 బిలియన్ డాలర్లు నష్టపోయారు. ఈ పరిణామంతో స్టాక్‌మార్కెట్ సూచీలు సైతం భారీగా పతనమయ్యాయి. హిండెన్‌బర్గ్ ఆరోపణలపై సెబీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు సరైన రీతిలో స్పందించలేదని, తూతూ మంత్రంగా దర్యాప్తు చేసి అంతా నక్రమంగానే ఉన్నట్లు తేల్చాయనే ఆరోపణలు వచ్చాయి.

2023 ఆగస్టు- ఓసీసీఆర్‌ఫీ నివేదిక: ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) అనే అంతర్జాతీయ సంస్థ, ఒక నివేదికలో అదానీ కుటుంబ సభ్యులపై తీవ్రమైన ఆరోపణలు చేసింది. అదానీ కుటుంబ సభ్యులు, సన్నిహితులు విదేశీ నిధుల పేరుతో అదానీ కంపెనీల షేర్లు కొని, ఆ కంపెనీల షేర్ల ధరలు బాగా పెరిగే అవకాశం కల్పించారని, ఆ క్రమంలో సెక్యూరిటీ చట్టాలు, నిబంధనలను ఉల్లంఘించారని ఈ నివేదిక విమర్శించింది.

2023 నవంబరు- ధారావి పునర్నిర్మాణ ప్రాజెక్టు: ముంబయిలో 259 హెక్టార్ల విస్తీర్ణం గల ధారావి మురికివాడ పునర్నిర్మాణ ప్రాజెక్టును అదానీ ప్రాపర్టీస్ సొంతం చేసుకుంది. ప్రభుత్వమే ఈ ప్రాజెక్టు అదానీకి దక్కేటట్లుగా వ్యవహరించిందనే ఆరోపణలు వచ్చాయి.

ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ పూర్తి

దిల్లీ: ప్రభుత్వరంగ సంస్థ ఎన్టీపీసీ అనుబంధ ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఐపీఓ పూర్తిగా సబ్‌స్క్రిప్షన్ అయ్యింది. చివరిరోజైన నేటితో సబ్‌స్క్రిప్షన్ గడువు ముగియనుండగా.. మధ్యాహ్నానికే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకోవడం గమనార్హం. మొత్తం రూ.10వేల కోట్ల ఐపీఓలో భాగంగా మధ్యాహ్నం 12.30 గంటల సమయానికి అందుబాటులో ఉంచిన 56 కోట్ల షేర్లకు గానూ 68 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. మొత్తంగా 1.22 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యింది. 16 లక్షల దరఖాస్తులు వచ్చాయి.

క్యూఐబీ కోటా 1.02 రెట్లు సబ్‌స్క్రైబ్ అవగా.. ఎన్ఐఐ కోటా 48 శాతం మాత్రమే సబ్‌స్క్రిప్షన్లు అందుకుంది. ఇక రిటైల్ కేటగిరీలో అత్యధికం 2.98 రెట్లు బిడ్లు దాఖలయ్యాయి. సాయంత్రానికి ఈ బిడ్లు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.3,960 కోట్లను కంపెనీ సమీకరించింది. పూర్తి తాజా షేర్ల జారీ ద్వారా జరుగుతున్న ఈ పబ్లిక్ ఇష్యూలో ధరల శ్రేణిని రూ.102-రూ.108గా కంపెనీ నిర్ణయించింది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణాలు, ముందస్తు చెల్లింపులకు వినియోగించనున్నారు. మరికొంత మొత్తం సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నట్లు కంపెనీ తెలిపింది.

అద్దెల్లో దిల్లీ ఖాన్ మార్కెట్ అదుర్స్

దిల్లీ: అంతర్జాతీయంగా అత్యంత ఖరీదైన రిటెయిల్ విక్రయ ప్రాంతాల్లో దిల్లీలోని ఖాన్ మార్కెట్ 22వ స్థానంలో నిలిచింది. ఇక్కడ వార్షిక అద్దె 229 డాలర్లు (రూ.19,330)గా ఉందని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. ఇటలీలోని మిలన్‌లో ఉన్న వియా మాంటే నెపోలియన్ మెయిన్ స్ట్రీట్ ఈ జాబితాలో అగ్ర స్థానంలో నిలిచింది. ఇక్కడ వార్షిక అద్దె చ.అడుగుకు 2,047 డాలర్లు (రూ.1.72 లక్షలు)గా ఉంది. అంతర్జాతీయ స్థిరాస్తి కన్సల్టెంట్ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ గురువారం 'మెయిన్ స్ట్రీట్స్ అక్రాస్ ది వరల్డ్ 2024' 34వ ఎడిషన్‌ను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 138 ఉత్తమ పట్టణ రిటైల్ ప్రాంతాల్లో వార్షిక అద్దెలను పరిగణనలోకి తీసుకుని ఈ నివేదికను రూపొందించింది. భారత్‌లో ఈ క్యాలెండర్ ఏడాదిలో ఇప్పటి వరకు మెయిన్ స్ట్రీట్స్ లీజింగ్ 11% వృద్ధితో 3.8 మిలియన్ చదరపు అడుగులకు చేరింది. బెంగళూరులోని ఇందిరానగర్ 100 ఫీట్ రోడ్‌లో వార్షికంగా అద్దెలు 32% పెరుగుతున్నాయి. పుణెలో ఎంజీ రోడ్, చెన్నైలో అన్నా నగర్, ముంబయిలో ఫోర్ట్/ఫౌంటేన్, కోల్‌కతాలో పార్క్ స్ట్రీట్‌ల్లో వార్షికంగా 10% పైనే వృద్ధి నమోదవుతోంది.

ఉద్యోగం కోసం డబ్బులు చెల్లించడం సరికాదు: జొమాటో సీఈఓ

దిల్లీ: ఉద్యోగం పొందేందుకు కంపెనీకి డబ్బులు ఎదురు చెల్లించడం.. ఈ ప్రపంచంలో కొత్త నిబంధనగా మారకూడదని ఆన్‌లైన్‌లో ఆర్డరు తీసుకుని, ఆహారాన్ని డెలివరీ చేసే జొమాటో సీఈఓ దీపందర్ గోయల్ పేర్కొన్నారు. ఆయన రెండు రోజుల క్రితం వినూత్న ఉద్యోగ ఆఫర్ ప్రకటించారు. చీఫ్ ఆఫ్ స్టాఫ్ పోస్టుకు ఎంపికైన వారు కంపెనీకి రూ.20 లక్షలు చెల్లించాలని అందులో షరతు పెట్టడం ఇంటర్నెట్‌లో చర్చనీయాంశంగా మారింది. దిగ్గజ మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల్లో రెండేళ్ల డిగ్రీ కోర్సు కంటే 10 రెట్లు అధిక పరిజ్ఞానాన్ని ఈ పోస్టు ద్వారా అభ్యర్థి పొందుతారని గోయల్ చెప్పారు. వీరు చెల్లించే రూ.20 లక్షలను పేదల ఆహారానికి వినియోగిస్తామన్నారు. కేవలం వడపోత కోసమే ఈ నిబంధన పెట్టానని ఆయన చెప్పారు. తొలి ఏడాది వేతనం ఏమీ ఉండదని, రెండో ఏడాది నుంచి రూ.50 లక్షలకు పైగా వార్షిక వేతనం లభిస్తుందన్నారు. ఈ ఉద్యోగ ఆఫర్‌కు 18,000 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని గోయల్ తెలిపారు. ఇందులో ఎక్కువ శాతం దరఖాస్తులను తిరస్కరించనున్నామని వివరించారు.

టర్మ్ పాలసీ ఇస్తారా?

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు ఎప్పుడైనా సరే ఆరోగ్యం బాగున్నప్పుడే తీసుకోవాలి. మీకు ఇటీవలే శస్త్రచికిత్స జరిగింది అంటున్నారు. కాబట్టి, టర్మ్ పాలసీ ఇచ్చేందుకు బీమా సంస్థ కొన్ని నిబంధనలు పెట్టే అవకాశం ఉంది. కనీసం ఏడాది నుంచి రెండేళ్ల తర్వాతే పాలసీ ఇవ్వడానికి బీమా సంస్థలు ముందుకు రావచ్చు. ఇది కంపెనీ విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదికల ఆధారంగా ప్రీమియం నిర్ణయించే అవకాశం ఉంది. సాధారణంగా రూ.50లక్షల టర్మ్ పాలసీ తీసుకుంటే రూ.10వేల నుంచి రూ.15వేల వరకూ ప్రీమియం ఉండే అవకాశం ఉంది. మీకు కాస్త అధికంగా ప్రీమియం వసూలు చేయొచ్చు.

2) మూడేళ్లుగా నెలకు రూ.5వేల చొప్పున బ్యాంకులో రికరింగ్ డిపాజిట్ చేస్తున్నాను. ఇప్పుడు దీన్ని ఆపేసి, ఫండ్లలో సిప్ చేస్తే మంచిదేనా? నష్టభయం తక్కువగా ఉండాలి. మరో 4 ఏళ్ల వరకూ పెట్టుబడి పెట్టగలను. కాస్త అధిక రాబడి వచ్చే మార్గాన్ని సూచించండి?

నష్టభయం తక్కువగా ఉంటూ అధిక రాబడిని అందుకోవడం సాధ్యం కాకపోవచ్చు. మీకు నాలుగేళ్ల వ్యవధి ఉంది కాబట్టి, బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్, హైబ్రిడ్ ఈక్విటీ ఫండ్లను పరిశీలించండి. ఈక్విటీ డైవర్సిఫైడ్‌తో పోలిస్తే వీటిలో నష్టభయం కాస్త తక్కువగా ఉంటుంది. రికరింగ్ డిపాజిట్‌తో పోలిస్తే అధిక రాబడి వచ్చే అవకాశాలున్నాయి.

3) ప్రైవేటు ఉద్యోగిని. వయసు 48 ఏళ్లు. ఈపీఎఫ్ ఉంది. దీంతోపాటు నెలకు రూ.8వేలను ఎన్‌పీఎస్‌లో పెట్టుబడి పెట్టాలనుకుంటున్నాను. దీనికన్నా వీపీఎఫ్ మేలంటున్నారు? ఈ రెండింటిలో ఏది ఎంచుకోవాలి?మీకు ఇప్పటికే ఈపీఎఫ్ ఉంది కాబట్టి, కొత్తగా మదుపు చేయాలనుకుంటున్న మొత్తాన్ని జాతీయ పింఛను పథకం (ఎన్‌పీఎస్)లో జమ చేయండి. అధిక ఈక్విటీ పెట్టుబడులు ఉన్న ఫండ్‌ను

ఎంచుకోండి. ప్రత్యామ్నాయంగా డైవర్సిఫైడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోనూ క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా మదుపు చేయొచ్చు.

4) ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో మదుపు చేయాలనుకుంటున్నాను. రూ.1,50,000 ఇందులో పెట్టుబడి పెట్టడం మంచిదేనా? లేకపోతే వేర్వేరు పథకాలను ఎంచుకోవాలా? పన్ను మినహాయింపు పొందేందుకు ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల (ఈఎల్ఎస్ఎస్)ను ఎంచుకోవచ్చు. ఇందులో మూడేళ్ల లాకిన్ వ్యవధి ఉంటుంది.

ఆ వార్తలు ఎవరు సృష్టిస్తున్నారో తెలుసు: విశాల్ క్లారిటీ

చెన్నై: విభిన్న కథలు, పాత్రలతో తరచూ ప్రేక్షకులను అలరిస్తుంటారు కోలీవుడ్ నటుడు విశాల్ . ఆయనకు సంబంధించిన ఓ వార్త గత కొన్ని రోజులుగా నెట్టింట వైరల్‌గా మారింది. శివ కార్తికేయన్ సినిమాలో ఆయన ప్రతినాయకుడిగా కనిపించనున్నారనేది అందులోని సారాంశం. దీనిపై తాజాగా ఆయన క్లారిటీ) ఇచ్చారు. ఆయా కథనాల్లో ఎలాంటి నిజం లేదన్నారు. అవన్నీ కేవలం అవాస్తవాలు మాత్రమేనని చెప్పారు.

"ప్రస్తుతానికి నేను విలన్ పాత్రలు చేయాలనుకోవడం లేదు. నా తదుపరి చిత్రాలపై ఫోకస్ పెట్టాను. భారీస్థాయిలో వాటిని తెరకెక్కించాలని.. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని అందించాలని అనుకుంటున్నా. ఈ వార్తలు ఎవరు నృష్టిన్తున్నారో, ఎక్కడినుంచి పుట్టుకొస్తున్నాయో నాకు తెలుసు. నన్ను విలన్‌గా చూడాలనేది వారి కోరిక అనుకుంటా. ప్రస్తుతానికి నెగిటివ్ షేడ్స్ ఉన్న రోల్స్ చేయాలని లేదు. కాబట్టి వాళ్లను కాస్త శాంతించమని చెబుతా" అని విశాల్ స్పష్టతనిచ్చారు.

గతేడాది విడుదలైన 'మార్క్ ఆంటోనీ'తో విజయాన్ని అందుకున్నారు విశాల్. ఈ ఏడాది ఆయన నటించిన 'రత్నం' రిలీజై మిశ్రమ స్పందనలకే పరిమితమైంది. ప్రస్తుతం ఆయన 'తుప్పరివాలన్ 2' పనుల్లో బిజీగా ఉన్నారు. 2017లో విడుదలైన 'తుప్పరివాలన్' (తెలుగులో డిటెక్టివ్)కు కొనసాగింపుగా ఇది సిద్ధం కానుంది. విశాల్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. త్వరలోనే ఇది పట్టాలెక్కనుంది. ఇది తనకెంతో ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని.. పాన్ ఇండియా స్థాయిలో దీనిని విడుదల చేయాలనుకుంటున్నానని గతంలో ఆయన చెప్పారు.

శివ కార్తికేయన్ విషయానికి వస్తే.. 'అమరన్'తో ఇటీవల ఆయన విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం ఏఆర్ మురుగదాస్‌తో ఓ ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నారు. త్వరలో ఆయన సుధాకొంగర దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారు. %ాఖ%25గా ఇది ప్రచారంలో ఉంది. సోషియో పొలిటికల్ థ్రిల్లర్‌గా ఇది రూపుదిద్దుకోనుందని సమాచారం. శ్రీలీల, అథర్వ కీలక పాత్రల్లో నటించనున్నట్లు సమాచారం. జయం రవి అతిథి పాత్రలో కనిపించనున్నారంటూ వార్తలు వస్తున్నాయి.

వాటిలో యాక్ట్ చేయడం నాకు నచ్చదు: విజయ్ దేవరకొండ

హైదరాబాద్: 'సాహిబా'తో ప్రేక్షకులను అలరిస్తున్నారు నటుడు విజయ్ దేవరకొండ. ఇటీవల విడుదలైన ఈ మ్యూజిక్ ఆల్బమ్ యువతను ఎంతగానో ఆకట్టుకుంది. దీనిని ఉద్దేశించి తాజాగా ఆయన ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ పాట విన్న వెంటనే ఇది తప్పకుండా సూపర్‌హిట్ అవుతుందని నమ్మా. అదే విషయాన్ని జస్లిన్‌కి కూడా చెప్పా. మ్యూజిక్ ఆల్బమ్స్‌లో భాగం కావడం నాకు పెద్దగా ఇష్టం ఉండదు. అందుకే ఎంతోకాలం నుంచి దీనిని వాయిదా వేస్తూ వస్తున్నా. ఆమె అడిగినప్పుడల్లా ఏదో ఒక సాకు చెప్పేవాడిని. ఆమె ఆసక్తిని గమనించి ఇందులో యాక్ట్ చేశా. జస్లిన్ వల్లే నేను ఇందులో భాగమయ్యా" అని విజయ్ చెప్పారు.

'హీరియే'తో గుర్తింపు తెచ్చుకున్నారు జస్లిన్ రాయల్. ఆమె కంపోజ్ చేసిన రీసెంట్ పాట 'సాహిబా'. రాధికా మదన్, విజయ్ దేవరకొండ యాక్ట్ చేశారు. విడుదలైన ఐదు రోజుల్లోనే ఈ పాట యూట్యూబ్‌లో కోటికి పైగా వ్యూస్ సొంతం చేసుకుంది. దీని ప్రమోషన్స్‌లో విజయ్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి ఆయన మాట్లాడారు. తాను సింగిల్ కాదని పరోక్షంగా తెలిపారు. "ప్రేమంటే ఏంటో నాకు తెలుసు. ఒకరి ప్రేమ పొందితే ఎలా ఉంటుందో తెలుసు. షరతుల్లేని ప్రేమ తెలియదు ఎందుకంటే నా ప్రేమ అంచనాలతో వస్తుంది. ఇప్పుడు నా వయసు 35 ఏళ్లు. నేను సింగిల్ అని మీరు అనుకుంటున్నారా?" అని ఆయన ప్రశ్నించారు. కోస్టార్‌తో ఎప్పుడైనా డేటింగ్ చేశారా? అని ప్రశ్నించగా.. చేశానని బదులిచ్చారు. విజయ్ వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆయన మాట్లాడుతుంది ఎవరి గురించి? అని వలువురు మాట్లాడుకుంటున్నారు. ఇంతకీ కో-స్టార్ ఎవరై ఉంటారా? అని చర్చించుకుంటున్నారు. మరోవైపు, విజయ్ ప్రస్తుతం 12' కోసం వర్క్ చేస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది.

షారుక్ ఖాన్, చిరంజీవికి నయనతార కృతజ్ఞతలు

ఇటీవల 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీతో పలకరించారు నటి నయనతాం తాజాగా తన 20 ఏళ్ల కెరీర్‌లో అండగా నిలిచిన వారికి ధన్యవాదాలు చెబుతూ పోస్ట్ పెట్టారు. బాలీవుడ్‌లో షారుక్, టాలీవుడ్‌లో చిరంజీవి రామ్‌చరణ్‌లకు కృతజ్ఞతలు చెప్పారు. తన డాక్యుమెంటరీ కోసం వీరిని సంప్రదించినప్పుడు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదన్నారు.

'నేను పని చేసిన ప్రతి చిత్రానికి నా జీవితంలో ఓ ప్రత్యేక స్థానం ఉంది. సినీ ప్రయాణం లెక్కలేనన్ని ఆనందకరమైన క్షణాలను అందించింది. ఇందులో చాలా సినిమాలు నా మనసుకు దగ్గరయ్యాయి. ఆ జ్ఞాపకాలను, నన్నివేశాలను మా డాక్యుమెంటరీలో చేర్చాలని నిర్మాతలను సంప్రదించినప్పుడు వారు ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదు. వారందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. వీరంతా నాకు అత్యంత విలువైన క్షణాలను అందించారు. వీరందరిపై నాకెంతో గౌరవం ఉంది. నా ప్రయాణం ఇలానే కొనసాగుతుంది' అంటూ తనకు సహకరించిన వారికి థ్యాంక్స్ చెప్పారు. ఇక నయనతార పేర్కొన్న దర్శక నిర్మాతల్లో షారుక్ ఖాన్ గౌరీ ఖాన్, చిరంజీవి, రామ్ చరణ్)లతో పాటు పలువురు తెలుగు, మలయాళ, తమిళ చిత్ర పరిశ్రమలకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

ఇక తన డాక్యుమెంటరీ విషయంలో నటుడు ధనుష్ (తీరును తప్పుబడుతూ నటి నయనతార ఇటీవల తీవ్ర విమర్శలు చేసిన విషయం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్'కు సంబంధించిన మూడు సెకన్ల క్లిప్స్ డాక్యుమెంటరీ ట్రైలర్‌లో వాడుకున్నందుకు రూ.10 కోట్లు నష్టపరిహారంగా ఆయన డిమాండ్ చేశారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు లీగల్ నోటీసులు పంపించారన్నారు. ఈ వ్యాఖ్యలు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఇప్పుడు నయనతార తన డాక్యుమెంటరీకి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు చెప్పడంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

ఆ సినిమాలో చిరు అలా చేయలేకపోయారు.. అందుకే చరణ్‌తో చేయించా

హైదరాబాద్: సాధారణ సన్నివేశాన్ని సైతం తన టేకింగ్‌తో భావోద్వేగంగా మలిచి ప్రేక్షకుడి మదిలో చెరగని ముద్ర వేయడంలో సిద్ధహస్తులు దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి అందుకే ఆయన తీసే సినిమాలు ప్రేక్షకులను అలరించడమే కాదు, బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తాయి. ఇక ఎమోషనల్ సన్నివేశాలు, హీరో ఎలివేషన్ సీన్స్ తీయడంలో ఆయనను కొట్టిన వారు మరొకరు లేరంటే అతిశయోక్తి కాదు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన 'మగధీర') రామ్‌చరణ్ కెరీర్‌లో భారీ విజయాన్ని అందుకుంది. అందులోని ఓ సన్నివేశం భావోద్వేగభరితంగా రావడానికి చిరంజీవి నటించిన 'కొదమ సింహం' చిత్రమే కారణమని రాజమౌళి ఓ సందర్భంలో పంచుకున్నారు.

''నేను చిరంజీవిగారికి పెద్ద అభిమానిని. అప్పట్లో థియేటర్‌లో 'కొదమసింహం' సినిమా చూస్తున్నా. అందులో రౌడీలు చిరును వీకల్లోతు ఇసుకలో పాతిపెట్టి వెళ్లిపోతారు. అక్కడే ఉన్న ఆయన గుర్రం ఆయన నోటికి తాడు అందించి కాపాడుతుంది. ఆ సీన్ చూసి తీవ్ర భావోద్వేగానికి గురయ్యా. అయితే, ఆ కష్టంలో నుంచి బయటకు వచ్చిన ఆయనకు, గుర్రానికీ అనుబంధం లేదనివించింది. చాలా నిరుత్సాహ పడిపోయా. నా దృష్టిలో అక్కడ అది గుర్రం కాదు. ప్రాణాలు కాపాడిన ఒక వ్యక్తి. మనకు సాయం చేసిన ఒక వ్యక్తికి థ్యాంక్స్ చెప్పకపోతే ఆ భావోద్వేగం ఎలా సంపూర్ణమవుతుంది? అనిపించింది. అది నా మైండ్‌లో అలాగే ఉండిపోయింది. ఒక ప్రేక్షకుడిగా అప్పుడు నా ఎమోషన్ తృప్తి చెందలేదు. అందుకే 'మగధీర'లో ఇసుక ఊబిలో కూరుపోయిన చరణ్ బయటకు వచ్చిన తర్వాత తన గుర్రాన్ని కౌగలించుకుంటాడు. ఒక స్నేహితుడిలా చూస్తూ దానితో కృతజ్ఞత భావంతో మాట్లాడతాడు. అలా నా సినిమాల్లో బలమైన సన్నివేశాలు ప్రేక్షకుల ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది రాసినవే ఉంటాయి" అని రాజమౌళి చెప్పుకొచ్చారు.

ప్రస్తుతం రాజమౌళి ఎ%ాహావీదీ%29 పనుల్లో బిజీగా ఉన్నారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. యాక్షన్ అడ్వెంచర్ జానర్‌లో రూపొందుతున్న ఈ మూవీని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటివరకూ మహేశ్‌బాబు కనిపించని నరికొత్త అవతారంపై దర్శనమివ్వనున్నారు. మరోవైపు రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' విడుదలకు సిద్ధమైంది. సంక్రాంతి కానుకగా జనవరి 10న విడుదల కానుంది. దీని తర్వాత బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందబోయే ఓ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో చరణ్ నటిస్తున్నారు.

రామ్ కొత్త సినిమా షురూ..

హైదరాబాద్: నటుడు రామ్ పోతినేని హీరోగా కొత్త సినిమా పట్టాలెక్కింది. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' విజయాన్ని అందుకున్న మహేశ్ ఈ చిత్రానికి దర్శకత్వం చేయనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఇది నిర్మితం కానుంది. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో వేడుకగా జరిగింది. ఇందులో చిత్రబృందం పాల్గొన్నారు. దర్శకులు హను రాఘవపూడి, గోపీచంద్ మలినేని, శివ నిర్వాణతోపాటు సినీ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొని టీమ్‌కు అభినందనలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు హను రాఘవపూడి క్లాప్ కొట్టారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

వాటిలో యాక్ట్ చేయడం నాకు నచ్చదు: విజయ్ దేవరకొండ

'డబుల్ ఇస్మార్ట్' తర్వాత రామ్ నటిస్తోన్న చిత్రమిదే. రామ్ 22వ సినిమాగా ఇది సిద్ధమవుతోంది. 22గా ప్రచారంలో ఉంది. హై ఎనర్జీతో న్యూ ఏజ్ స్టోరీగా దీనిని తీర్చిదిద్దనున్నట్లు సమాచారం. రామ్ విభిన్నమైన లుక్‌లో కనిపిస్తారని వార్తలు వస్తున్నాయి. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా కనిపించనున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్‌లు దీన్ని నిర్మిస్తున్నారు.

ఇది భారతీయ సినిమా గొప్పతనం: నాగార్జున

గోవాలోని పనాజీలో భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) వేడుకగా జరుగుతోంది. ఈ సినీ పండుగకు అగ్ర కథానాయకుడు నాగార్జున, అమలతో పాటు మరికొందరు కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున అక్కడి మీడియాతో మాట్లాడుతూ.. వేడుకలో) పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

'ఈ కార్యక్రమంలో మా నాన్నగారికి నివాళి అర్పించనున్నారు. నేను ఈ ఈవెంట్‌కు రావడానికి ప్రధాన కారణమిదే. ఈ ఏడాది ఆయన శతజయంతిని ఇక్కడ చేయాలని నిర్ణయించడం ఆనందం కలిగించింది. నాన్న గారు నటించిన సినిమాల్లో ఏది రీమేక్ చేస్తారని నన్ను అడిగితే సమాధానం చెప్పలేను. ఆయన 251 సినిమాల్లో నటించారు. వాటిలో ఏది ఇష్టం అని అడిగినా చెప్పలేను. ఆయన సినిమాను ఏదో ఒకదాన్ని రీమేక్ చేయడానికి ప్రయత్నిస్తాను. నాకు అన్నితరాల్లోనూ అభిమానులున్నారు. అది నా గొప్పతనం కాదు.. భారతీయ సినిమా గొప్పతనం. ఇండియన్ సినిమా సంస్కృతికి పెద్దపీట వేస్తుంది' అని నాగార్జున అన్నారు.

ఇక ఈ ఏడాది జరుగుతోన్న భారతీయ అంతర్జాతీయ సినిమా పండుగ (ఇఫ్ఫీ) తెలుగు వారందరికీ ప్రత్యేకం కానున్న విషయం తెలిసిందే. భారతీయ సినిమాపై చెరగని ముద్ర వేసిన నలుగురు ప్రముఖుల శత జయంతుల సందర్భంగా వారికి నివాళులర్పిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తెలుగు సినీదిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నార్) ఆ నలుగురిలో ఒకరు కాగా, మిగతా ముగ్గురు.. 'షోమేన్ ఆఫ్ ఇండియన్ సినిమా' రాజ్‌కపూర్, మధుర గాయకుడు మహమ్మద్ రఫీ, బెంగాలీ దర్శకుడు తపన్‌సిన్హా. 8 రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో వీరి చలన చిత్రాల ప్రదర్శన, సంగీత విభావరి, ఛాయాచిత్ర ప్రదర్శన తదితర కార్యక్రమాలు ఉంటాయి.

చీటికీ మాటికీ వచ్చే కోపం ఎంత చేటు చేస్తుందంటే..

'తన కోపమే తన శత్రువు..' అన్నారు పెద్దలు. ఆవేశానికి పోయి అవకాశాలు కోల్పోతే వచ్చిన ప్రమాదమేం లేదు. కానీ, కోపం కారణంగా ఆరోగ్య నష్టం జరుగుతుందనీ, తీవ్రమైన వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న చిన్న విషయాలకు ఆగ్రహోద్రిక్తులు అవుతున్నారంటే మీ ఆరోగ్యాన్ని చేజేతులా పాడుచేసుకుంటున్నారని గమనించాలి. ఇంతకీ చీటికీ మాటికీ వచ్చే కోపం ఎంత చేటు చేస్తుందంటే

కోపం కారణంగా కడుపులో అల్సర్, గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతాయి. కోపంగా ఉన్న సమయంలో మన మెదడులోని రక్తనాళాలు సంకోచిస్తాయి. ఇలాంటి పరిస్థితులలో కోపం ఒక్కొక్కసారి రక్తనాళాలు దెబ్బతినేలా చేస్తుంది. విపరీతమైన కోపం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దాని కారణంగా అనేక ఇన్ఫెక్షన్లు తలెత్తే ప్రమాదం ఉంది.

అధిక కోపం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మితిమీరిన కోపం తెచ్చుకోవడం ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. కోపం వల్ల తలనొప్పి, అధిక రక్తపోటు, నిద్రలేమి సమస్యలు పెరుగుతాయి. మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది.

ఒక్కొక్కసారి విపరీతమైన కోపం వల్ల బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. చాలా కోపంగా ఉండే వ్యక్తుల్లో కూడా మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. అంతేకాదు చర్మ సంబంధిత సమస్యలు సోరియాసిస్, ఎగ్జిమా వచ్చే అవకాశం ఉంది. అందుకే కోపాన్ని జయించి తన శాంతమే తకు రక్ష సూత్రాన్ని వంటబట్టించుకోవడం అవసరం.

పంటల సాగులో రసాయనాలు.. ఆరోగ్యానికి హానికరం

పెరుగుతున్న జనాభాకు తగినంత ఆహారం అందించే క్రమంలో రసాయన ఎరువులు, క్రిమిసంహారకాలు, కలుపు నాశనుల వాడకం పెరిగింది. పంటల దిగుబడులు బాగా పెరిగి ఆహార భద్రత సమకూరినప్పటికీ, ఇలాంటి ఆహారం వల్ల ఎనిమిది రకాలైన ప్రమాదకర రసాయనాలు మన ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వంటలు, కూరగాయలు, పండ్లతోటల్లో తెగుళ్లు, కలుపు మొక్కల నివారణకు మోనోక్రోటోఫాస్, ఆక్సిడెమెటాన్‌మిథైల్, ఏసిఫేట్, ప్రొఫెనోఫాస్, ఎలక్లార్, క్లోరోథాలోనిల్, మిథోమైల్, ట్యుగ్లైఫోసేట్ లాంటి క్రిమి సంహారకాలు, శిలీంధ్ర నాశకాలు, కలుపు నాశనులను పిచికారీ చేస్తారు. వీటిలో ఉండే హానికరమైన రసాయనాల వల్ల శ్వాస సమస్యలు, నాడీకణాలు ధ్వంసం కావడం, చర్మ సమస్యలు, జీర్ణవ్యవస్థలో ఇబ్బందులు, క్యాన్సర్లు అభివృద్ధి చెందడంలాంటి విపరిణామాలు సంభవిస్తాయి.

కాబట్టి, మన ఆరోగ్య సంరక్షణ కోసం తినే ఆహార పదార్థాల్లో దాగి ఉన్న ఈ రసాయనాల గురించి తెలుసుకుని ఉండాలి. మార్కెట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులను ఎంచుకోవడం, పండ్లు, కూరగాయలను బాగా కడిగి తినడం, సుస్థిర వ్యవసాయ విధానాలను అనుసరించడం మొదలైన చర్యల ద్వారా హానికరమైన రసాయనాల ప్రభావాన్ని తప్పించుకోవచ్చు.

పిల్లల్లో అధిక బరువుకు కారణమేంటి?

మా బాబుకు వదేండ్లు. ఇంతకుముందు బరువు మామూలుగానే ఉండేవాడు. సంవత్సరం నుంచి ఊహించనంతగా బరువు పెరుగుతున్నాడు. నిరుడు సైకిల్ పైనుంచి పడ్డాడు. తలకు గాయమైంది. వైద్యులను సంప్రదిస్తే మెదడులో రక్తస్రావమైందని చెప్పారు. శస్త్రచికిత్స చేశారు. అప్పట్నుంచి బరువు పెరుగుతున్నాడు. మా బాబుకు ఆటల పట్ల ఆసక్తి లేదు. ఎప్పుడూ ఏదో ఒకటి తింటూ ఉంటాడు. పిల్లల వైద్య నివుణుడిని సంప్రదిస్తే ప్రవర్తనకు సంబంధించిన సమస్య కాబట్టి చిరుతిళ్లు తగ్గించమని సూచించారు. ఆహారం తగ్గించినా ప్రయోజనం లేదు. కొన్నాళ్లకు అదే తగ్గుతుందిలే అనుకున్నాం. అయితే, మా బిడ్డ బరువు పెరగడానికి హార్మోన్ల సమస్య కారణమేమో అన్న సందేహం కలుగుతున్నది. మా సమస్యకు సరైన పరిష్కారం చూపగలరు.

ఒకే సంవత్సరంలో విపరీతమైన బరువు పెరిగాడని చెప్పారు. కానీ ఎంతన్నది చెప్పలేదు. వాస్తవానికి పిల్లలు ఒక ఏడాది కాలంలో ఒకటీ రెండు కిలోల కన్నా ఎక్కువగా పెరిగే అవకాశం లేదు. మీ బాబు మరీ ఎక్కువగా పెరిగినట్లు మీరు గమనించి ఉంటే, మళ్లీ ఓసారి ఇప్పుడు గ్రోత్ చాట్ సాయంతో అతని బరువుల్ని నమోదు చేయండి. పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదించి, ఈ బరువుకు బలమైన కారణం ఏమై ఉంటుందో నిర్ధారణ చేసుకోవాల్సి ఉంది. అలాగే మీ బాబు తలకు దెబ్బ తగిలిందని చెప్పారు.

ఒక్కోసారి తలకు గాయమైతే మెదడులోని గ్రంథులపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. మరో విషయం ఏమిటంటే.. ఈ రోజుల్లో పిల్లల్లో ఊబకాయం, స్థూలకాయం, ఒబేసిటీ వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఆరోగ్యకరమైనది కాకుండా ఎక్కువగా కొవ్వులు ఉన్న ఆహారం తీసుకోవడమే ఇందుకు కారణం. టీవీ, ఫోన్, ఇతర గ్యాడ్జెట్స్‌తో గడుపుతుండటమూ కారణమే. శారీరక శ్రమ లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం లాంటివి కూడా వింత ఆరోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయి. అయితే మీ బాబుకి హార్మోన్ల లోపం ఉన్నదా.. లేదా? అనేది తెలుసుకునేందుకు కొన్ని పరీక్షలు అవసరం.

మీ బాబు సైక్లింగ్, స్విమ్మింగ్ వంటి ఔట్‌డోర్ గేమ్స్‌లో పాల్గొనేలా చూడండి. కొవ్వు పదార్థాలు లేని ఆహారం ఇవ్వండి. ఇంకో విషయం ఏమిటంటే మీ బాబులో మీరు గమనించిన కొన్ని లక్షణాల గురించి చెప్పలేదు. హుషారుగా ఉంటున్నాడా.. లేదా? మలబద్ధక సమస్య ఏమైనా ఉందా? నిస్సత్తువగా, నిద్రమత్తుగా ఉంటున్నాడా? గమనించండి. ఇలాంటి సమస్యలు ఉన్నట్లయితే థైరాయిడ్ లాంటి హార్మోన్ సమస్య ఉండొచ్చు. ఈ విషయాలన్నీ గ్రహించి, సమస్య పరిష్కారం కోసం పీడియాట్రిషన్‌ను లేదా పీడియాట్రిక్ ఎండోక్రైనాలజిస్ట్‌ను సంప్రదిస్తే ఫలితం ఉంటుంది.

తుంటి తెచ్చే తంటాలు తుంటి నొప్పి...

తుంటి నొప్పి ఈ మధ్యకాలంలో చాలా మందిని వేధిస్తున్న సమస్య. గతంతో పోలిస్తే కరోనా వైరస్ వచ్చిపోయిన తరువాత తుంటి నొప్పి బాధితుల సంఖ్య పెరిగిందంటున్నారు వైద్య నివుణులు. కారణం వైరస్‌కు గురై, కోలుకున్న తరువాత రక్త సరఫరాలో అవరోధాలు ఏర్పడటమే. ఈ విధంగా రక్త ప్రసరణ మందగించడం వల్ల తలెత్తే తుంటి సమస్యను వైద్య పరిభాషలో 'ఎవాస్కులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్ జాయింట్' అంటారు. ఈ వ్యాధి ముందు నుంచే ఉన్నప్పటికీ కరోనాతరువాత బాధితుల సంఖ్య 20 శాతం పెరిగినట్టు చెబుతున్నారు వైద్యులు. ఈవ్యాధి రావడానికి ప్రధాన కారణాలేంటి? దీనివల్ల రోగికి కలిగే ఆరోగ్య సమస్యలు, నిర్ధారించే పద్ధతులు, వ్యాధి లక్షణాలు, చికిత్స తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

సాధారణంగా శరీరంలోని ఏ అవయవానికైనా పైనుంచి కిందికి రక్త సరఫరా జరుగుతుంది. కానీ తుంటి భాగానికి మాత్రం కింది నుంచి పైకి రక్తం సరఫరా జరుగుతుంది. దీనివల్ల ఇతర భాగాలతో పోలిస్తే తుంటి ఎముకకు రక్తం

సరఫరా మందగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అంటే తుంటి కీలు హిప్ జాయింట్‌కు రక్త ప్రసరణ అనేది తగ్గిపోతుంది. ఫలితంగా తుంటి కీలులోని ఎముక కణాలు క్రమంగా నశిస్తాయి. ఇవి పూర్తిగా నశిస్తే.. అక్కడున్న ఎముక కుళ్లిపోతుంది. ఇలా ఎముక కుళ్లిపోవడాన్నే వైద్య పరిభాషలో 'ఎవాస్కులర్ నెక్రోసిస్' అంటారు. దీనివల్ల రోగి తీవ్రమైన తుంటి నొప్పితో బాధపడతాడు. ఈ వ్యాధి సాధారణంగా నాలుగు దశల్లో ఉంటుంది.

మొదటి దశలో

%తొలి దశలో ఎముకలోని కణాలు నశించడం ప్రారంభమవుతుంది. దీంతో తుంటి నొప్పి మొదలవుతుంది. ఆరు వారాల్లో నొప్పి తగ్గకపోతే ఎంఆర్ఐ చేయించాల్సి ఉంటుంది. ఈ దశలో ఎంఆర్ఐ పరీక్షతో వ్యాధిని నిర్ధారించవచ్చు. మొదటి దశలోనే వ్యాధిని గుర్తించడం వల్ల సాధారణ చికిత్సతోనే రోగికి వ్యాధి ముదరకుండా జాగ్రత్త పడవచ్చు.

రెండో దశ

దీనిని ప్రీ కొలాప్స్ దశ అంటారు. ఈ దశలో కార్టిలేజ్‌కు సపోర్ట్‌గా ఉన్న ఎముక 25 శాతం నుంచి 50 శాతం వరకు దెబ్బతింటుంది. రోగిలో లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. రెండో దశలో వ్యాధిని గుర్తిస్తే శస్త్రచికిత్స అవసరం లేకుండానే మాత్రలతో వ్యాధిని నయం చేయవచ్చు. మొదటి రెండు దశల్లో వ్యాధిని గుర్తిస్తే సాధారణ చికిత్స ద్వారా ఎముక కుళ్లిపోవడం (బోన్‌డెత్) నుంచి రోగికి విముక్తి కల్పించవచ్చు.

మూడో దశ

మూడో దశను కొలాప్స్ దశ అనికూడా అంటారు. ఈ దశలో తుంటి కీలులోని ఎముక 50 శాతం నుంచి 75 శాతం వరకు అరిగిపోతుంది. ఈ దశలో రోగి భరించలేని నొప్పితో బాధపడతాడు. లేచి నిలబడలేడు. నడవలేడు. నొప్పి కారణంగా నిద్ర పట్టదు.

నాలుగో దశ

ఈ దశలో తుంటి ఎముక పూర్తిగా దెబ్బతిని, కప్ సైడ్ కూడా అరుగుదల మొదలవుతుంది. నాలుగో దశను ఆర్థరైటిస్ స్టేజ్ అంటారు. ఈ దశలో రోగి తుంటి కీలు ఎముక పూర్తిగా కుళ్లిపోతుంది. దీనివల్ల తుంటి కీళ్లు పనిచేయవు. దీంతో రోగి తీవ్రమైన నొప్పితో బాధపడతాడు. ఒకచోటు నుంచి మరోచోటుకు నడవడం సాధ్యవడదు. ఏదైనా వస్తువును తీసుకోవాలంటే వంగలేని పరిస్థితి. వీల్‌చైర్‌పైనే ఉండాల్సిన దుస్థితి నెలకొంటుంది. మూడు నాలుగు దశల్లో రోగి తుంటి నొప్పి నుంచి కోలుకోవాలంటే శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. అంటే తుంటి కీలు మార్పిడి చేయాల్సి వస్తుంది.

తుంటి నుంచి మోకాలి వరకు ఒకే నరం ఉండటం వల్ల కొందరిలో తుంటి నొప్పి ఉండదు. కానీ, మోకాలి నొప్పితోబాధపడతారు.

నిర్ధారణ పద్ధతులు

ఎక్స్‌రే ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. అందులో కనిపించకపోతే ఎంఆర్ఐ ద్వారా స్పష్టంగా నిర్ధారించవచ్చు.

ఎంఆర్ఐ ద్వారా వ్యాధి ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చు.

జాగ్రత్తలు

తుంటి నొప్పి ఆరువారాలకు మించి ఉంటే వెంటనే ఎముకల వైద్యుణ్ని సంప్రదించడం ఉత్తమం.

మొదటి లేదా రెండో దశలోనే వ్యాధిని గుర్తించడం మంచిది. అంటే స్వల్ప లక్షణాలు కనిపించగానే అప్రమత్తం కావాలి.

కరోనా వైరస్‌కు గురైన వారు నడుము లేదా గజ్జలలో నొప్పి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చికిత్సా పద్ధతులు

మొదటి రెండు దశల్లో సాధారణ ఔషధాలతోనే చికిత్స చేయవచ్చు. ముందుగా రోగి ఆరోగ్య చరిత్ర తెలుసుకోవాల్సి ఉంటుంది. అంటే రోగి స్టెరాయిడ్స్ వాడుతున్నాడా లేదా తెలుసుకోవాలి. ఒకవేళ స్టెరాయిడ్స్ వాడుతుంటే వెంటనే వాటిని నిలిపివేయాలి. షుగర్, బీపీ, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి వాటిని నియంత్రణలోకి తీసుకురావాల్సి ఉంటుంది. ధూమపానం, మద్యపానం అలవాట్లను మాన్పించడం లేదా తగ్గించడం చేయాలి. క్రమం తప్పకుండా ఫిజియో థెరపీ అవసరమవుతుంది. 'బై ఫాస్ఫోనేట్' మాత్రలను మూడు నెలలపాటు వైద్యుల పర్యవేక్షణలో వాడాల్సి ఉంటుంది. వీటితోపాటు కాల్షియం, డి-విటమిన్ కూడా తీసుకోవాలి. ఒకవేళ రెండోదైన ప్రీ కొలాప్స్ స్టేజ్‌లో నొప్పి తీవ్రంగా ఉంటే కోర్ డి-కంప్రెషన్, కోర్ డి-కంప్రెషన్‌తోపాటు ఎముక మూలుగ (బోన్ మ్యారో) చికిత్సకు వెళ్లాలి. అయితే లోకల్ పీఆర్‌పీ ఇంజెక్షన్‌లు ప్రయోగ దశలో ఉన్నాయి. ఇక మూడో దశ అయిన కొలాప్స్ దశ, నాలుగో దశలో ఉన్న రోగులకు మాత్రం పూర్తిగా తుంటి ఎముక మార్చడం ఒక్కటే మార్గం.

వ్యాధికి ప్రధాన కారణాలు

రక్త నాళాల్లో కానీ, రక్త ప్రసరణలో కానీ లేదా రక్తం తయారీలో కానీ అవరోధాలు ఏర్పడటం

దెబ్బలు తగలడం

మద్యపానం

ఎక్కువ మోతాదులోస్టెరాయిడ్స్ వాడటం

ఇతర కొన్ని రకాల ఔషధాలు

మీ జుట్టు తెల్లబడుతుందా.. అయితే గుండెజబ్బుల ముప్పు ఉన్నట్టే!

జుట్టు తెల్లబడటం ఇప్పుడు సర్వసాధారణం అయిపోయింది. పాతికేండ్లు నిండకుండానే జుట్టు నెరిసిపోవడం కనిపిస్తున్నది. చాలామంది దీన్ని చిన్న విషయంగా పరిగణిస్తుంటారు. దీనిని కాస్మాటిక్ అంశంగా నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరిస్తున్నారు పరిశోధకులు.

జుట్టు నెరవడం హృద్రోగానికి సంకేతమని చెబుతున్నారు. ఈజిప్ట్‌లోని కైరో యూనివర్సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా 545 మందిని ఎంపిక చేశారు. వాళ్ల ఆరోగ్యం, జుట్టు రంగు ఆధారంగా పరిశీలించారు. అందరూ ఒకే రకమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

పదేండ్ల పాటు వీళ్లను గమనించగా తెల్లజుట్టు ఉన్నవారిలో ఎక్కువ మందికి అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ ఉన్నట్టు కనుగొన్నారు. జుట్టు నల్లగా ఉన్నవాళ్లలో ఇలాంటి సమస్యలు అరుదుగా కనిపించాయి. తెల్లజుట్టు ఉన్నవాళ్లకు కొలెస్ట్రాల్ పెరగడం వల్ల గుండెజబ్బులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కాబట్టి ఇలాంటి వాళ్లు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుని ముందుజాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, D.No. 10-1-70/A, Lingojiguda, Opp. H.P Gas Agency, Karmanghat, Saroornagar ,RangaReddy(Dist.), Hyderabad - 500035, Telangana .Published at Plot No.43,Flat No.210,Raja Rjeswari APTS,HUDA Complex,Saroornagar,Ranga Reddy(Dist),Hyderabad.500035, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy